

నెపోలియన్
రూ|| 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



యుద్ధ విరమణకు సహకరించండి
ట్రంప్‌కు 600 మంది ఇజ్రాయెలీల విజ్ఞప్తి

లోపలి పేజీల్లో

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కొండ బాల




సంపుటి 08, సంచిక: 245 | మంగళవారం | 5-08-2025 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కాళేశ్వరం విఫల ప్రాజెక్టుగా మారడానికి

# కెసిఆరే ప్రధాన బాధ్యుడు

- అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనే బాధ్యత వహించాలి
- బ్యారేజీల్లో అపరిమిత జోక్యం వల్లే అవకతవకలు
- నిర్మాణానికి క్యాబినెట్గ్ ఆమోదమే లేదు
- హరీశ్ రావు నిపుణుల నివేదికను పట్టించుకోలేదు
- నిబద్ధత లోపించిన ఈటల
- భారీగా ప్రజాధనం దుర్వినియోగం
- జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికకు క్యాబినెట్ అమోదం

02



ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ హామీలతో కెఐపిసిఎల్ రూ. 87,449.15 కోట్ల (మార్చి 2022 నాటికి) రుణాలను సేకరించింది. 'ఈ రుణాలతో పాటు వడ్డీ తిరిగి చెల్లించే భారం రాష్ట్ర ప్రభుత్వంపైనే పడే అవకాశం ఉన్నది. సెప్టెంబర్ 2024 నాటికి అసలు, వడ్డీగా మొత్తం రూ.29,737.06 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మిగిలిన అసలు రూ.64,212.78 కోట్లకుగాను సుమారుగా రూ. 41,638 కోట్ల అదనపు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.రూ. 1,690.09 కోట్ల రుణాలను ప్రభుత్వానికి మళ్లించి, మార్జిన్ మనీ రూ. 4011.52 కోట్లను వినియోగించ-డంతో ప్రభుత్వంపైన అదనంగా వడ్డీ భారంపడింది. టెండర్ తర్వాత ధరల సర్దుబాటును చేయడంతో అదనంగా మొత్తం రూ.1,342.48 కోట్ల ఖర్చు పెరిగింది. అలాగే ఇతర 'పెరిగిన రేట్లు, కాంట్రాక్టర్లకు అనవసర ప్రయోజనాలు అదనంగా మొత్తం రూ. 612.51 కోట్లను చెల్లించారు.

**పెద్ద మొత్తంలో వడ్డీలు...**

### మేడిగడ్డ కుంగుబాటు పాపం

## కెసిఆర్, హరీశ్‌లదే



మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు పాపం ముమ్మాటికీ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు, మాజీ మంత్రి హరీశ్ రావులదేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాణహిత చెవేళ్ల ప్రాజెక్టును మేడి గడ్డకు తరలించడం మాజీ సిఎం సొంత నిర్ణయమని పిసిఘోష్ కమిషన్ వెల్లడించిన విషయాన్ని గుర్తు చేశారు. మూడు బ్యారేజ్‌లకు జిఒ నంబర్లు 231,23 2లకు క్యాబినెట్ ఆమోదం లేదని, ఆ సమయంలో నీటిపారుదల శాఖా మంత్రి ఆమోదం చట్టబద్ధంగా చెల్లదని ఆ నివేదికలో తేట తెల్లమైందన్నారు. వరద రక్షణ చర్యలు ఇతరత్రా పేరుతో టెండర్లు లేకుండానే కాంట్రాక్టర్లకు పనులు అప్పనంగా అప్పగించారని, దురుద్దేశపూర్వకంగా ఎటువంటి ప్రాజెక్టు నివేదిక లేకుండానే రూ.369 కోట్ల విలువైన పనులు ఏజెన్సీలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రాజెక్ట్‌ను రూపొందించారని వివరించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయిన అనంతరం పెరిగిన ధరల ప్రకారం అదనంగా రూ.1342 కోట్లు చెల్లించడం తో పాటు అక్రమంగా మరో రూ.612 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారని తెలిపారు.

### కమిషన్ నివేదికపై కోర్టుకు వెళ్ళొచ్చు : బిఆర్ఎస్

### కాళేశ్వరంపై కేంద్రం సిబిఐ దర్యాప్తు చేయాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్




### ఘోష్ కమిషన్ నివేదికను త్వరలోనే



# అసెంబ్లీలో ప్రవేశపెడతాం

- ప్రధాన ప్రతిపక్షనేత కెసిఆర్, నాటి మాజీ మంత్రులతో పాటు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటాం
- ఆ తర్వాతే భవిష్యత్ కార్యాచరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్:

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జస్టిస్ పి.సిఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను త్వరలోనే శాసన సభ, శాసనమండలి సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సమా వేశంలో ప్రధాన ప్రతిపక్ష నేత కెసిఆర్, అప్పటి మాజీ మంత్రులతో పాటు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతనే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు. కమిషన్ సూచనలను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. జస్టిస్ సిపి ఘోష్ నివేదికలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదని, ఇదొక స్వతంత్ర జ్యుడిషియల్ కమిషన్ నివేదిక అని సిఎం వివరించారు. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మంత్రి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశనంతరం డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క,మంత్రులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కెసిఆర్ రీడిజైనింగ్ పేరుతో మార్పులు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మించారని, 2023 అక్టోబర్ ప్రాంతంలో మేడిగడ్డ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్లకు పగుళ్లు వచ్చాయని, ఈ ప్రాజెక్ట్‌లో ప్రణాళిక, నిర్మాణం, నిర్వహణ లోపం, డిజైనింగ్‌పైన పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడే సాంకేతిక నిపుణులు నివేదికను సమర్పించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కుంగిపోయిన బ్యారేజీని పిసిసి తరువాయి 2లో

### క్యాబినెట్ ఆమోదంపై ఈటల తప్పడు సమాధానం



తాము చెప్పే అంశాలు రాజకీయపరమైనవి కావు ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలు యధాతథంగా మీడియా సమావేశంలో వెల్లడిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్కమార్క చెప్పారు. అప్పటి సిఎం కెసిఆర్ ప్రమేయం, సూచనల మేర కే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాలకు, నిర్మాణ, నిర్వహణ, ఆర్థిక క్రమశిక్షణ లోపానికి కారణమనే విషయాన్ని జస్టిస్ పి.సి ఘోష్ నివేదిక స్పష్టం చేసిందని డిప్యూటీ తరువాయి 2లో



### జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి

## శిబు సోరెన్ మృతి

రాష్ట్రపతి, ప్రధాని, సిఎం, పలువురు ముఖ్యనేతలు సంతాపం

జెఎంఎం వ్యవస్థాపకుడి మృతి బాధాకరం : సిపిఐ

**రాంచి/ న్యూఢిల్లీ :** జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ప్రముఖ గిరిజన నాయకుడు, జెఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్ (81) సోమవారం తుది శ్వాస విడిచారు. శిబు సోరెన్ కిడ్నీ సంబంధిత సమస్యలతో ఢిల్లీలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో నెల రోజులకు పైగా చికిత్స పొందుతున్నారు.'గౌరవనీయులైన దిషోం గురూజీ మనందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయారు... నేను ఈరోజు 'శూన్య' (సున్నా) అయ్యాను' అని హేమంత్ సోరెన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అవిభక్త బిహార్‌లో భాగమైన రామ్‌గఢ్ జిల్లాలో శిబూసోరెన్ జన్మించారు. ఆయన సతీమణి పేరు రూపీ సోరెన్. ఆయనకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు హేమంత్, బసంత్, దుర్గా సోరెన్. కుమార్తె పేరు అంజలి. 2009లో దుర్గా సోరెన్ మృతి చెందారు. బసంత్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. సంతాల్ తెగకు చెందిన శిబు సోరెన్... వామపక్ష నేత ఎకె.రాయ్, కుర్మి మహతో బినోద్ బిహారీ మహతోతో కలిసి 1972 లో జార్ఖండ్ ముక్తి మోర్చాను ఏర్పాటు చేశారు. తర్వాత ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన పోరాటం లో కీలక నేతగా ఎదిగారు. ఆ పోరాట ఫలితంగా 2000 లో జార్ఖండ్ తరువాయి 2లో

### ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు

# తెలంగాణ నంబర్ వన్ హబ్




- భారత దేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా ఇప్పటికే హైదారాబాద్‌కు గుర్తింపు
- ఒన్ ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం
- 'ఎలి లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి

అందరి సహకారంతో ప్రపంచంలోనే ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో అమెరికాకు చెందిన 'ఎలి లిల్లీ గ్లోబల్ కేపబిలిటీ ఫార్మా కంపెనీని సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ఎలి లిల్లీ పరిశ్రమ యాజమాన్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగంలో ఇది చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే చేసిన ప్రయత్నాల ఫలితంగానే ప్రస్తుతం హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి రాజధానిగా ఎదిగిందని చెప్పారు. ఇందుకు ఈ కార్యక్రమమే తిరుగు లేని నిదర్శనం అన్నారు. భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా హైదరాబాద్ ఇప్పటి కే గుర్తింపు పొందిందన్నారు. 2000కు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఇక్కడ ఉన్నాయని, అదేవిధం గా మరో 200కి పైగా ప్రఖ్యాత అంతర్జాతీయ సం స్థలు హైదరాబాద్ నగరం నుంచి తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని ఆయన వివరించారు. ప్రభుత్వ చిత్తశుద్ధి, దృష్టికోణం, కృషి ఫలితంగానే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ విజయం సాధించడంలో అహర్నిశలు శ్రమించిన మంత్రి శ్రీధర్ బాబు, జయేశ్ తరువాయి 2లో

### బిఆర్ఎస్‌కు గువ్వల గుడ్‌బై



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌కు రాజీనామా లేఖలను పంపారు. ప్రస్తుతం ఆయన బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. బిజెపిలోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆహ్వానించేందుకు బిజెపి నేత చేసిన ప్రయత్నాన్ని బయటపెట్టిన నాటి నలుగురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ఆయన కూడా ఒకరు. ఈవ్యవహారం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ నెల రెండో తేదీనే బిఆర్ఎస్‌కు గువ్వల రాజీనామా చేసినప్పటికీ కాళేశ్వరం అక్రమాలపై నివేదికను క్యాబినెట్ ఆమోదించిన రోజే రాజీనామా లేఖ సోషల్‌మీడియాలో బహిర్గతమైంది.

### జమ్ముకశ్మీర్‌కు

## రాష్ట్ర హోదా

- పునరుద్ధరణ కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలి
- ప్రధాని మోదీకి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా లేఖ

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించాలని, ఈ వ్యవహారంలో మరింత జాప్యం చేయొద్దని, ఇందుకోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. ఇదే అంశమై ఆయన సోమవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. అధికరణ 370ను ఏకపక్షంగా రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించి ఆరేళ్లు గడిచాయని గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌కు మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. 'దీర్ఘకాలం ప్రజా ప్రభుత్వం లేకపోయినా, విపత్తులు ఎదురైనప్పటికీ జమ్మూకశ్మీర్ ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల తరువాయి 12లో



### అమెరికా సుంకాలు, భారత్–యుకె ఒప్పందాలకు నిరసనగా 13న దేశవ్యాప్త

## ప్రతిఘటన

కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం పిలుపు

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారతదేశంపై విధించిన 25 శాతం సుంకాలు, యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)తో మన దేశం కుదుర్చుకున్న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం(సెటా)ను వ్యతిరేకిస్తూ ఆగస్టు 13న దేశవ్యాప్త నిరసనలకు పది కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్‌కెఎం)లు పిలుపునిచ్చాయి. ఈ ప్రతిఘటన ఉద్యమంలో ట్రాక్టర్, మోటార్ సైకిల్ ప్రదర్శనలు, నిరసన ప్రదర్శనలు, సభలు, నిర్వహిస్తామని ప్రకటించాయి. ట్రంప్ చర్య భారత్ లక్ష్యంగా చేస్తున్న ఆర్థిక బెదిరింపులు, రష్యాతో వాణిజ్య సంబంధాలను నిర్దేశించడమే అవుతుందని ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి. భారత రైతులు, కార్మికులు, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని విదేశీ తరువాయి 12లో

### బిసి బిల్లుపై బిజెపిది

## ద్వంద్వ వైఖరి

- కష్టించని వారికి కోట్లకొలది ఆస్తులా?
- బ్యాంకుల్లో అప్పులు తీసుకుని కట్టకుండా విదేశాల్లో తల దాచుకుంటున్న బడా పారిశ్రామిక వేత్తలు
- సిపిఐ సంగారెడ్డి జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/సంగారెడ్డి

బిసి రిజర్వేషన్ల బిల్లులపై బిజెపి ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని, బిల్లును చట్టం కాకుండా అడ్డుకుంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. అసెంబ్లీలో బిల్లుకు, బిజెపి అనుకూలంగా మద్దతివ్వగా ఢిల్లీలో మాత్రం అడ్డుకుంటుందని దుయ్యబట్టారు. దేశంలో కష్టపడేవాడికి తిండిలేదని, ఏ కష్టం చేయనివాడికి కోట్ల కొలది ఆస్తులు ఏలా తరువాయి 12లో






బిసిలకు 42 శాతం కోసం

### కాంగ్రెస్ చలో ఢిల్లీ

చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో దేశ రాజధానికి వెళ్లిన హస్తం నేతలు, కార్యకర్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు చర్లపల్లి నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలుదేరారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఎఐసిసి తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి జెండా ఊపి రైలును ప్రారంభించారు. వీరితో పాటు కాంగ్రెస్ తరువాయి 12లో

### యెమెన్ తీరంలో

## మరో విషాదం

వలసబోటు బోల్తా : 68 మంది మృతి


**సనా:** యెమెన్ తీరంలో వలస ప్రజలతో వెళుతున్న ఒక బోటు బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న 68 మంది మరణించారు. మరో 74 మంది గల్లంతయ్యారు. వీరికోసం సహాయబృందాలు గాలిస్తున్నాయి. వీరంతా కరువు,పేదరికం తాండవించే ఇథియోపియా దేశానికి చెందినవారే. సోమవారం నాటికి ఘటన జరిగి అనేక గంటలు గడచిపోవడంతో మృతులసంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనావేస్తున్నారు. తీరప్రాంతానికి అనేక మృతదేహాలు కొట్టుకువచ్చాయి. దారిద్ర్యాన్ని, అంతఃఘర్షణలను తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## ఉద్రిక్తతలమధ్య ట్రంప్ దూత విట్‌కాఫ్ రేపు మాస్కో పర్యటన



**మాస్కో:** రష్యా—అమెరికా మధ్య ఉద్రిక్తతలు నెలకున్న తరుణంలో ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ బుధవారం (ఆగస్టు 6) మాస్కోను సందర్శించనున్నారు. అమెరికా, రష్యా అధికారులు ఇద్దరూ సోమవారంనాడు ఈ విషయాన్ని ధృవీకరించారు. ఉక్రేన్‌తో ఒప్పందం చేసుకోవడానికి రష్యాకు ట్రంప్ విధించిన 12రోజుల గడువు వచ్చేవారంతో ముగుస్తుంది. ఈ విషయంపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ చేసిన వ్యాఖ్యలు చాలా రెచ్చగొట్టేవిగా ఉన్నాయని ట్రంప్ మండిపడ్డారు. రష్యాకు సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో రెండు అమెరికా అణు జలాంత ర్గాములను ముందు జాగ్రత్తచర్యగా మోహరించాలని నావికాదళానికి ట్రంప్ ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో రెండుదేశాలమధ్య ఉద్రిక్తతలు పెరగడంతో విట్‌కాఫ్ బుధవారం మాస్కో పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ట్రంప్ జలాంతర్గాముల మోహరింపు విషయాన్ని రష్యా ఎక్కువచేసి మాట్లాడటంలేదు. విట్‌కాఫ్ పర్యటన పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎదురుచూడాలని రష్యా నాయకత్వం భావిస్తున్నది.

# శిబు సోరెన్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంగా ఏర్పడింది. 2005లో ఆయన తొలిసారి సిఎం అయ్యారు. ఆయన మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటికీ.. ఒక్కసారి కూడా పూర్తికాలం పదవిని నిర్వహించలేకపోయారు. 2004లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినా.. అక్కడా అదే పరిస్థితి. 1974 నాటి కేసు కారణంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. తన మాజీ కార్యదర్శి హత్య కేసులో దోషిగా తేలడంతో మరోసారి కేంద్రమంత్రి పదవిని కోల్పోయారు. ఒక హత్యకేసులో కేంద్రమంత్రి దోషిగా తేలడం అదే తొలిసారి. అయితే ఢిల్లీ హైకోర్టు తర్వాత ఆయన్ను నిర్దోషిగా తేల్చింది. శిబూ సోరెన్‌కు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉంది. ఆయన ఎనిమిది సార్లు లోక్‌సభ, రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి మరణం తర్వాత జార్ఖండ్ అసెంబ్లీని నిరవధికంగా వాయిదా వేయగా, రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించింది. దేశవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. శిబు సోరెన్ భౌతికకాయాన్ని సోమవారం సాయంత్రం ఢిల్లీ నుండి రాంచీకి తరలించారు. మంగళవారం రామ్‌గఢ్ జిల్లాలోని ఆయన స్వగ్రామానికి తీసుకెళ్లి అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని జెఎంఎం పార్టీ తెలిపింది.

**రాష్ట్రపతి, ప్రధాని సహా పలవురు ముఖ్యులు సంతాపం**

శిబు సోరెన్ మరణానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సామాజిక న్యాయ రంగానికి పెద్ద లోటని ఎక్స్‌లో పోస్టుచేశారు. శిబు సోరెన్ గిరిజన వర్గాలకు, పేదలకు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం పట్ల ప్రత్యేకించి మక్కువ చూపారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 'శిబు సోరెన్ జీ ఒక అట్టడుగు స్థాయి నాయకుడు. ఆయన ప్రజల పట్ల అచంచలమైన అంకితభావంతో ప్రజా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. గిరిజన వర్గాలకు, పేదలకు, అణగారిన వర్గాలకు సాధికారత కల్పించడం పట్ల ఆయనకు ప్రత్యేక మక్కువ ఉంది' అని ఆయన ఎక్స్‌లో అన్నారు. ప్రధాని మోదీ ఆసుపత్రిని సందర్శించి శిబు సోరెన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. జార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్, పార్టీలకు అతీతంగా నాయకులు జెఎంఎం వ్యవస్థాపకుడి మృతికి సంతాపం తెలిపారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బిహార్, ఒడిశా, తమిళనాడు, మేఘాలయ, తెలంగాణ ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, మమతా బెనర్జీ, నితీష్ కుమార్, మోహన్ చరణ్ మాఝి, ఎం కె స్టాలిన్, కాన్రాడా కె సంగ్మా, ఎ. రేవంత్ రెడ్డి సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

**శిబు సోరెన్ మృతి బాధాకరం: సిపిఐ**

దేశంలోని గొప్ప గిరిజన నాయకుడ్ని కోల్పోయిందని, జార్ఖండ్ రాజకీయ దిగ్గజం శిబు సోరెన్ మరణం బాధాకరమని సీపీఐ సంతాపం ప్రకటించింది. ఆయనను గిరిజన హక్కులు, సామాజిక న్యాయం చాంపియన్‌గా శ్లాఘించింది. జార్ఖండ్ గుర్తింపు, రాజకీయ ఎదుగుదలలో శిబు సోరన్ పాత్ర కీలకమని, అణగారిన వర్గాల గళాన్ని వినిపించడంలోనూ ఆయన ప్రముఖంగా వ్యవహరించాంటూ సోమవారం ఒక ప్రకటనలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం పేర్కొంది. 'శిబు సోరెన్... సీపీఐ నాయకుడు వినోద్ బిహారీ మహతో, మార్క్సిస్టు నాయకుడు ఏకే రాయ్‌తో కలిసి జార్ఖండ్ ముక్తీ మోర్చాను స్థాపించారు. ఇది గిరిజనుల హక్కులు, గుర్తింపు సాధన కోసం పోరాట మాధ్యమంగా మారింది. ఆదివాసీలకు ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాటం, జార్ఖండ్ రాజకీయ ఆవిర్భావానికి శిబు సోరెన్ గణనీయమైన తోడ్పాటు అందించారు. ఆయనను జార్ఖండ్ మరువలేదు.ఎప్పటికీ గౌరవిస్తుంది' అని సీపీఐ పేర్కొంది.

# యుద్ధ విరమణకు సహకరించండి

## ట్రంప్‌కు 600 మంది ఇజ్రాయెలీ మాజీల విజ్ఞప్తి

**టెల్‌అవీవ్:** గాజాలో యుద్ధం విరమించేందుకు పూర్తి సహకారం అందించాలని దాదాపు 600 మంది ఇజ్రాయెలీ మాజీ అధికారులు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు. ఇజ్రాయెల్—గాజాలలో ప్రజలు యుద్ధ విరమణకు సుముఖంగా ఉన్నప్పటికీ పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. గాజాలో ఆకలి చావులు, ఆహార కేంద్రాలవద్ద వేచిఉన్న పాలస్తీనియన్లపై ఐడిఎఫ్ కాల్పుల హత్యలు అనూహ్యంగా పెరిగిపోయిన తర్వాత యూరప్‌దేశాలతోపాటు ఇజ్రాయెల్‌లోని సాహిత్యవేత్తలు, మానవహక్కుల సంఘాలవారు కూడా యుద్ధ విరమణకోసం పెద్దపెట్టున విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇజ్రాయెల్‌లో మెజారిటీ ప్రజలకు మీపై ఎంతో విశ్వాసం ఉంది, మీరే ఆ దేశాన్ని, నేతన్యాహూ ప్రభుత్వాన్ని సరైన మార్గంలో నడిపించగలుగుతారు, దయచేసి గాజాలో ప్రజల బాధలు తొలగించండి, హమాస్ వద్ద ఉన్న బందీలను విడిపించండి, యుద్ధాన్ని తక్షణం ఆపండి అని 600 మంది ఇజ్రాయెలీ మాజీ అధికారులు ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు. ఒకవైపు ఇజ్రాయెలీ మాజీ అధికారులు ఇలాంటి విజ్ఞప్తులు చేస్తుంటే, మరోవైపు ట్రంప్ మాత్రం గాజాలో ఎలాంటి నరమేధం జరగడంలేదని, అక్కడ జరుగుతున్నది ఖచ్చితంగా యుద్ధమేనని స్పష్టం చేశారు. గాజాలో ప్రజల ఆకలి తీర్చాలని అమెరికా భావిస్తోందని, ఈ పని తమ దేశం మాత్రమే చేయగలదని కూడా ఆయన చెప్పుకున్నారు. కాల్పుల విరమణపై హమాస్‌తో ఇజ్రాయెల్ చేస్తున్న పరోక్ష చర్చలు స్తంభించిపోయినందువల్ల గాజాలో యుద్ధాన్ని విస్తరించాలని నెతన్యాహూ ప్రయత్నాలు చేస్తున్నారన్న వార్తలు వెలువడిన నేపథ్యంలో వీరంతా ట్రంప్‌కు పైవిధంగా ఉమ్మడి విజ్ఞప్తి చేశారు. గాజాలో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ 60,000 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు.

**షరతులు ఒప్పుకుంటే ఇజ్రాయెలీ బందీలకు ఆహారం : హమాస్**

గాజాలో హమాస్ ఉగ్రవాదులవద్ద 22 నెలలుగా బందీలుగా ఉన్న ఇజ్రాయెలీ పౌరులు తమ సమాధులను తామే తవ్వుకుంటున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తమను సమాధి చేయడం కోసం ఇద్దరు బందీలు తమ గోతులు తామే తవ్వుకుంటున్న రెండు వేరు వేరు వీడియోలను గడచిన 48 గంటల్లో హమాస్ విడుదల చేసింది. ఈ వీడియోల ద్వారా బందీల గురించి కొంత సమాచారం తెలిసిందని వారిని చేరుకునే









అవకాశం, విడిపించే అవకాశాలు మెరుగుపడ్డాయని రెడ్‌క్రాస్ వ్యాఖ్యానించింది. తమ దేశీయులకు ఆహారం అందించేందుకు సహాయం చేయాలని ఇజ్రాయెల్ కూడా రెడ్‌క్రాస్‌ను కోరింది. తమ షరతులు ఒప్పుకుంటే బందీలకు కడుపునిండుగా ఆహారం పెడతామని హమాస్ ప్రతిస్పందించింది. గాజాలో యుద్ధాన్ని విరమించి సైన్యాన్ని వెనక్కు మళ్ళిస్తేనే బందీలను విడుదల చేస్తామని హమాస్ హెచ్చరిస్తుండగా, బందీలను విడుదల చేస్తేనే యుద్ధం విరమిస్తామని ఇజ్రాయెలీ ప్రభుత్వం ప్రకటించింది. మధ్యవర్తులు అనేక నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు వీరిద్దరి పట్టుదలవల్ల విఫలమవుతున్నాయి. హమాస్—ఇజ్రాయెల్ మధ్య దాదాపు ఒప్పందం జరిగే పరిస్థితి దగ్గరపడిందని గతనెలారంభంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హడావుడి చేశారు. కానీ హమాస్ అలవికాని ఆంక్షలు విధిస్తోందని ఇజ్రాయెల్ విమర్శించింది. బందీలను విడుదల చేయకపోతే గాజా పరిసర ప్రాంతాలను ఇజ్రాయెల్‌లో విలీనం చేసుకుంటామని నెతన్యాహూ బెదిరిస్తున్నారు. బందీలు అతిదీనమైన దుస్థితిలో జీవిస్తున్న దృశ్యాలను వీడియోలో చూసిన ఇజ్రాయెలీ బందీల కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. హమాస్‌కు లొంగిపోవాలని ఆ కుటుంబీకులు కోరుతున్నారు. ఒక గుర్తుతెలియని ప్రదేశంలో ఎవ్వతార్ డేవిడ్ అనే 24 ఏళ్ళు వయసుగల ఇజ్రాయెల్‌కు చెందిన పౌరుడు తన సమాధిని తానే తవ్వుకుంటున్న దృశ్యాన్ని హమాస్ ఆదివారం నాడు విడుదల చేసింది.

ఆహారంలేక బక్కచిక్కి ఎండిన ఎముకలగూడులా ఉన్న డేవిడ్ పారతో మట్టిని తవ్వుతూ నా సమాధి నేనే తవ్వుకుంటున్నా, ఇక ఇంటికి వెళతానన్న ఆశలేదు అని చేసిన వ్యాఖ్యలు అందరి హృదయాలను కలచివేస్తున్నాయి. అంతకుముందురోజు శనివారంనాడు కూడా రోమ్ బ్రాస్లావ్స్కీ అనే 21 ఏళ్ళ యువకుడు తనను విడిపించాలని వేడుకుంటున్న ఒక వీడియోను పాలస్తినా ఇస్లామిక్ జీహద్ ఉగ్రవాద సంస్థ విడుదల చేసింది. ఈ రెండు వీడియోలు విడుదలైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూ ఈ ఇద్దరు బందీల కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి వారిని ఓదార్చారు. బందీల విడుదలకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని భరోసా ఇచ్చారు.

### స్వతంత్ర పాలస్తినా ఆవిర్భవిస్తేనే ఆయుధాలు వదిలిపెడతాం

సార్వభౌమాధికార, స్వతంత్ర పాలస్తినాదేశం ఆవిర్భవించినప్పుడే తాము ఆయుధాలను వదిలిపెడగామని హమాస్ ఉగ్రవాద సంస్థ మరోసారి ఉద్ఘాటించింది. రెండు రోజుల క్రితం కూడా ఇదేవిషయాన్ని ఇజ్రాయెల్‌కు స్పష్టం చేసింది. గాజాపై మధ్యవర్తుల ద్వారా జరిగిన పరోక్ష చర్చల్లో కూడా ఇజ్రాయెల్‌కు ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పామని తెలిపింది. ఆయుధాలు వదిలిపెట్టేందుకు హమాస్ సిద్ధంగా ఉందని రెండు రోజుల క్రితం మధ్యాసియాలో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ చేసిన ప్రకటనను ఖండిస్తూ హమాస్ ఈ విషయం వెల్లడించింది. ఫ్రాన్స్,బ్రిటన్, కెనడా సహా అనేక యూరప్ దేశాలు పాలస్తినాను సెప్టెంబరునెలలో స్వయంప్రతిపత్తిగల దేశంగా గుర్తిస్తామని ప్రకటించాయి. జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తినా దేశం ఆవిర్భవిస్తేనే తాము ఎవ్వరినైనా నమ్ముతామని హమాస్ నిర్ద్వంద్వంగా స్పష్టం చేసింది.

### ప్రజలను భ్రమల్లో ఉంచుతున్న నెతన్యాహూ

నెతన్యాహూ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ఉంచుతూ యుద్ధాన్ని విస్తరిస్తోందని ఇజ్రాయెలీ బందీల ఫోరం విమర్శించింది. బందీల వీడియోలు విడుదల కావడంతో ఫోరం నిరసన ప్రదర్శన జరిపింది. ప్రజలను మభ్యపెడుతున్న నెతన్యాహూ సైనిక దాడినే పరిష్కారంగా చూపిస్తున్నారని, ఉగ్రవాదులను ఏరివేస్తామని చెప్పడంద్వారా కాలం గడిపేస్తున్నారని, దీనివల్ల బందీలకు విముక్తి కలగడంలేదని బందీల ఫోరం విమర్శించింది. యుద్ధం, ఒప్పందాలకు సంబంధించిన నిజాలను ప్రజలకు చెప్పాలని వారు కోరారు.

అదేవిధంగా, గాజాలో ఆకలిచావుల ఫొటోలను చూసి ఐడిఎఫ్ చర్యలను ఖండించిన యూరప్ దేశాలు ఇజ్రాయెల్ బందీ తన సమాధిని తానే తవ్వుకుంటున్న దృశ్యాలున్న వీడియోలను కూడా చూసి తీవ్రంగా ఖండించాయి. సత్వరం బందీలను విడుదల చేయాలని పలు యూరప్ దేశాలు హమాస్‌ను కోరాయి.

బందీలకు ఆహారం ఇవ్వకుండా మాడ్చి చంపుతున్నాయని యూరప్ దేశాలు విమర్శించాయి. ఇప్పటికీ హమాస్ వద్ద 49 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారు. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌లో ఒక సంగీత ఉత్సవం జరుగుతుండగా హమాస్ ఉగ్రవాదులు మూకుమ్మడి దాడిచేసి కాల్పులు జరిపారు. 1200మందిని కాల్చి చంపారు. మరో 251 మందిని కిడ్నాప్‌చేసి తీసుకుపోయారు. వీరిలో ఇప్పటికీ ఇంకా 49 మంది సజీవులుగా ఉండాల్సి ఉంది. కానీ 27 మంది మాత్రమే జీవించి ఉంటారని ఇజ్రాయెలీ ప్రభుత్వం అంచనా వేస్తున్నది.

# కాళేశ్వరం విఫల ప్రాజెక్టుగా మారడానికి
# కెసిఆరే ప్రధాన బాధ్యుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు ఒక విఫలమైన ప్రాజెక్టుగా మారడంలో నాటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రధాన బాధ్యుడు అని, ప్లానింగ్, నిర్మాణాన్ని పూర్తి చేయడం, నిర్వహణ అంశాల్లో జరిగిన అక్రమాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనే (కెసిఆర్) బాధ్యత వహించాల్సి ఉంటుందని జస్టిస్ పిసి ఘోష్ న్యాయ విచారణ కమిషన్ స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో కెసిఆర్ అపరిమిత జోక్యం వల్లనే అవకతవకలు జరిగాయని వెల్లడించింది.ప్రాజెక్ట్ నిర్మాణానికి మంత్రివర్గ అనుమతి లేదని కీలక అంశాన్ని కమిషన్ వెల్లడించింది.'తెలంగాణకు జీవనాడి'గా ఉండాల్సిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్రజాధనం దుర్వినియోగమే కాకుండా ఓ విఫల ప్రాజెక్ట్‌గా మారిందని స్పష్టం చేసింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికను' అధ్యయం చేయాలి త్రిసభ్య అధికారుల కమిటీ రూపొందించిన క్లుప్త నివేదికను సమర్పించింది.ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం ఈ నివేదికను ఆమోదించింది. మంత్రివర్గ సమావేశనంతరం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల సమక్షంలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశంలో' కాళేశ్వరం నివేదిక'పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

**జస్టిస్ పిసి ఘోష్ నివేదికలోని కీలక అంశాలు :**

పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక వైఫల్యాలు, విపరీతమైన రాజకీయ జోక్యం, వ్యక్తిగత నిర్ణయాలే మేడిగడ్డ కుంగిపోవడం, సుందిళ్ల, అన్నారం పగుళ్లకు కారణమని జస్టిస్ పి.సి. ఘోష్ న్యాయ విచారణ కమిషన్ నివేదిక వెల్లడించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో చోటు చేసుకున్న అక్రమాలు, బాధ్యత రహిత్యానికి సంబంధించి ఎవరి పాత్ర ఏమిటి అనేది నివేదికలో స్పష్టం చేసింది. ప్లానింగ్, నిర్మాణం పూర్తి చేయడం, ఆపరేషన్, నిర్వహణ అంశాల్లో జరిగిన అక్రమాలకు ప్రత్యక్షంగా , పరోక్షంగా అప్పటి సిఎం కెసిఆర్ బాధ్యత వహించాల్సి ఉందని, బ్యారేజీలకు జరిగిన నష్టానికి ఆయనేకారణం అని తెలిపింది. అప్పటి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్ రావు కూడా ముఖ్యమంత్రితో కలిసి, నిపుణుల కమిటీ నివేదికను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని తెలిపింది. అప్పటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అప్పడప్పుడే 'కొత్తగా ఏర్పాడిన రాష్ట్ర ఆర్థిక శ్రేయస్సును, భద్రత నిబద్ధతను పాటించలేదని, ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాల విషయంలో తనకు ఏమి తెలియని బాధ్యతారహిత వైఖరిని వ్యక్తం చేశారని ఆ నివేదికలో పొందుపర్చారు.

అలాగే ముఖ్య అధికారులతో పాటు అప్పటి కొంత మంది సిఎంఒ అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యం స్పష్టంగా ఎత్తి చూపింది.. ఈ ప్రాజెక్టు కుంగి పోవడానికి కారణమైన వీరంతా బాధ్యులేనని స్పష్టం చేసింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల వైఫల్యానికి రాజకీయ నిర్ణయాల ప్రభావం చూపిందనిచ ప్రాజెక్టు అధికారులు, ఏజెన్సీ అధికారులు పరస్పర సమ్మకంతోనే అక్రమంగా ప్రజా ధనం నుండి లాభం పొందేలా కుట్ర పన్నారని రిపోర్ట్‌లో పేర్కొన్నారు. దీంతో మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో భారీ నష్టం జరిగిందని, ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా వ్యాప్కోస్‌కోకు చెల్లించిన రూ. 677.67 లక్షలను రికవరీ చేయాలని ప్రభుత్వానికి సూచించింది.


**అధికారుల బాధ్యతారాహిత్యాన్ని బహిర్గతం చేసిన కమిషన్ :**

- నాటి నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కెఐపిసిఎల్) చైర్మన్ ఎస్.కె. జోషి నిపుణుల కమిటీ నివేదికను దాచిపెట్టడం, శాసన ఆమోదాలలో బిజినెస్ రూల్స్ ఉల్లంఘించడంతో సహా కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైఫల్యాలకు బాధ్యత వహించాలి.
- నాటి ముఖ్యమంత్రి కార్యాలయం అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ 'బాధ్యతలను జవాబుదారితనంతో నిర్వర్తించకపోవడంతో పాటు క్యాబినెట్ ఆమోదాలకు సంబంధించి బిజినెస్ రూల్స్ పాటించకుండా వ్యతిరేకంగా వ్యవహరించారు.
- నీటి పారుదల ఇంజినీర్ ఇన్ చీఫ్, స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ,హై పవర్ కమిటీ సభ్యులు సి.మురళీధర్ నిపుణుల కమిటీ నివేదికను దాచిపెట్టడం, కేంద్ర జల కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇవ్వడం, తప్పుడు అంచనాలను ప్రతిపాదించడం, ఆపరేషన్, నిర్వహణలో విఫలం కావడం వంటి అంశాలపై బాధ్యత వహించాలి.
- ప్రాణహిత – చేవెళ్ళ సుజల స్రవంతి (పిసిఎస్ఎస్) ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్, కెఐపిసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలను నిర్వర్తించిన బి.హరిరామ్ నిపుణుల కమిటీ నివేదికను బహిర్గతం చేయకుండా, సిడబ్ల్యుసికి తప్పు సమాచారం ఇవ్వడంతో పాటు ఆ తర్వాత మూడు బ్యారేజీలకు జరిగిన వైఫల్యానికి సంబంధించి తనకు సంబంధం లేదనడం తీవ్రమైన తప్పు.. ఆయన కూడా బాధ్యుడే ..
- కాళేశ్వరం ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఎన్. వెంకటేశ్వర్లు (సిఈ), కె. సుధాకర్ రెడ్డి (సిఈ), సర్దార్ ఓంకార్ సింగ్ (ఈఈ),ల నిర్లక్ష్యం, అసత్య సమాచారం, బాధ్యతల నిర్వహణలో తప్పిదాలకు పాల్పడ్డారు.
- ఇంజినీర్‌ఇన్‌చీఫ్ బి.నాగేందర్ రావు 2021 జనవరి 1 నుండి ఆపరేషన్ , నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు, ఆ తప్పును మిగతవారిపై నెట్టే ప్రయత్నం చేశారు. ఈ కారణంగా మూడు బ్యారేజీలకు నష్టాన్ని కలిగించడంతో పాటు నాణ్యత నియంత్రణ లోపానికి కూడా ఆయనే బాధ్యత వహించాలి.
- టి.ప్రమీల (చీఫ్ ఇంజనీర్, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్): తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడం, భద్రతా విధులు, పరిక్షణల్లో విఫలమయ్యారని, డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం చర్యలకు అర్హురాలు. .
- టిఎస్ఇఆర్ఎల్ సిఈ జె. శ్రీదేవి, జి.అనిల్ కుమార్, ఎ.నరేందర్ రెడ్డి, కె.ఎస్.ఎస్. చంద్రశేఖర్, బసవరాజు, టి.శ్రీనివాస్, ఓంకార్ సింగ్ మోడల్ టెస్ట్‌లు సక్రమంగా నిర్వహించలేదు.

**ఆర్థిక పరమైన అంశాలు:**


- ముందుగా కాళేశ్వరంప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ. 38,500 కోట్లు
- 2016లో సిఎం లేఖ ఆధారంగా ఇది రూ.71,436 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం.
- ఆ తరువాత (2022 మార్చి వరకు) రూ.1,10,248.48 కోట్లకు పెరిగిన వ్యయం.

### కాళేశ్వరంపై కేంద్రం సిబిఐ దర్యాప్తు చేయాలి
#### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్



కాళేశ్వరం అవినీతి, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ నివేదిక వచ్చిందని, ప్రభుత్వం అధికారికంగా కూడా వెల్లడించిందని తెలిపారు. ఏ మూల చూసినా దాంట్లో అవినీతి జరగలేదని చెప్పడానికి వీలు లేదన్నారు. అవినీతి జరిగిన మాట వాస్తవమేనని, డిజైన్‌లు మార్చిన మాట వాస్తవమేనని నారాయణ అన్నారు. కెసిఆర్ స్వయంగా తానే డిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుకు రాజకీయ రూపకల్పన చేశారే తప్ప, సాంకేతిక రూపకల్పన చేయలేదని అన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో పని చేసిన మామూలు ఉద్యోగులు దగ్గర కూడా కట్టలు కట్టలు కోట్ల రూపాయలు దొరికాయన్నారు. కింద పని చేసిన వారికే కోట్లు దొరికితే, దానికి రూపకల్పన చేసిన వారి వద్దకు ఇంకెంత చేరి ఉంటాయని ప్రశ్నించారు. బిజెపికి నిజంగా బిఆర్‌ఎస్‌పై ప్రేమే లేకపోతే, సిబిఐ దర్యాప్తునకు ఆదేశించి, నిష్పాక్షికంగా దర్యాప్తు చేసి చర్య తీసుకోవాలని నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలా చర్య తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలా తామంతట తాము చేసే, అహంభావంతో చేసే పనులకు అడ్డుకట్టు వేసి, అవినీతిని అరికట్టే అవకాశం ఉంటుందన్నారు.

### కమిషన్ నివేదికపై కోర్టుకు వెళ్ళొచ్చు : బిఆర్‌ఎస్




కమిషన్ ఇచ్చిన ఇచ్చిన నివేదిక ఫైనల్ కాదని, దాని మీద కోర్టుకు వెళ్ల వచ్చు అని కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టంలోనే ఉందని బిఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ నేతలు చిరుమళ్ల రాకేశ్ కుమార్, అభిలాష్ రంగినేనిలతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ నివేదికను యథాతథంగా ఎందుకు బహిర్గతం చేయలేదు? అని ప్రశ్నించారు. మాజీ సిఎం కెసిఆర్ మీద నిందలు మోపడానికి 665 పేజీల జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ నివేదికను 60 పేజీలకు కుదించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఘోష్ కమిషన్ నివేదిక మొత్తం బయట పెట్టకుండా, అధికారుల ఇచ్చిన నివేదిక ఎందుకు బయటపెడుతున్నారు? అని అన్నారు. కాళేశ్వరం ప్రయోజనాలు చూడాలే తప్ప అక్కడ కట్టారు, ఇక్కడ కట్టారు అంటూ ఆరోపించడం విడ్డూరంగా ఉందని నిరంజన్ రెడ్డి చెప్పారు.

# అసెంబ్లీలో ప్రవేశపెడతాం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షునిగా తాను, రాహుల్‌గాంధీ తదితరులతో కలిసి మేడిగడ్డను సందర్శించామని, కాంగ్రెస్ అధికారరరంలోనికి రాగానే లక్ష కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలిపోయిన ఘటనపైన విచారణ చేపడుతామని తాము ప్రజలకు మాట ఇచ్చామని సిఎం గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే జస్టిస్ పి. సిఘోష్ ఛైర్మన్‌గా మార్చి 14వ తేదీ 2023లో జ్యు డీషియల్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 16 నెలల విచారణ అనంతరం పిసి ఘోష్ కమిషన్ 665 పేజీలతో సుదీర్ఘమైన నివేదికను ప్రభుత్వానికి అందజేసిందని, ఈ నివేదిక సారాంశాన్ని సంక్షిప్త రూపంలో నివేదికను రూపొందించేందుకు ఐఎఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని నియమించామని, ఆ నివేదికను మంత్రివర్గ సమావేశంలో సమర్పించారని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**అనుకూలంగా ఉంటే ఒకలా.. లేదంటే మరోలా బిఆర్‌ఎస్‌కు అలవాటే....**

జస్టిస్ పి.సి ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నివేదికను బిఆర్‌ఎస్ తప్పుపట్టడం సహజమేని, నివేదిక వారికి అనుకూలంగా ఉంటే ఒకలా,లేకపోతే మరోలా మాట్లాడటం బిఆర్‌ఎస్‌కు అలవాటేనని చెప్పారు. కాళేశ్వరం నివేదిక రాజకీయ, ప్రభుత్వ నివేదిక కాదని, ఇదొక స్వతంత్ర జ్యుడిషియల్ విచారణ కమిషన్ అని, జస్టిస్ పినాకి చంద్రఘోష్ సుప్రీంలో న్యాయమూర్తిగా, అలాగే లోక్‌పాల్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహారించారని వివరించారు. విచారణ కమిషన్ 16 నెలల పాటు విచారణ చేపట్టిందని, అందరికీ సమానమైన అవకాశాలు కల్పించిందని, కవిత అప్పుడే విచారణ కమిషన్‌కు ఫిర్యాదు చేసి, ఉంటే ఆమెను కూడా విచారణకు ఆహ్వానించేవారని సిఎం అన్నారు. విచారణ పూర్తయిన తర్వాత నివేదికపైన ఎవరు ఎలా స్పందిస్తారనేది వారి విజ్ఞతకే వదిలిపెడుతామని సిఎం అన్నారు. ప్రభుత్వం నివేదిక సారాంశాన్ని పాటిస్తుందని, రాజకీయ కక్షపూరితంగానో, లేదా వ్యక్తిగత ద్వేషంతోనే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోబోదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# ఈటల తప్పుడు సమాధానం

(మొదటి పేజీ తరువాయి)

సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణం విషయంలో అప్పటి సిఎం కెసిఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యక్తిగత నిర్ణయమని, ఇందులో ప్రభుత్వానికి సంబంధిచిన అధికారిక నిర్ణయం లేదని నివేదిక స్పష్టం చేసిందని, క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయాలను మంత్రివర్గంలో ఆమోదం పొందినట్టు ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్ కమిషన్‌కు తప్పుడు సమాధానం చెప్పినట్టు కూడా నివేదికలో ఉన్నదని అన్నారు. వ్యక్తిగత నిర్ణ యం, రాజకీయ ప్రభావం, ప్రణాళిక, సాంకేతిక, ఆర్థిక క్రమశిక్షణలో తీవ్ర వవైఫల్యం కారణంగానే ప్రజాధనాన్ని భారీగా వృదా జరిగిందని కమిషన్ తన నివేదికలో నొక్కి చెప్పిందని భట్టి విక్రమార్క వివరించారు.

# తెలంగాణ నంబర్ వన్ హబ్

(మొదటి పేజీ తరువాయి)

రంజన్‌లకి, పాలుపంచుకున్న అధికారులందరికీ సిఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఇది తెలంగాణ రైసింగ్ 2047 దిశగా మేము వేసిన మరొక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. తెలంగాణను ఒన్ ట్రిలియన్ డాలర్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన పునరుద్ఘటించారు. 2047 నాటికి తెలంగాణను త్రీ(మూడు)ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతామని గుర్తు చేశారు. ఎలీ లిల్లీ సంస్థ లీడర్ షిప్‌ను,ఉద్యోగులను హైదరాబాద్ నగరానికి సాదరంగా ఆహ్వానం పలుకుతున్నానని తెలిపారు. తెలంగాణపై నిరంతర నమ్మకం ఉంచి, అండగా నిలిచి అన్ని విధాలుగా మద్దతు ఇస్తున్నందుకు పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రపంచ శ్రేణి కార్పొరేషన్లకు, కంపెనీలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన ఎలీ లిల్లీ నూతన కేంద్రం, ఆ సంస్థ గ్లోబల్ కార్యకలాపాలను మరింత వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ టెక్నాలజీ, ఇన్నొవేషన్ సెంటర్, ప్రపంచ వ్యాప్తంగా రోగులకు పరిష్కారాల కోసం పరిశోధనలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎలీ లిల్లీ సంస్థను హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడమంటే ఈ నగరం ఘనతను మీరు ప్రపంచానికి చాటి చెప్పినట్లే అని అన్నారు. హైదరాబాద్ నగరంలో టాలెంట్, లీడర్‌షిప్, విజన్, మంచి పాలసీ ఉందని, అంతేకాకుండా మౌలిక సదుపాయాలు ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకే ఎలీలిల్లీ లాంటి గ్లోబల్ లీడర్‌కు ఇది అనుకూలమైన కేంద్రంగా మారిందన్నారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్ ఉత్పత్తిలో సుమారు 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ప్రతి మూడు టీకాలలో ఒకటి హైదరాబాద్‌లో అభివృద్ధి చేయడం లేదా తయారవుతుండటం మాకు గర్వకారణం అన్నారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, భారతదేశంలోని అతిపెద్ద లైఫ్ సైన్సెస్ పరిశోధన, అభివృద్ధి సముదాయంగా నిలిచిందని తెలిపారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సంస్థల కోసం హైదరాబాద్ అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రపంచ గమ్యస్థానంగా మారింది. ఎలీ లిల్లీ సంస్థ రాకతో, లైఫ్ సైన్సెస్ రంగంలో మేము మరో మెట్టుకు చేరుకున్నాం. మధుమేహం, ఆంకాలజీ, ఇమ్యునాలజీ, న్యూరోసైన్స్ రంగాలలో ఎలీ లిల్లీ సంస్థ కృషి ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుందని తెలిపారు. ఎలీ లిల్లీ సంస్థ చేసిన కృషి మిలియన్ల మంది జీవితాలను ప్రభావితం చేయడంతో వారిని రక్షించడానికి తోడ్పడింది. నేను, మా ప్రభుత్వం అన్ని వేళలా మీకు అండగా ఉంటాం అని ఆయన భరోసా ఇచ్చారు. పారదర్శకత, అభివృద్ధి, ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తాం అని అన్నారు. హైదరాబాద్‌లో పని చేయబోయే ఎలీ లిల్లీ ఉద్యోగులు.. కేవలం హైదరాబాద్‌లో నివసించడం, పనిచేయడం మాత్రమే కాదు ఇప్పుడు మీరు మా కుటుంబ సభ్యులుగా మారారని తెలిపారు. అందరు హైదరాబాద్ నుంచి గ్లోబల్ హెల్త్‌కేర్ భవిష్యత్తును తీర్చిదిద్దనున్నారు. మీ సహకారంతో, తెలంగాణను భారతదేశ లైఫ్ సైన్సెస్ రాజధానిగా మాత్రమే కాకుండా.. ప్రపంచంలో ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలకు నంబర్ వన్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు.

మనమందరం కలిసి కొత్త ఆవిష్కరణలు చేద్దాం, ప్రజల జీవితాలను మారుద్దాం, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును పునర్ నిర్వచిద్దాం అని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుతో పాటు పరిశ్రమ యాజమాన్యం ప్రసంగించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రైల్వే ఎజిఎంగా బాధ్యతలు స్వీకరించిన సత్య ప్రకాష్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజనీర్స్‌కు చెందిన సత్య ప్రకాష్ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ (ఎజిఎం) గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు సత్యప్రకాష్ దక్షిణ మధ్య రైల్వేలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్స్ట్రక్షన్)గా పనిచేశారు. ఐఐటి ఢిల్లీ నుండి సివిల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీని పూర్తి చేశారు. సత్య ప్రకాష్ భారతీయ రైల్వేలలో 35 సంవత్సరాల విశిష్ట సేవలో అనేక ముఖ్యమైన పదవులను నిర్వహించారు.

రైల్వే బోర్డు విజిలెన్స్ డైరెక్టర్‌గా, ఐఆర్‌సిఒఎన్ ఇన్‌చార్జ్‌గా, మొదలైన పదవులలో బాధ్యతలను నిర్వహించారు. వారు పశ్చిమ రైల్వేలో సురేందర్ నగర్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా తన ఉద్యోగ ప్రస్థానంను ప్రారంభించిన సత్యప్రకాష్ నార్త్ సెంట్రల్ రైల్వేలో కూడా సేవలందించారు. సత్య ప్రకాష్ గిర్డర్ వంతెనలపై 'లాంగ్ వెల్డెడ రైల్స్' పై మూడు సాంకేతిక పత్రాలను ప్రచురించారు.

# రాష్ట్రంలో భారీ వర్షాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో పలుచోట్ల ఈ నెల 8 వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, ఉత్తర తమిళనాడు తీరం వెంట సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందన్నారు. తూర్పుపశ్చిమ ద్రోణి తూర్పు మధ్య అరేబియా సముద్రం దక్షిణ భాగాల నుంచి దక్షిణ ఇంటీరియర్ కర్నాటక, తమిళనాడు మీదుగా మధ్య బంగాళాఖాతం తీర ప్రాంతంలోని ఉపరితల ఆవర్త నం వరకు కొనసాగుతుందని తెలిపారు. సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. ఎత్తుకు వెళ్లే కొద్దీ దక్షిణం వైపు వంగి ఉందని చెప్పా రు.

సోమవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. బుధవారం నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. గురువారం మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో, శుక్రవారం నల్లగొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు.

**కలెక్టర్లు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి : సిఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

విపత్తు సహాయక బృందాలు అందుబాటులో ఉండాలని, తక్షణమే స్పందించాలని అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతా ధికారులతో సిఎం రేవంత్ రెడ్డి సోమవారం ప్రత్యేకంగా మాట్లాడారు. జిహెచ్‌ఎంసితో పాటు రాష్ట్రవ్యాప్తంగా వరద నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించా రు. రానున్న రెండు, మూడు రోజులు వర్షాలు ఉంటాయనే సమాచారం ఉన్నందున కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని, ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

# సంక్షేమం, నాణ్యమైన విద్యకు పెద్దపీట

**సోషల్ వెల్ఫేర్ గురుకులాల్లో ఇకపై స్టీల్ పాత్రల్లో వంటావార్పు**

**ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్**



**ప్రజాపక్షం/కరీంనగర్:** సాంఘీక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యను అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎస్సీ, ఎస్టీ మైనార్టీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాలలో స్టీలు పాత్రల్లో వంటా వార్పు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. పాఠశాలలో వంటకు కావలసిన స్టీలు పాత్రలను ఈ సందర్భంగా అందజేశారు. అంతకు ముందు భోజనశాల, వంట గదులు, అల్పాహారం నాణ్యతను పరిశీలించిన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. వ్యిదార్థినులతో కలిసి అల్పాహారం చేసి మార్నింగ్ పాఠశాల అసెంబ్లీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ మాట్లాడుతూ అల్యూమినియం పాత్రల్లో ఆహారం నిల్వ ఉంచడం వల్ల కొన్ని ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయని, అందువల్ల రాష్ట్రంలోని సుమారు 700 గురుకులాల్లో స్టీలు పాత్రల్లో వంటావార్పు చేపట్టనున్నామని తెలిపారు. మొట్టమొదటిగా కరీంనగర్ జిల్లా అలుగునూరులోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో ప్రారంబించామని తెలిపారు. స్టీలు పాత్రల కోసం నిధులు మంజూరు చేస్తామని అన్నారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, బలవర్థక ఆహారం నాణ్యమైన విద్యలే లక్ష్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్పోరేట్ స్కూళ్లకు దీటుగా తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాలను తీర్చదిద్దుతున్నామని, అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అలుగునూరు గురుకుల విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు పేరుపొందిన విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం అభినందనీయమని అన్నారు. అలుగునూరు పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి సూచించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకులాల సంస్థ కార్యదర్శి అలుగు వర్షిణి మాట్లాడుతూ స్టీలు పాత్రల్లో వంటా వార్పు విధానాన్ని కరీంనగర్‌లో ప్రారంభించామని, మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. అన్ని గురుకలాలకు అవసరమైన సిబ్బందిని కేటాయిస్తామని అన్నారు. విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన ఫోన్ మిత్రను ఉపయోగించుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే ఫోన్ మిత్ర ద్వారా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అలుగునూరు సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు పలు రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇక్కడ నిర్వహించిన విద్యార్థుల అసెంబ్లీ అద్భుతంగా ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వాహిని యూట్యూబ్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు నేర్చకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఐఐఎం ఏర్పాటుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలి

**లోక్‌సభలో గళమెత్తిన వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య**



**ప్రజాపక్షం/హనుమకొండ :** తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటుపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. దేశంలో ఐఐఎం లేకపోయిన ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని ఎంపీ గుర్తు చేశారు. లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐఐఎంకు అవసరమైన భూమి, మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. "హైదరాబాద్‌లో ఇప్పటికే ఐఎస్బీ, ఐఐటీ హైదరాబాద్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఐఐఎం ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉందని ఎంపీ తెలిపారు. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రశ్నకు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్ స్పందిస్తూ ప్రస్తుతం హైదరాబాదులో ఐఐఎం స్థాపనకు ఎటువంటి ప్రతిపాదన కేంద్రం వద్ద పరిశీలనలో లేదని చెప్పారు. దేశంలో ఇప్పటికే 21 ఐఐఎంలు ఉన్నాయని వివరించారు. కేంద్రం స్పందనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం శక్తివంతమైన వృద్ధిని కొనసాగించడానికి, పరిశ్రమ, ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా పెరుగుతున్న డిమాండ్ ను తీర్చడానికి నాణ్యమైన మానవ వనరుల అవసరం కీలకంగా మారిందన్నారు. ఇండస్ట్రియల్, ఇన్నోవేషన్, స్టార్ట్ అప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటివాటి డిమాండ్‌లను తీర్చేందుకు తెలంగాణ రాష్ట్రం లో ఐఐఎం ఏర్పాటు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి తెలంగాణ రాష్ట్రానికి తప్పనిసరి ఐఐఎం మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014, సెక్షన్ 93 ప్రకారం అపాయింటెడ్ డే నుంచి 10 ఏళ్ల వ్యవధిలో వారసత్వ రాష్ట్రాల పురోగతి, స్థిరమైన అభివృద్ధి కోసం షెడ్యూల్ 13లో పేర్కొన్న విధంగా తెలంగాణలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాలు పెంచండి

**సిఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికుల వేతనాలను పెంచాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రధానమంత్రి పోషణ్ అభియాన్ మార్గదర్శకాలను అమలు చేయాలని కూడా ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం, తెలంగాణ మధ్యాహ్న భోజన వంట కార్మిక సంఘం నాయకులు ఢిల్లీలో ధర్మేంద్ర ప్రధాన్‌ను, అలాగే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా, తమ గౌరవ వేతనాన్ని పెంచాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సమావేశంలో, నాయకులు ప్రస్తావించిన పెండింగ్ నిధుల గురించి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, కేంద్రం తరపున నిధులన్నీ విడుదల చేశామని, ఏ బిల్లులు కూడా పెండింగ్‌లో లేవని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కృషి చేస్తానని కూడా ఆయన హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ గౌరవ వేతనం రూ.17,000కు పెంచాలని, అలాగే కార్మిక చట్టం కింద సామాజిక భద్రత, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్‌లను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఈ హామీలో భాగంగానే, కార్మికుల వేతనాల పెంపుపై ముఖ్యమంత్రికి ఈ లేఖను సోమవారం రాశారు.

# ఫిలిం ఛాంబర్ ముట్టడి

- భారీగా తరలిన సినీ కార్మికులు
- నిర్మాతల మండలి అత్యవసర సమావేశం
- పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్‌ను అడ్డుకున్న కార్మికులు



**హైదరాబాద్ :** తెలుగు సినిమా కార్మికు ల వేతనాల పెంపు విషయం ఇంకా కొలిక్కి రాలే దు. సోమవారం నుంచి షూటింగ్‌లకు సహాయ నిరాకరణ సమ్మె ప్రకటించిన సినీ కార్మికులు ఫిలిం ఛాంబర్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద ఎత్తున కార్మికులు ఫిలిం ఛాంబర్ కు తరలివచ్చారు. ఈ సమయంలోనే నిర్మాతల మండలి హాలులో సీనియర్ నిర్మాతలు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. నిర్మాతలు చర్చించుకుంటున్న సమయంలోనే సినీ కార్మికులు ఛాంబర్ ను ముట్టడించారు. ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్ బాబు, దిల్ రాజు, అల్లు అరవింద్, సి. కల్యాణ్, శివలెంక క్రిష్ణ ప్రసాద్, మైత్రి రవి తదితరులు సమావేశానికి హాజరై చర్చించారు. ఇప్పుడు ఉన్న సినిమా మార్కెట్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని 5శాతం మాత్రమే పెంచగలం అని చర్చి జరిగింది. ఇదే విషయాన్ని ఇంతకు ముందు సినీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులతో ఛాంబర్ జరిపిన చర్చల్లో స్పష్టం చేశారు. కానీ కార్మికులు మాత్రం అంగీకరించలేదు. 5శాతం పెంచితే అస లు ఒప్పుకునేది లేదని కార్మిక నేతలు బల్లగుద్ది మరీ చెప్పారు. దీంతో ఛాంబర్ కు, ఫెడరేషన్ నేతలకు మధ్య చర్చలు విఫలం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కార్మికులు షూటింగ్ బంద్ కు పిలుపునిచ్చారు.

కొంతమంది నిర్మాతలు షూటింగ్ పూర్త యి సినిమా విడుదల అయినాక కూడా కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇప్పటికీ ఇవ్వలేదని కార్మికులు వాపోతున్నారు. పెద్ద బ్యానర్ల నుంచే బకాయిలు రావాల్సి ఉందని అంటున్నారు. ముఖ్యంగా జూనియర్ ఆర్టిస్టులకు సంబంధించిన బకాయిలు చాలా పెండింగ్‌లో ఉన్నాయని, అందుకే ఏ రోజు షూటింగ్ జరిగితే ఆ రోజే డబ్బులు ఇచ్చేయ్యాలని డిమాండ్ పెట్టామని కార్మికులు తెలిపారు. 30శాతం వేతనాలు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ అన్నారు. ఇదిలా ఉంటే అన్నపూర్ణ స్టూడియోలో పవన్ కళ్యాణ్ నటిస్తున్న ఓ సినిమా షూటింగ్ జరుగుతుంటే కార్మికులు కొంతమంది అక్కడికి వెళ్లి షూటింగ్ ఆపేశారు. యూనియన్‌లకు సంబంధించిన కార్మికులతో కాకుండా బయటి నుంచి వ్యక్తులను తీసుకొచ్చి షూటింగ్ చేయడం సబబు కాదని, ఫెడరేషన్ నిబంధనలకు విరుద్ధం అని తెలిపారు. బయటి వ్యక్తులతో షూటింగ్ చేస్తే తాము చూస్తూ ఊరుకోలేమని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోలో బయటి నుంచి వచ్చిన వారితో చేస్తుంటే కొందరు అడ్డుకున్నారని కార్మికులు పేర్కొన్నారు. వేతనాలు పెంపు విషయం కార్మిక శాఖా దృష్టికి కూడా వెళ్లిందని అన్నారు.

# బిసిల రిజర్వేషన్ల హక్కులు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు రిజర్వేషన్ల హక్కులు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బిసి రిజర్వేష్ల కోసం తమిళనాడులో 9 సంవత్సరాల పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్లకు కేంద్రంలోని బిజెపి కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా తాము దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. బిసిలకు 42 శాతం రిజర్వే న్ల సాధనకోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కవిత హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ధర్నాచౌక్ లో సోమవారం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలలో పలు బిసి, ప్రజా సంఘాలు పాల్గొని, సంఘీభావం వ్యక్తం చేశారు. ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ నేత అర్జున్ సింగ్ చౌతాల కూడా దీక్ష శిబిరాన్ని సందర్శించి, కవితకు మద్దతు ప్రకటించారు. అంతకుముందు కవిత మాట్లాడుతూ తమిళనాడు ప్రభుత్వం పట్టుపట్టడంతోనే బిసి రిజర్వేషన్లు సాధ్యమయ్యాయన్నారు. రాజకీయ పార్టీలు ఏం మాట్లాడినా పట్టించుకోకుండా బిసి రిజర్వేషన్ల సాధన కోసం బిసిలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ చెప్పింది పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లు ప్రత్యేకంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి, దీనికి సంబంధించి బిసి, ముస్లిం రిజర్వేషన్లు వేర్వేరుగా పెట్టాలని డిమాండ్ చేశారు. సిపి ఘోష్ కమిషన్ నివేదికలో కెసిఆర్ పేరును 36 సార్లు ప్రస్తావించినంత మాత్రాన ఆయన తప్పు చేసినట్టు కాదని, అదొక కాంగ్రెస్ పార్టీ కమిషన్ అని చెప్పారు. ఈ ధర్నాలో యుపిఎఫ్ కన్వీనర్ బొల్ల శివ శంకర్, కో ఆర్డినేటర్ అలకుంటల హరి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి,తదితరులు పాల్గొన్నారు.

**నిరశన దీక్ష పొడిగింపుకు హైకోర్టు నిరాకరణ**

వెనుకబడిన తరగులకు (బిసి) 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బిఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాకురాలు కల్వకుంట్ల కవితకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ధర్నా చౌక్ వద్ద సోమవారం కవిత ప్రారంభించిన దీక్షకు పోలీసులు 72ల పాటు కొనసాగించేందుకు అనుమతి ఇవ్వలేదంటూ తెలంగాణ జాగృతి లీగల్ సెల్ అధ్యక్షుడు అప్పల నరేందర్ యాదవ్ అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. దీనిని న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మ ణ్ సోమవారం విచారణ చేపట్టారు. పోలీసుల వాదనలు వినకుండా ఏవిధమైన ఉత్తర్వులను జారీ చేయబోమని తేల్చి చెప్పారు.

నిరాహార దీక్ష 72గంటలపాటు నిర్వహించేందుకు అనుమతి కోరితే పోలీసులు సాయంత్రం వరకే అనుమతి ఇచ్చారని పిటిషనర్ న్యాయవాది ముక్రమ్ అలీ చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 200 మందితో నిరాహారదీక్షకు సెంట్రల్ జోన్ పోలీస్ కమిషనర్ అనుమతి ఇచ్చారని చెప్పారు అయితే పిటిషనర్ 72 గంటల అనుమతి కోరారని చెప్పారు. ఈ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. పోలీసుల వాదన తెలుసుకునే వరకు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయబోనని తేల్చి చెప్పింది.

## నరక కూపాలుగా వసతి గృహాలు

**ఒక పక్క ఆకలి కేకలు..మరో పక్క కల్తీ ఆహారం**

**ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యకు ప్రాధాన్యతనిస్తుంది. దశాబ్దకాలంలో గురుకుల పాఠశాలలతోపాటు సంక్షే మ హాస్టళ్ల సంఖ్యను గణనీయంగా పెంచారు. కానీ అధికారుల పర్యవేక్షణా లోపం, స్థానిక అధికారుల అవినీతి, నిర్లక్ష్య వైఖరి, విద్యార్థుల పాలిట శాపంగా మారింది. మౌలిక వసతుల లేమి కారణంగా దోమల బారినపడి విష జ్వరాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క సిబ్బంది ఉడికి ఉడకని ఆహారం పెట్టడం, మెనూను అమలు చేయకపోవడంతో సంక్షే మ హాస్టళ్లు, గురుకులాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. మరో పక్క కల్తీ ఆహారం విద్యార్థుల ప్రాణాలపైకి తీసుకు వస్తుంది. ముఖ్యం గా మారుమూల హాస్టళ్లలో పరిస్థితి దయనీయంగా ఉంది. తిరుమలాయపాలెం మండలంలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు విష జ్వరాల బారిన పడి అల్లాడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు.

ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చీపురుగూడెంలో విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోవడంతో ఆకలితో అలమటించి రోడ్డెక్కిన విషయం గమనా ర్హం. అధికారులు గురుకులాలకు ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్న గుత్తేదారులతో కుమ్మక్కు అవుతున్నారని దీనితో నాణ్యత లేని ఆహార పదార్థాలను సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. ఇక సంక్షేమ అధికారులు వసతి గృహాల వైపు కన్నెత్తి చూడటం లేదు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా వసతి గృహాలపై దృష్టిసారించి మౌలిక వసతుల కల్పనతో పాటు ఆహార పదార్థాలు, సంక్షేమ సిబ్బంది హాజరు తదితర విషయాలపై దృష్టిసారించకపోతే గురుకులాలు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది.

# గిరిజన ఆశ్రమంలో విద్యార్థులకు అస్వస్థత



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని గిరిజన ఆశ్రమ వసతి గృహంలో 37 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వెంటనే విద్యార్థులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఉడికీ ఉడకని అల్పాహారం తీసుకోవటం వలన విద్యార్థులకు కడుపులో నొప్పి రావడంతో ఆసుపత్రికి సంక్షేమ అధికారిణి విజయనిర్మల, సిబ్బంది 11 గంటల సమయంలో ఆసుపత్రికి తరలించారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఒ సీతారాములు వైద్యులు నవ్యకాంత్, సిహెచ్‌సి వైద్యులు రమేష్ బృందం ఆధ్వర్యంలో వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న విద్యార్థులను పరామర్శించి జరిగిన విషయాన్ని, వివరాలను తెలుసుకున్నారు.

కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిస్థితిని వైద్యం అందుతున్న వివరాలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వసతి గృహాన్ని సందర్శించి పరిసరాలు పరిశుభ్రత, సౌకర్యాలు, భోజన వసతి వంటశాలలను పరిశీలించి అనంతరం విద్యార్థులతో మెనూ అందిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నా రు. విద్యార్థునిలు ఈ విషయాన్ని ఎమ్మెల్యేకు నేరుగా తెలియపరిచారు.

కిచిడి బాగాలేదని నీళ్ల చారు, ప్రతిరోజు అందిస్తున్న భోజనం మెనూ ప్రకారం అందించడం లేదని ఆహారంలో తెల్ల పురుగులు, రాళ్లు, మెరిగలు, ముక్క పురుగులు, ఉంటున్నాయని తెలిపారు.

ఈ విషయంపై ఎమ్మెల్యే వెంటనే ఆగ్రహం వ్యక్తంచేసి ఉన్నతాధికారులకు తెలియపరచారు. ఆసుపత్రి ఆవరణ అంతా ఆశ్రమ వసతి గృహం తల్లిదండ్రులు, బిడ్డలు ఆర్తనాదాలు మిన్నంటాయి.

ఈ విషయమై విద్యార్థి సంఘాలు ఎఐఎస్‌ఎఫ్ మడుపల్లి లక్ష్మ ణ్ ఆధ్వర్యంలో, ఎస్‌ఎఫ్ఐ, పిడిఎస్‌యు, సిపిఐ, దామాల దయాకర్ రావు, ఎఐటియుసి, ప్రజాసంఘాలతో పాటు హ్యూమన్ రైట్స్ మాల మహానాడు నాయకులు, తదితరులు నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు.

ఈ విషయమై వసతి గృహ సంక్షే మ అధికారిణి వంట మనిషిని సస్పెండ్ చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. వసతి గృహంలో రెండు రోజుల పాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా దేవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్రావు, పలువురు నాయకులు, కార్యకర్తలు బిఆర్‌ఎస్ నాయకులు మాజీ జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, కార్యకర్తలు నాయకులు పలువురు పరామర్శించారు.

అనంతరం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి విజయలక్ష్మి ఎటిడిఓ సత్యవతిలు పూర్తిస్థాయి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక, అదేవిధంగా తహసిల్దార్ పులి సాంబశివుడు, వైద్యాధికారి నవ్య కాంత్, ఎంపిడిఒ చంద్రశేఖర్‌లు పరిశీలించి ఉడికీ ఉడకని ఆహారం విద్యార్థినిలకు పెట్టడం వలన కడుపులో నొప్పి, వాంతులు అయ్యాయని ఈ విషయమై నివేదిక జిల్లా కలెక్టర్‌కు విన్నవించినట్లు వైద్యాధికారి నవ్య కాంత్ తెలిపారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్ఎల్‌పి జోన్: జిహెచ్‌ఎంసి

కొటేషన్ ప్రకటన

No. 19/EE/CIR-20/SLPZ/GHMC/2025-26 తేది: 04.08.2025

కొటేషన్ ప్రకటన నెం. 19/EE/CIR-20/SLPZ/GHMC/2025-26, తేది: 04.08.2025 కొరకు **జిహెచ్‌ఎంసిలోని సర్కిల్-20, శేరిలింగంపల్లి జోన్‌లోని రోడ్డు నెం.45 మరియు ఖాజాగూడ రోడ్డులోని వాటర్ నిల్వ కోసం హోల్డింగ్ స్ట్రక్చర్ ఇన్‌బిల్ట్ ఎస్ఐఎం మరియు కనెక్టివిటీతో కూడిన సోలార్ పిటీజెడ్ సరఫరా మరియు సంస్థాపన.** వివరాలను శేరిలింగంపల్లి సర్కిల్-20 కార్యాలయంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుండి పొందవచ్చు. ఈవెంట్స్ తేదీ క్రింద వివరించబడింది:

| ఈవెంట్స్ | తేదీలు |
|---|---|
| కొటేషన్ల దాఖలుకు ప్రారంభ తేది | 05.08.2025@10.30AM |
| కొటేషన్ల దాఖలుకు ఆఖరి తేది | 08.08.2025@04.00AM |
| ప్రైస్ బిడ్ ప్రారంభ తేది | 08.08.2025@04.30AM |

**సంప్రదించవలసిన అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి సర్కిల్-20, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్‌ఎంసి, శేరిలింగంపల్లి మండల రెవిన్యూ కార్యాలయం దగ్గర. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్: www.ghmc.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20,జిహెచ్‌ఎంసి.**

DIPR R.O. No. : 6012-PP/CL/ADVT/1/2025-26, Date: 04-08-2025

**హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-III, బుద్ధ పూర్ణిమ ప్రాజెక్ట్ బిల్డింగ్, #6-1-2/1, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్ - 500063.

టెండర్ ప్రకటన తేది: 02.08.2025

హెచ్‌ఎండిఎ, డివిజన్-III లోని ఈ క్రింది పనులకు టెండర్లు ఆహ్వానించబడ్డాయి:

| క్ర. సం. | NIT No. | తేది | వివరణ |
|---|---|---|---|
| 1 | HMDA/DEV/EE/DIV-III/05/2025-26 | 02.08.2025 | సంజీవయ్య పార్క్‌లోని యాచ్ క్లబ్ ప్రాంగణంలో వీధి దీపాలు మరియు ఇతర పనులను అందించడం. |
| 2 | HMDA/DEV/EE/DIV-III/06/2025-26 | 02.08.2025 | సంజీవయ్య పార్కులో జాతీయ జెండా దగ్గర పేవర్ బ్లాక్లను తొలగించడం మరియు రిలే చేయడం, ప్రవేశ ద్వారం నుండి బిటి రోడ్డు వెంబడి సిసి షోల్డర్‌ను అందించడం మరియు ఇతర పనులు. |
| 3 | HMDA/DEV/EE/DIV-III/07/2025-26 (Reserved for SC) | 02.08.2025 | సంజీవయ్య పార్కులోని వివిధ తోట ప్రదేశాలలో బాక్స్ మరియు బస్ బార్ బాక్సులతో కూడిన కొత్త కేబుల్స్, ట్రెంచ్, డక్ట్ మరియు లాన్ మోవర్ సాకెట్లను అందించడం. (SC కి రిజర్వ్ చేయబడింది) |
| 4 | HMDA/DEV/EE/DIV-III/08/2025-26 (Reserved for ST) | 02.08.2025 | ఎన్టీఆర్ మార్గ్ ప్రాంతం వెంబడి కొత్త 20 మీటర్ల & 12 మీటర్ల హైమాస్ట్ స్తంభాల సరఫరా, పరీక్ష మరియు ఆరంభం. (ST కి రిజర్వ్ చేయబడింది) |

బిడ్ సమర్పించడానికి చివరి తేదీ : 14.08.2025 మధ్యాహ్నం 2.00 గంటల వరకు. మరిన్ని వివరాల కోసం www.tender.telangana.gov.in ని సందర్శించండి.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-III, హెచ్‌ఎండిఎ.**

DIPR R.O. No. : 6015-PP/CL/ADVT/1/2025-26, Date: 04-08-2025

## ఎఎంఆర్‌పి కాల్వల ద్వారా నీరందించాలి

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** ఏఎంఆర్‌పిడి39 డి 40 కాల్వల ద్వారా పూర్తి స్థాయిలో నీరు కాలువకు అందించి రైతులను ఆదుకోవాలని తిప్పర్తి, మాడుగులపల్లి పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. అనంతరం నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఈఈ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటం చేసి సాధించుకున్న ఈ ప్రాంత ప్రజలకు ఏఎంఆర్పి కాలువ ద్వారా నీళ్లు అందించకుండా ప్రభుత్వం రైతులను ఇబ్బంది గురి చేస్తుందని, ఓవైపు బ్రాహ్మణ వెల్లంల, అయిటిపాముల కాలువలకు పూర్తి స్థాయిలో నిరంధిస్తూ తిప్పర్తి మాడుగుల పల్లి ప్రాంత మండలాల రైతుల పట్ల పక్షపాతం వహిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కందుల లక్ష్మయ్య, ముకిరాల కృష్ణ ,గుండెబోయిన రామచంద్రు, గుండెబోయిన నాగరాజు,దేవిరెడ్డి లింగారెడ్డి, బొల్లెద్దు వెంకన్న, రైతులు అంతటి చెన్నకేశవులు, చింతకుంట దయాకర్ రెడ్డి,కే సురేందర్ రెడ్డి,చెదురుపల్లి జనార్ధన్, చిన్నగోని వెంకన్న,రొట్టెల జానయ్య, జక్కలి రవి, కట్ట బిట్టు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యకు పెద్దపీట

### నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన:ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్‌లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయటానికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఏరియా కమల నెహ్రూ ఆసుపత్రి ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలించారు.నర్సింగ్ విద్యకు పెద్దపీట వేయాలని అన్ని సౌకర్యాలు కలిగిన స్థానిక ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో ఈ ప్రాంతాన్ని పరిశీలించినట్లు ఆయన అన్నారు ఆ తర్వాత ఆయన డయాలసిస్ వార్డుని పరిశీలించి రోగులతో మాట్లాడి డయాలసిస్ చికిత్సకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ రోగులకు చికిత్స చేయడంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించొద్దని ఆర్ఎంఓ డాక్టర్ భాను నాయక్ కు సూచించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో మాజీ జెడ్పిటిసి కర్నాటి లింగారెడ్డి,ఎంపీటీసీ భగవాన్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మందా రఘువీర్, , కాంగ్రెస్ నాయకులు పగడాల నాగరాజు, ఖాసీం, జనార్ధన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు లబ్ధి

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

**ప్రజాపక్షం/నూతన్‌కల్ (మద్దిరాల):** ఇందిరమ్మ రాజ్యంలోనే నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల కేంద్రంలో రేషన్‌కార్డు లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను ఇందిరమ్మ ఇండ్ల మంజూరైన వారికి ఇందిరమ్మ పట్టాలను అందజేశారు. అనంతరం మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికి ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో ఉన్న లక్ష్మ నర్సింహస్వామి దేవాలయంలో 50 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో 33/11 కెవి 317.28 లక్షల రూపాయలతో మంజూరైన విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇది నీరుపేదల ప్రభుత్వమని ఇది ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని, గత ప్రభుత్వాలు చేయని విధంగా కాంగ్రెస్‌ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిటి సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, గుడిపాటి నర్సయ్యపాల్గొన్నారు.

## బిసి ఉద్యమానికి సకలజనులు మద్దతు ఇవ్వాలి : దూళిపాళ



**ప్రజాపక్షం/కోదాడ:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం చేస్తున్న బిసిల ఉద్యమానికి సకలజనులు సహకరించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. సోమవారం ఆయన కోదాడలని బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో బిసి ముఖ్య నాయకులతో కలిసి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎలాగైతే సకలజనులు ఐక్యమై ప్రపంచం నివ్వెరపోయేలా సమ్మె చేసి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బిసిలు న్యాయమైన రాజకీయ వాటా కోసం చేస్తున్న ఈ పోరాటంలో సకలజనులు మద్దతు ఇచ్చి ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బిసిల ఉద్యమానికి మంద కృష్ణ మాదిగ తన సంపూర్ణ మద్దతు ప్రకటించాడని, గిరిజనులు ఉద్యమానికి ఊతమివ్వాలని బిసి రిజర్వేషన్ బిల్లుకు ఒక రాజకీయ పార్టీ జాతీయ స్థాయిలో అడ్డంకిగా మారిన విషయాన్ని ప్రజలు గమనించాలని, ఆ పార్టీని రాజకీయంగా భూస్థాపితం చేసేందుకు సంసిద్ధం కావాలని ఉద్భోవించారు. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస రావు, నాయకులు చిలకరాజు శ్రీను, ఇనుగుర్తి వెంకటరమణచారి, ఉప్పతల శ్రీనివాస్, పరికే భరత్, ఎస్‌కె లతీఫ్, సావిత్రి, విజయ పాల్గొన్నారు.

## చెరువులు నిండితేనే రైతులకు మేలు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు:** చెరువులు నిండితేనే భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జీవజాతులు సంతోషంగా ఉంటాయని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఉన్న పెద్ద చెరువును మార్నింగ్ వాక్ చేసుకుంటూ పరిశీలించారు. 395 ఎకరాలు ఉన్న పెద్ద చెరువు మొత్తం కబ్జాకు గురైందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగ పెద్ద చెరువును, చెరువు కట్టను అలుగును పరిశీలించారు. తహసిల్దారు, సర్వేయర్ స్థానిక ఎంపీడీఓలతో కలిసి కట్ట మీదే రెవెన్యూ మ్యాప్ ను పరిశీలించారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం రెవెన్యూ మ్యాప్ ప్రకారం చేపట్టాల్సిన పనులను అధికారులకు సూచించారు. మొత్తంగా ఎంగేజ్మెంట్ సర్వే నిర్వహించి చెరువు కబ్జాకు గురైతే ఆ కబ్జా చేసిన వారికి నోటీసులు పంపించి చెరువు బార్డర్స్ ఫిట్ చేయాలన్నారు. రాబోయే కాలంలో చెరువులను సుందరీకరణ చేస్తామని నల్గొండ రోడ్డు నుండి నార్కట్‌పల్లి రోడ్డు వరకు కట్టమీదగా రోడ్డు వెడల్పు పనులు కూడా చేపడుతామని అన్నారు.ఈ పరిశీలనలో స్థానిక నాయకులతో పాటు మునుగోడు ఇన్చార్జి తహసిల్దార్ నరేష్, మునుగోడు ఇన్చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, నీటిపారుదల శాఖ డి ఈ ప్రేమ్ కుమార్, సర్వేయర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డేకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 48 మంది అర్జీదారులతో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చి న ఫిర్యాదుదా రులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పి తెలిపారు. ఎస్పి ఆఫీస్ కి, పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదు దారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే వచ్చి ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలన్నారు.

## మంత్రి క్యాంపు కార్యాలయానికి ఇందిరా భవన్‌గా నామకరణ

### రూ.13 కోట్ల వ్యయంతో నిర్మించిన మంత్రి క్యాంపు కార్యాలయం ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

### ఫోన్ ద్వారా మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ ప్రజలకు ఎప్పటికీ అందుబాటులో ఉంటూ, వారికి మరింత చేరువగా సేవలందించేందుకు ఇందిరా భవన్ ఉపయోగపడుతుంది అందుకే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, మంత్రి బంగ్లాకు ఇందిరా భవన్ అని నామకరణం చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్లో 13 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సోమవారం అయన ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలిపారు. మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా క్లాక్ టవర్ సెంటర్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎమ్మెల్యే ఒక్కడిదే కాదని అందరిదని ,రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు నల్లగొండకు వచ్చినప్పుడు వసతి ఉండే విధంగా క్యాంపు కార్యాలయాన్ని నిర్మించామని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గంలో తహసిల్దార్, ఎంపీడీవో ,పోలీస్ స్టేషన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలకు 20 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ మంత్రి క్యాంప్ కార్యాలయంలో మొదటి ఫైల్‌పై సంతకం పెట్టారు. అలాగే నకిరేకల్ వంద పడకల ఆసుపత్రిని నవంబర్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా బ్రాహ్మణ వెల్లేములకు నీటిని నింపినట్లే నార్కట్‌పల్లి పెద్ద చెరువును కూడా నీటితో నింపి పూర్వ వైభవం తీసుకువచ్చి,కట్టను పటిష్టపరచడమే కాక ,పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు 15 రోజుల్లో టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో చింతపల్లి, నందిపాడు 2 బ్రిడ్జిలను హామ్ విధానంలో చేపట్టనున్నామని, పది రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రధాన రహదారి నుండి వైటిపిఎస్‌కు వెళ్లే రహదారి నిర్మాణానికి 260 కోట్ల రూపాయలతో టెండర్లు పూర్తి అయ్యాయని, భూసేకరణకు సంబంధించి 31 కోట్ల రూపాయలు తక్షణమే విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ విషయంపై ఈనెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఎలివేటెడ్ కారిడార్ కి సంబంధించి ప్రతిపాదనలతో పాటు, ఎన్ హెచ్ 65 ను 8 లైన్లలో విస్తరించడానికి డీపీఆర్ కూడా సిద్ధం చేశామన్నారు. విజయవాహైదరాబాద్ మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేని కూడా నల్లగొండ మధ్యలో పోయే విధంగా మంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తామన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను వచ్చే మూడు సంవత్సరాల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో గుర్రంపోడు బ్రిడ్జిని అత్యంత ప్రాధాన్యత క్రమంలో తీసుకుని పూర్తి చేసేందుకు మంజూరు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే నల్లగొండ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి కార్నర్ నుండి కాకుండా నల్లగొండ మధ్యలో వెళ్లేలా చూడాలని కోరారు. బ్రాహ్మణ వెల్లేముల ,ఉడుమడ్ల వద్ద ఆర్వో బీసీలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్‌పి శరత్ చంద్ర పవర్,గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షులు ఆఫీస్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గుమ్మల మోహన్ రెడ్డి హాజరయ్యారు.

### నల్లగొండను విద్యా హబ్‌గా తీర్చిదిద్దుతాం

నల్లగొండ జిల్లాను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులకు ఉత్తమమైన చదువులను అందించాలన్న లక్ష్యంతో నల్గొండ జిల్లా కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల రాష్ట్రంలోనే మొదటిది కావాలన్నారు. 9 నెలల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు.సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని గంధం వారి గూడెంలో 200 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులకు మంత్రి భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ తో పోటీపడి ఈ పాఠశాల నిర్మాణాన్ని అంతకన్నా బాగా తీర్చిదిద్దాలని చెప్పా రు. రెసిడెన్షియల్ పాఠశాల పక్కనే మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ ఉన్నాయని, అన్ని హంగులతో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉందన్నారు.

## వేగవంతంగా ప్రజావాణి అర్జీల పరిష్కారం

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** అల్బాండజోల్ టాబ్లెట్ తీసుకోవడం ద్వారా పిల్లలో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులు శరీరంలోకి ప్రవేశించి పిల్లలో బలహీనత, రక్త హీనత, ఆకలి లేకపోవడం వంటి సమస్యలకు లోనవుతారని ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 11న జాతీయ డీవార్మింగ్‌డే నిర్వహిస్తుందని తెలిపారు. డిఈవో, డిఎంహెచ్‌వో, డిడబ్ల్యువో, రెసిడెన్సియల్ కోఆర్డినేటర్లు సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, హస్టల్ వార్డెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాలలో, ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో, రెసిడెన్సియల్, హస్టల్‌లో ఉన్న ప్రతి పిల్లవాడికి వైద్య సిబ్బంది ద్వారా అల్బండాజోల్ టాబ్లెట్లు అందించాలని అదేశించారు. నిరుద్యోగ యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగ సమాచారం కోసం డిఇఇటి (టిడిజల్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ) అనే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. అనంతరం పోస్టల్‌ను ఆవిష్కరించారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించిన 57 దరఖాస్తులు, ఎంపిడివోలకు 12 దరఖాస్తులు, మున్సిపల్ కమిషనర్లకు 7 దరఖాస్తులు, జిల్లా పంచాయతీ అధికారికి 6 దరఖాస్తులు, మిగిలిన 17 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవి వచ్చాయని మొత్తం 99 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్‌వో సతీష్‌కుమార్, డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలకు సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 71 ఆర్జీలను, జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డితో కలసి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 42, సర్వే ల్యాండ్ 7, మున్సిపాలిటీ 6, జిల్లా పంచాయతీ 3, జిల్లా సంక్షేమ శాఖ 3, జిల్లా విద్యా 2, బ్యాంకు 2, ఎస్సీ కార్పొరేషన్ 2, హౌసింగ్, ఆర్టీసీ, మెడికల్, పశు వైద్యం, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పిడి విజయ సింగ్, జిల్లా పంచాయతీ అధికారి సునంద వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కెనరా బ్యాంకు తరలించొద్దని అఖిలపక్షం ధర్నా

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ హిల్ కాలనీ లో గత 45 సంవత్సరాలుగా సేవలందిస్తున్న కెనరా బ్యాంక్ విజయపురి నార్త్ శాఖ ను హాలియాకు తరలించొద్దని అన్ని పార్టీలు కలిపి సంయుక్తంగా సోమవారం ధర్నా చేపట్టారు. ఖాతాదారులు బ్యాంకు లోపలికి వెళ్లకుండా నిరసన కారులు గేట్లకు తాళం వేసి గేటు ముందు బైఠాయించి కూర్చున్నారు వీరితో పాటు ఖాతాదారులు కూడా తోడవడంతో ఆందోళ మరింత తీవ్రమైంది. దీనితో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.వచ్చిన పోలీసులు ధర్న శాంతింప చేసే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. వెంటనే స్థానిక ఎస్సై ముత్తయ్య హైదరాబాదు రీజనల్ మేనేజర్ కు ఫోన్ చేసి 100 కోట్ల టర్నోవర్ కలిగిన కెనరా బ్యాంకు, 15వేల ఖాతాలు, 2300 బంగారు రుణ ఖాతాలు, కలిగి ఉన్న బ్యాంకును ఎందుకు తరలిస్తున్నారని వివరణ కోరితే అక్కడ బ్యాంకుకు సెక్యూరిటీ లేదని అందుకు తరలిస్తున్నామని సమాధానం చెప్పారని అనడంతో 45 సంవత్సరాలుగా లేని దొంగలు ఇప్పుడెలా వస్తారని ఒకవేళ ఈ బ్యాంకును వేరేచోటకు తరలించినా అక్కడికి దొంగలు రారా అని ఖాతాదారులు కోపంతో ప్రశ్నించారు. 80 సంవత్సరాలలు పైబడిన వృద్ధ పెన్షన్ దారులైతే బ్యాంకు తరలించొద్దని కన్నీటి పర్యంతమయ్యారు బ్యాంకును తరలించమని హామీ ఇస్తే కానీ ధర్నా విరమించేది లేదని నిరసన చేస్తున్న అఖిల పక్ష నాయకులు భీష్మించుకుని కూర్చున్నారు. బ్యాంకు తరలింపు ఆగే వరకు ప్రతిరోజు ధర్నా చేస్తామని తమ అభిప్రాయాన్ని తెలిపారు.

## ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** మండలాల ప్రత్యేక అధికారులు,జిల్లా అధికారులు ప్రభుత్వ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్ లను సవాల్‌గా తీసుకొని సందర్శించాలని చెప్పారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులు, ఇతర ప్రాధామ్య పథకాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువల్ల మండలాల ప్రత్యేక అధికారులు, జిల్లా అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పథకాలు వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు వారి మండలంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు మోడల్ పాఠశాలలను సందర్శించి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్, నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు ,డిఆర్‌ఓ నాగిరెడ్డి, ఆర్‌డిఓలు వై.అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి హాజరై ఫిర్యాదులను స్వీకరించారు.

## 26 శాతం మద్యం షాపులు సొసైటీలకు కేటాయించాలి

### గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే 26 శాతం మద్యం షాపులను గీత వృత్తిపై ఆధారపడే గీత కార్మికుల సొసైటీలకే ఇవ్వాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు.గీత పనివారల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వీరస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యపానం విచ్చలవిడిగా ప్రోత్సహిస్తూ గీత వృత్తిని నిర్వీర్యం చేస్తూ గీతా కార్మికుల పొట్టలు కొడుతుందని ఆరోపించారు.. గ్రామాలలో విచ్చల విడిగా కిరాణం షాపులతో పాటు గల్లి, గల్లిలో నడుపుతున్న బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. గీత వృత్తిదారులకు వృత్తి వృత్తిని ప్రోత్సహించేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో ఏర్పాటు చేసిన నీరా ప్రాజెక్టుని పురుద్ధరణ చేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎం పి బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులకు ఎక్స్‌గ్రేసియా గేషన్ చెల్లిం పులో గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని దీనివల్ల గీత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 2022 సంవత్సరం నుండి సుమారు రూ. 12. 50కోట్లు పెండింగ్ లో ఉన్న ఎక్స్‌గ్రేసియాను వెంటనే విడుదల చేసి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ రాష్టంలో చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ఉపాధి హామీ పనిలో గీత వృత్తిని ప్రోత్సహించందుకు తాటి, ఈత ఖర్జూర చెట్లను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. జిల్లాలో ప్రతి గీతా కార్మికునికి రక్షణ కోసం ఇస్తామన కాటమయ్య కిట్లు సకాలంలో అందించకపోవడం వల్ల ఎంతో మంది గీత కార్మికులు తాటిచెట్టు పైనుంచి కిందపడి చనిపోవడంతో పాటు ప్రమాదాలకు గురై మంచాలకే పరిమితం అవుతున్నారని ఆవేదం వ్యక్తం చేశారు.కటమయ్య కిట్లను వెంటనే శిక్షణ ఇచ్చి అందించాలన్నారు.ఈ సమేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకర్, నాయకులు కుంభం జయరాములు, జోగు సురేందర్,కర్నాటి వెంకటేష్, వనం వెంకన్న, దోటి అక్కాలెయ్య, లేనిన్ తదితరులు పాలొన్నారు.

## మహిళలంతా సమైక్యంగా పోరాడాలి: గిరి రమ



**ప్రజాపక్షం/వేములపల్లి (మాడుగులపల్లి):** మహిళలందరూ సమైక్యంగా ధైర్యంగా ముందుకు సాగాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ డబ్ల్యు) జిల్లా కన్వీనర్ గిరి రమ అన్నారు.సోమవారం నకిరెకంటి స్వప్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినమండలంలోని కుక్కడం గ్రామ కమిటీ సమావేశంలో రమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలపై జరిగే అరాచకాలను అరికట్టాలంటే మహిళలందరూ సమైక్యంగా ఉండాలన్నారు, కర్ణటక రాష్ట్రంలోని మంజునాథ దేవాలయం ధర్మస్థలంలో గత వారం రోజులుగా వెలుగులోకి వస్తున్న ఘటనలు భయానకం తో పాటు తీవ్రమైన ఆవేదనను, ఆందోళనను కల్గిస్తున్నాయన్నారు. ఈ హత్యోదంత పరంపర మనసును కలిచివేస్తుందని, ఆశ్రమాల పేరుతో, ఆలయాల పేరుతో, ఆధ్యాత్మిక చింతన పేరుతో, భక్తి పేరుతో మహిళలను వంచిస్తూ సమాజంలో పెద్ద మనుషులుగా మతగురువులుగా, చెలామణి అవుతూ మహి ళల మాన ప్రాణాలను హరించివేస్తున్నారన్నారు.ధర్మస్థలం హత్యోదంత ఘటనలపై వేగవంతంగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ వేములపల్లి మండల కార్యదర్శి జిల్లా యాదగిరి,ఎన్ఎఫ్ డబ్ల్యు మిర్యాలగూడ టౌన్ కార్యదర్శి షేక్ సెమిమ్,మండల కార్యదర్శి అబ్రహం, గంట లక్ష్మి, గంట మంగమ్మ,ఆరూరి, లక్ష్మమ్మ, మున్నిభీ, షహీదా, మంజుల తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుక్కడం గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా గంట కావేరి,కార్యదర్శిగా నకిరేకంటి స్వప్న, సహాయ కార్యదర్శిగా నాగమణి, నాగమ్మ, రేష్మ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందుకు : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి కె.నర్సింహా సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బంది పరేడ్‌ను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిబ్బంది పరికరాలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రికార్డులను ఆయన క్షుణంగా పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ మ్యాప్, గ్రామాల హద్దులు, కేసు ఫైల్స్, కోర్టు వ్యవహారాలు, రిసెప్షన్, కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై సమీక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందుకు సాగాలన్నారు. రౌడి షీటర్, సస్పెక్టడ్‌పై సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచాలని అదేశించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాలు, కాలనీలు, పట్టణాలలో పెట్రోలింగ్ తనిఖీలు నిరంతరం చేయాలన్నారు. పనులను పెండింగ్ ఉంచకుండా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. ఎస్‌పి నర్సింహాతో పాటు డిఎస్‌పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, డిసిఆర్‌బి ఎస్‌ఐ యాకుబ్, డిసిఆర్‌బి సిబ్బంది అంజన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఎస్‌పి సిసి సందీప్ ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సిపిఐ నారాయణపూర్ జిల్లా కార్యదర్శికి బెదిరింపులు

### భద్రత కల్పించాలని ఛత్తీస్‌ఘడ్ సిఎంకు సందోష్‌కుమార్ లేఖ

ఢిల్లీ : ఛత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్‌లో ఇద్దరు మలయాళీ నన్‌లు, ముగ్గురు అమ్మాయిల వేధింపుల నేపథ్యంలో సిపిఐ నారాయణపూర్ జిల్లా కార్యదర్శికి బెదిరింపులు వస్తుండడం పట్ల ఆందోళన వ్యక్తంచేస్తూ ఛత్తీస్‌ఘడ్ 'సిఎం విష్ణు దేశ్‌సాయికి సిపిఐ రాజ్యసభ పక్ష నేత పి.సందోశ్ కుమార్ సోమవారం లేఖ రాశారు. ఈమేరకు ఆయన ఒక పత్రికా ప్రకటనను జారీచేశారు. బెయిల్ వచ్చిన తరువాత నన్‌ల వెంట ప్రయాణించిన ముగ్గురు గిరిజన యువతులకు మితవాద శక్తుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని లేఖలోపేర్కొన్నారు. ఆ ముగ్గురు ఇప్పటికే దుర్గ్ ఎస్‌పికి విన్నవించారని, వారికి అండగా నిలిచినందుకు సిపిఐ నారాయణపూర్ జిల్లా కార్యదర్శి ఫూల్‌సింగ్ కచలంకు మితవాద శక్తుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని తెలిపారు. తక్షణమే ముగ్గురు యువతులు, ఫూల్ సింగ్ కచలంకు భద్రత కల్పించాలని, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్య తీసుకోవాలని సిఎంకు రాసిన లేఖలో సందోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాల పట్టు

### పార్లమెంట్ ఉభయసభలు నేటికి వాయిదా



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. సిట్టింగ్ ఎంపి, జెఎంఎం అధినేత శిబు సోరెన్ మృతితో సంతాప సూచకంగా రాజ్యసభను మరుసటి రోజుకు వాయిదా వేయగా, బిహార్‌లో ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చ కోరుతూ ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య లోక్‌సభను కూడా వాయిదా వేశారు. ఐదుసార్లు లోక్‌సభ ఎంపిగా, మూడుసార్లు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన సోరెన్(81) సోమవారం మరణించారు. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ హయాంలో కేంద్ర బొగ్గు మంత్రిగా కూడా పనిచేశారు. జూన్ 2020లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. సభ వాయిదా పడే ముందు సభ్యులు మౌనం పాటించారు. అయితే సోమవారం రాజ్యసభలో అధికారిక కార్యకలాపాలు ఏవీ జరగలేదు. ఇక లోక్‌సభలో రాష్ట్ర ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాల మరోసారి నిరసన గళాన్ని వినిపించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ సమావేశమైనప్పుడు, కాంగ్రెస్ ఎంపిలు సహా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులతో లేచి నిలబడి నినాదాలు చేశారు. జూలై 21న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి పదే పదే అంతరాయం ఏర్పడటంతో ఒక్క బిల్లు కూడా ఆమోదం పొందలేదని, సభను మంగళవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేసినట్లు సభకు అధ్యక్షత వహించిన జగదాంబికా పాల్ ప్రతిపక్షాలకు గుర్తు చేశారు. ముందుగా, స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ సభను సజావుగా నడపడానికి తాను ప్రతిరోజూ ప్రయత్నిస్తున్నానని, కానీ నిరసన తెలుపుతున్న సభ్యులు సభ కార్యకలాపాలకు క్రమపద్ధతిలో అంతరాయం కలిగిస్తున్నారని అన్నారు. ఎంపిలు తమ సమస్యలను తనతో నేరుగా లేవనెత్తాలని, ప్రశ్నోత్తరాల సమయం కొనసాగడానికి అనుమతించాలని ఆయన కోరారు. గతంలో చేసినట్లుగా మీ సమస్యలను లేవనెత్తడానికి మీలో ప్రతి ఒక్కరికీ తగినంత సమయం ఇస్తాను, కానీ దయచేసి సభను నడపడానికి అనుమతించండి అని బిర్లా అన్నారు. స్పీకర్ విజ్ఞప్తిని ఏ మాత్రం పట్టించుకోకుండా విపక్ష ఎంపిలు తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో ఆయన సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేయాల్సి వచ్చింది. ప్రతిపక్షాల నిరసన మధ్య, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా ప్రతిపక్షాలు కార్యకలాపాలను నిలిపివేసినందుకు విమర్శించారు. ప్రతిపక్షాల అభ్యర్థన మేరకు జాతీయ క్రీడా పాలన బిల్లు, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు చర్చకు ఎజెండాలో చేర్చబడిందని, క్రీడా మంత్రి చర్చకు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఏమి చెప్పాలనుకుంటున్నారో చెప్పకపోవడమే కాకుండా, సభ సమయాన్ని కూడా వృథా చేస్తున్నారని రిజిజు వ్యాఖ్యానించారు. జులై 21న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుండి పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అంతరాయం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్‌పై రెండు రోజుల చర్చ మినహా కార్యకలాపాలు చాలా వరకు నిలిచిపోయాయి. బిహార్‌లో ఎన్నికల కమిషన్ ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఐక్యంగా నిరసన వ్యక్తం చేయడం వల్ల ఈ ప్రతిష్టంభన ఏర్పడింది. తమ ఎజెండాతో అనుసంధానించబడిన ఓటర్లను తొలగించి, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు ప్రయోజనం చేకూర్చడమే ఈ కసరత్తు లక్ష్యం అని ఇండియా కూటమి ఆరోపించింది. రాహుల్ గాంధీ ఇసి 'ఓట్ల చోరీ' చేసిందని ఆరోపించారు.

## ఎస్ఐఆర్ అతి పెద్ద సమస్య: ప్రియాంక



**న్యూఢిల్లీ:** బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) చాలా 'పెద్ద సమస్య' అని, ప్రభుత్వం దానిపై చర్చకు అంగీకరించి ముందుకు సాగాలని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం అన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన విషయం అయినప్పుడు ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తకూడదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చర్చ డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష పార్టీల నిరసనల కారణంగా లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ అంశాన్ని లేవనెత్తడం గురించి అడిగినప్పుడు, ప్రియాంక గాంధీ... 'ఇది చాలా పెద్ద సమస్య. ఓటర్ల జాబితాకు ఇదంతా జరిగితే మనం దానిని ఎందుకు లేవనెత్తకూడదు?' అని అన్నారు. 'ప్రభుత్వం చర్చకు అంగీకరించి ముందుకు సాగాలి' అని ఆమె పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో అన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండియా ఐక్య సంఘటనకు చెందిన అనేక మంది ఎంపీలు పార్లమెంటు భవన సముదాయంలో ప్రతిరోజూ నిరసన తెలుపుతున్నారు. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సియోరెన్ మరణం దష్ట్యా సోమవారం ఈ నిరసన జరగలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో 'ఓటర్ల ఓటు హక్కును తొలగించడం' లక్ష్యంగా బీజేపీ ఈ చర్య చేపట్టిందని ఆరోపిస్తూ ఎస్ఐఆర్‌కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు పార్లమెంటు ఉభయ సభలలో నిరసన తెలుపుతున్నాయి. ఈ అంశంపై రెండు సభలలో చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఐదేళ్లలో రూ.7.08లక్షల కోట్ల జిఎస్‌టి ఎగవేత

### లోక్‌సభలో గణాంకాలను వెల్లడించిన మంత్రి!



**న్యూఢిల్లీ :** గత (2024–25))ఆర్థిక సంవత్సరం వరకు ఐదు సంవత్సరాల్లో దాదాపు రూ.7.08 లక్షల కోట్ల పన్ను ఎగవేతను కేంద్ర జిఎస్‌టి ఫీల్ అధికారులు గుర్తించారు. ఇందులో దాదాపు రూ.1.79లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి) మోసాలు ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఆర్థిక సహాయ మంత్రి పంక్ చౌదరి లోక్‌సభలో వివరాలను వెల్లడించారు. డేటా ప్రకారం.. 2024–25 ఆర్థిక సంవత్సరంలోనే రూ.2.23 లక్షలకోట్లకుపైగా జిఎస్‌టి ఎగవేతను సిజిఎస్‌టి ఫీల్ అధికారులు గుర్తించారని, 2025 ఆర్థిక సంవత్సరంలో 30,056 జిఎస్‌టి ఎగవేత కేసులను గుర్తించినట్లు ప్రభుత్వం లోక్‌సభకు తెలిపింది. ఇందులో సగానికిపైగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించినవే ఉన్నాయని పేర్కొంది. ఈకేసుల్లో రూ.58,772 కోట్ల పన్ను ఎగవేత జరిగిందని.. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.30 లక్షల కోట్ల జిఎస్‌టి ఎగవేత, 2023 ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.1.32లక్షల కోట్ల జిఎస్‌టి ఎగవేతను గుర్తించారని, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238 కోట్లు, 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జిఎస్‌టి ఎగవేత జరిగిందని అధికారులు గుర్తించారు. గడిచిన ఐదేళ్లలో సిజిఎస్‌టి ఫీల్ అధికారులు రూ.91,370 కేసుల్లో దాదాపు రూ.7.08 లక్షల కోట్ల జిఎస్‌టి ఎగవేతను అధికారులు గుర్తించారన్నారు. ఈ కాలంలో స్వచ్ఛంద డిపాజిట్ల ద్వారా వసూలు చేసిన పన్నులు రూ.1.29 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. 2021 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం మధ్య 44,938 కేసుల్లో దాదాపు రూ.1.79 లక్షల కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పన్ను ఎగవేత వేసినట్లు కేంద్రం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, జిఎస్‌టి ఎన్ పన్ను ఎగువేతను నివారించేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈఇన్వాయిస్ ద్వారా డిజిటలైజేషన్, జిఎస్‌టి రివ్యూ తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలన్నీ పన్ను ఎగవేతదారులను పట్టుకోవడంలో సహాయపడుతాయని చౌదరి లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. సవరించిన అంచనాలతో (ఆర్ఇ) పోలిస్తే వాస్తవ నికర కేంద్ర జిఎస్‌టి వసూళ్లపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నికర సిజిఎస్‌టి వసూళ్లు సవరించిన అంచనాలలో 96.7 శాతమని చౌదరి అన్నారు. 2025 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వసూళ్లు రూ.10.26 లక్షల కోట్లకుపైగా ఉండగా, సవరించిన అంచనాలు దాదాపు రూ.10.62 లక్షల కోట్లు. 2024 ఆర్థిక సంవత్సరంలో నికర సిజిఎస్‌టి వసూళ్లు రూ.9.57 లక్షల కోట్లకుపైగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.9.56 లక్షల కోట్లలో 100.1శాతం.

### పార్లమెంటులో ప్రశ్నించకుండా
# సోషల్ మీడియాలో పోస్టింగులేంటి?

### రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు ఆగ్రహం
### ఇది వేధింపుల కేసు అని న్యాయవాది అభిషేక్ సింఘ్వి వెల్లడి



**న్యూఢిల్లీ:** భారత్–చైనా సరిహద్దుల్లో ఘర్షణకు సంబంధించి భారత్ జోడో ప్రచార యాత్రలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిజమైన భారతీయుడైతే మీరు అలా మాట్లాడరంటూ మొట్టికాయ వేసింది. ''ఒక ప్రతిపక్ష నాయకుడుగా మీరు మీ అభిప్రాయాలను, వాదనలను పార్లమెంటులో ఎందుకు చెప్పకూడదు? సోషల్ మీడియా వేదికగా ఎందుకు ప్రకటనలు చేస్తున్నారు?'' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. అదే సమయంలో ఆయనకు వ్యతిరేకంగా లక్నో కోర్టు చేపట్టిన విచారణపై స్టే మంజూరు చేసింది. రాహుల్‌గాంధీ తరపు న్యాయవాది ప్రస్తావించిన అంశాన్ని పరిగణనలోక తీసుకున్న ధర్మాసనం ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికీ, లక్నో కోర్టులో ఫిర్యాదు చేసిన వాదికీ ధర్మాసనం నోటీసులు జారీ చేసి సమాధానం చెప్పేందుకు మూడు వారాలు గడువు ఇచ్చింది. 2020 జూన్‌లో భారత్–చైనా సరిహద్దులో జరిగిన సైనిక ఘర్షణ, మరణాల గురించి 2022లో జోడో యాత్ర సందర్భంగా భారత సైన్యాన్ని అవమానించేవిధంగా రాహుల్‌గాంధీ అనేక వ్యాఖ్యలు చేశారని ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ అనేవ్యక్తి ఉత్తర ప్రదేశ్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దురుద్దేశంతోనే రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ కేసు సుప్రీంకోర్టు దాకా వెళ్ళింది. ప్రతిపక్ష నాయుణ్ణి వేధించడంకోసం పెట్టిన ఉద్దేశపూర్వకమైన కేసు అని రాహుల్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు.

''చైనా సైన్యం 2000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల భారత భూభాగాన్ని ఆక్రమించిందని మీకు ఎలా తెలుసు? అప్పుడు మీరు అక్కడున్నారా? లేకపోతే మీ దగ్గర ఏదైనా విశ్వసనీయమైన సమాచారం ఉందా? ఎలాంటి ఆధారాలూ లేకుండా ఎందుకు మీరు ప్రకటనలు చేస్తున్నారు? మీరు గనుక నిజమైన భారతీయుడైతే మీరు అలా మాట్లాడరు'' అని సుప్రీంకోర్టు ధర్మాసనం రాహుల్‌గాంధీపై సోమవారంనాడు విచారణ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో రాహుల్ గాంధీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదించారు. ''ఒక ప్రతిపక్ష నాయకుడుగా ఆయన సమస్యలను గనుక ప్రస్తావించకపోతే చాలా దురదృష్టకరమైన పరిస్థితులు తలెత్తుతాయి, పత్రికల్లో ప్రచురితమైన ఈ విషయాలను గనుక ఆయన ప్రస్తావించకపోతే ఆయన ప్రతిపక్ష నాయకుడవ్వరు'' అని రాహుల్‌గాంధీ తరపున అభిషేక్ సింఘ్వి ధర్మాసనానికి తెలియజేశారు. ఒక నిజమైన భారతీయుడు అలా మాట్లాడరు అని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలకు అభిషేక్ సింఘ్వి తిరిగి బదులిస్తూ, ఇరవైమంది భారతీయులను గల్వాన్ లోయలో చైనా సైనికులు కొట్టి చంపేసిన విషయాన్ని కూడా ఒక నిజమైన భారతీయుడికి చెప్పే అవకాశం ఉంటుందని, చైనా సైనికులు భారత సైనికులను కొట్టి చంపడం కూడా చాలా ఆందోళనకరమైన విషయమని అన్నారు. దీనిపై ధర్మాసనం తిరిగి స్పందిస్తూ, సరిహద్దుల్లో ఎప్పుడైనా ఘర్షణలు జరిగినప్పుడు ఇరుదేశాల సైన్యాల వైపునా ఇలాంటి ఘటనలు జరగడం అసాధారణం కాదు కదా?'' అని అభిషేక్ సింఘ్విని న్యాయస్థానం ప్రశ్నించి ఆయనపై కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కూడా అభిషేక్ సింఘ్వి సమాధానం చెబుతూ, కేంద్ర ప్రభుత్వం పైకి చెప్పకుండా అణగదొక్కిన సమాచారాన్ని రాహుల్‌గాంధీ ప్రస్తావించారని, ఆ విషయాన్ని సరైన పద్ధతిలో ప్రకటించాలన్నది మాత్రమే ఆయన ఉద్దేశమని చెప్పారు. సింఘ్వి మాటలకు జస్టిస్ దత్తా స్పందిస్తూ, ఇలాంటి ప్రశ్నలు ప్రస్తావించడానికి దేశంలో సరైన వేదిక ఉండగా, ఒక బాధ్యతగల ప్రతిపక్ష నాయకుడుగా రాహుల్ గాంధీ అలా చేసి ఉండకూడదని అన్నారు. ఆయన మాటలతో సింఘ్వి ఏకీభవిస్తూ, ఇంకా ఉత్తమస్థాయిలో, మెరుగైన పద్ధతిలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేసి ఉంటే బాగుండేదనీ, కానీ కోర్టుకు ఫిర్యాదు చేసిన వ్యక్తి వేధించడంకోసమే ఆయనపై పిటిషన్ దాఖలు చేశారని విమర్శించారు. ఈ సందర్భంగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టంలోని 223వ సెక్షన్‌ను సింఘ్వి ప్రస్తావించారు. ఒక క్రిమినల్ కంప్లైంట్‌ను పరిగణనలోకి తీసుకునేముందుగా న్యాయస్థానం మొదట నిందితుడి వాదన వినాలని, కానీ ఈ కేసులో అలా జరగలేదని విమర్శించారు. దీంతో సుప్రీంకోర్టు దీనిపై సమాధానం చెప్పాలంటూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికీ, రాహుల్‌గాంధీపై కోర్టు ఫిర్యాదు చేసిన వాదికీ నోటీసులు జారీ చేసింది. సమాధానం చెప్పేందుకు వారికి మూడు వారాలు గడువు ఇచ్చింది. లక్నో ట్రయల్ కోర్టులో విచారణ పర్వాన్ని నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# విద్యతోనే సనాతన బానిసత్వం అంతం

### కమల్ హాసన్



**లక్నో:** సనాతన బానిసత్వాన్ని అంతం చేయగల ఏకైక ఆయుధం విద్యేనని ప్రముఖ సినీ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ అన్నారు. సినీ నటుడు సూర్య విద్యా స్వచ్ఛంద సంస్థ అగరం ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడారు. ప్రజలు వేరే ఏ ఆయుధాన్ని చేతిలోకి తీసుకోకుండా కేవలం విద్యను మాత్రమే గట్టిగా పట్టుకోవాలని కమల్ సూచించారు. 'విద్య లేకుండా మనం గెలవలేం. ఎందుకంటే బహుసంఖ్యాక మూర్ఖులు (మూదర్గల్) మిమ్మల్ని ఓడించగలరు. అందుకే మనం విద్యను గట్టిగా పట్టుకోవాలి' అని ఆయన కోరారు. విద్యా వ్యవస్థలు, సామాజిక సాధికారతపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. 2017 నుంచి అమల్లో ఉన్న 'నీట్' విధానాన్ని కమల్ హాసన్ తీవ్రంగా విమర్శించారు. ఇది ఆర్థికంగా వెనుకబడిన, అణగారిన వర్గాల విద్యార్థుల వైద్య విద్య కలలను నాశనం చేసిందని ఆరోపించారు. 'వచ్చే ఏడాది ఇలాంటి డాక్టర్లను మీరు చూడలేరు. 2017 తర్వాత ఈ పిల్లలు తమ ప్రయత్నాలు కొనసాగించలేకపోతున్నారు. అందుకే మేమునీట్‌ను వ్యతిరేకిస్తున్నాం. ఆ చట్టం ఇలాంటి పిల్లల చదువులను అడ్డుకుంది' అని చెప్పారు. కేవలం విద్య మాత్రమే ఆ చట్టాన్ని మార్చగల శక్తి ఇస్తుందని కమల్ స్పష్టం చేశారు. సినిమాలో మంచి నటనకు కిరీటం లభిస్తే, సామాజిక సేవకు ముళ్ల కిరీటం లభిస్తుందని కమల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ముళ్ల కిరీటాన్ని స్వీకరించడానికి బలమైన హృదయం కావాలని, ఎందుకంటే సామాజిక సేవను ఎవరూ మన కోసం చేయబోరని, మనమే చేయాలని కమల్ సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో నిన్న జరిగిన తన సంభాషణను కమల్ హాసన్ గుర్తు చేసుకున్నారు. సామాజిక సేవ చేసే స్వచ్ఛంద సంస్థలు డబ్బు అడగడం లేదని, కేవలం పని చేయడానికి అనుమతి మాత్రమే కోరుతున్నాయని తాను ముఖ్యమంత్రితో చెప్పినట్టు కమల్ తెలిపారు. దీనిపై చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ఈ గొప్ప కార్యంలో భాగం కావడం తనకు గర్వకారణమన్నారు. నాయకత్వం అంటే ఒక స్థానంలో కూర్చుని పాలించడం కాదని, సమాజంలో కనిపించకుండా సేవ చేయడమని కమల్ స్పష్టం చేశారు.

### జమ్ముకశ్మీరుకు
## రాష్ట్ర హోదా పునరుద్ధరణ?

### రాష్ట్రపతితో మోదీ, అమిత్‌షా భేటీపై ఊహాగానాలు

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గంటల వ్యవధిలో ఆదివారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో వేర్వేరుగా రాష్ట్రపతి భవన్‌లో సమావేశం కావడంపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరణ కోసమే ఈ భేటీలు జరిగినట్లు సోషల్‌మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఆర్టికల్ 370 రద్దుచేసి ఆరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జరిగిన భేటీలతో ఈ తరహా చర్చ మొదలైంది. బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని ప్రధాని కలవడం ఇదే తొలిసారి. తర్వాత కొన్ని గంటలకు అమిత్ షా కూడా ముర్ముతో సమావేశమయ్యారు. తర్వాత హోంమంత్రి జమ్ముకశ్మీర్ నేతలను కలిశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే 370 ఆర్టికల్‌ను కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. సరిగ్గా ఆ తేదీకి రెండు రోజుల ముందే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం చర్చకు దారితీసింది. కచ్చితమైన గడువు నిర్దేశించనప్పటికీ... రాష్ట్రహోదా పునరుద్ధరణకు మోదీ, అమిత్ షా ఇప్పటకే అనేకసార్లు హామీ ఇచ్చారు. బీహార్ ఓటర్ల జాబితాపై జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి చర్చ కోసం పార్లమెంటులో విపక్షాలు పట్టుబడుతున్న నేపథ్యంలో అటు ప్రధాని... ఇటు హోంమంత్రి రాష్ట్రపతిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.


# బెంగాలీ భాషను అవమానించడమే

### తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

**చెన్నై:** కేంద్రహోంశాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు బెంగాలీని 'బంగ్లాదేశ భాష'గా అభివర్ణించడాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం తీవ్రంగా ఖండించారు. ఇది మన జాతీయ గీతం రచించిన బెంగాలీ భాషను ప్రత్యక్షంగా అవమానించడమేనని మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ ప్రకటనలు అనుకోకుండా చేసిన లేదా అజాగ్రత్తతో కూడిన తప్పులు కాదని, వైవిధ్యాన్ని నిరంతరం అణగదొక్కే, గుర్తింపుపై ఉద్దేశపూర్వకంగా దాడి చేసే పాలకుల చీకటి మనస్తత్వాన్ని బయటపెడుతుందని స్టాలిన్ విమర్శించారు. హిందీయేతర భాషలపై దాడి నేపథ్యంలో మమతా బెనర్జీ భాషకు, ప్రజలకు రక్షణ కవచంగా నిలిచారని, తగిన విధంగా ప్రతిస్పందిస్తారని అన్నారు. ఢిల్లీ పోలీసులు చేసిన ఒక ప్రకటనలో బెంగాలీని బంగ్లాదేశ్ భాషగా పేర్కొన్నట్లు మమతా బెనర్జీ తెలిపారు. ఇది అవమానకరమైనది, అపఖ్యాతికరమైనది, దేశ వ్యతిరేకం, రాజ్యాంగ విరుద్ధమైనదిగా అభివర్ణించారు.

# చైనాపై నిజం దాయడమెందుకు?

### జైరాం రమేష్



**న్యూఢిల్లీ:** గాల్వన్ సంఘటన తర్వాత దేశభక్తిగల ప్రతి భారతీయుడు చైనా వ్యవహారంపై సమాధానాలు కోరుతున్నాడని, కానీ మోదీ ప్రభుత్వం 'డీడీఎల్‌జే... తిరస్కరించు, దృష్టి మరల్చు, అబద్ధం చెప్పు, సమర్థించు' అనే విధానంతో సత్యాన్ని దాచడానికి ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. 1962 నుంచి భారతదేశం ఎదుర్కొన్న అతిపెద్ద ప్రాదేశిక ఎదురుదెబ్బకు మోదీ ప్రభుత్వమే కారణమని ప్రతిపక్ష పార్టీ విమర్శించింది. దాని పిరికితనం, తప్పుడు ఆర్థిక ప్రాధాన్యతల కారణంగా చైనాతో 'సాధారణీకరణ'ను అనుసరిస్తోందని పేర్కొంది. తన భారత్ జోడో యాత్రలో భారత సైన్యం గురించి లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అవమానకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై సుప్రీం కోర్టు స్పందించిన తర్వాత ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. జూన్ 15, 2020న గాల్వన్‌లో 20 మంది సైనికులు అమరులైనప్పటి నుంచి దేశభక్తి గల ప్రతి భారతీయుడు సమాధానాలు వెతుకుతున్నాడని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'అయినప్పటికీ, సమాధానాలు ఇవ్వడానికి బదులుగా ఐదేళ్లుగా మోదీ ప్రభుత్వం నిజాన్ని కప్పిపెట్టడం అనే ఆయుధాన్ని ఎంచుకుంది' అని తెలిపారు. 'ఎక్స్' వేదికగా జైరాం రమేశ్ వరుస ప్రశ్నలు అడిగారు. 'గ్వాన్‌లో మన సైనికులు దేశం కోసం వీరోచితంగా ప్రాణాలు త్యాగం చేసిన నాలుగు రోజుల తర్వాత నా కోయి హమారీ సీమా మే ఘుస్ ఆయా హై, న హి కోయి ఘుసా హువా హై అని చైనాకు ప్రధానమంత్రి ఎందుకు క్లీన్‌చిట్ ఇచ్చారు' అని నిలదీశారు. 'మేము ఏప్రిల్ 2020 నాటి స్థితికి తిరిగి వెళ్లాలనుకుంటున్నామని 'సైన్యాధ్యక్షుడు జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారని తెలిపారు. 21, అక్టోబరు 2024 నాటి ఉపసంహరణ ఒప్పందం మమ్మల్ని తిరిగి యథాతథ స్థితికి తీసుకువెళుతుందా' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. భారత క్లెయిమ్ లైన్‌లో ప్రధానంగా ఉన్న 'బఫర్ జోన్'లు భారతీయ గస్తీ దళాలను గాల్వన్, హాట్ స్ప్రింగ్, పాంగోంగ్ త్సోలోని వారి గస్తీ పాయింట్లను పొందకుండా నిరోధించడం లేదా అని అడిగారు. 2020లో డెప్సాంగ్‌లోని 900 చదరపు కిలోమీటర్లు సహా తూర్పు లదాఖ్‌లోని 1,000 చదరపు కిలోమీటర్లు చైనా నియంత్రణలోకి వచ్చాయని విస్తతంగా నివేదించబడలేదా? తూర్పు లదాఖ్‌లోని 65 పెట్రోలింగ్ పాయింట్లలో 26 పాయింట్లకు భారతదేశం ప్రాముఖ్యత కోల్పోయిందని లెహ్ ఎస్పీ వార్షిక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సమావేశంలో ఒక పత్రాన్ని సమర్పించలేదా?' అని ఆయన ప్రశ్నించారు. చైనా నుంచి దిగుమతులు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ బ్యాటరీలు, సోలార్ సెల్స్ వద్ధి చెందుతున్నాయనేది నిజం కాదా, అలాగే టెలికం, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ముఖ్యమైన రంగాలు చైనా దిగుమతులపై ఆధారపడి ఉన్నాయా అని అడిగారు.

# టీచర్ల నియామకంలో స్థానికత

### నితీష్ సర్కార్ కీలక నిర్ణయం

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కీలక నిర్ణయం ప్రకటించారు. రాష్ట్రంలో టీచర్ల నియామక విధానంలో కీలకమైన మార్పు చేస్తున్నట్టు తెలిపారు. ఇకముందు టీచర్ల నియామకంలో బిహార్‌లో స్థిరనివాసం కలిగిన వారికే ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. 'బిహార్ స్థానికులకు టీచర్ల నియామకాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా సంబంధింత నిబంధనల్లో మార్పు చేయాలని విద్యా శాఖకు ఆదేశాలు ఇచ్చాం. సవరించిన నిబంధనలు టిఆర్ఇ–4 నుంచి వర్తిస్తాయి. 2025 టీచర్స్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ నాలుగో ఫేజ్ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. 2026లో టీఆర్ఈ5 ఉంటుంది' అని నితీష్ తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం 2005 నవంబర్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థను మెరుగుపరచేందుకు నిరంతరం పనిచేస్తోందని, మరింత పటిష్టం చేసేందుకు పెద్ద సంఖ్యలో టీచర్ల నియామకాలు జరుపుతున్నామని చెప్పారు. టిఆర్ఇ–5కు ముందే రిక్రూట్‌మెంట్ రోడ్ మ్యాప్‌లో భాగంగా స్టేట్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఎస్‌టిఇటి) కూడా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వ టీచర్ల ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రజల చిరకాల డిమాండ్‌గా ఉంది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో స్థానికులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది.


SHRIRAM Finance | వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP15AL 1546 | Vashipaka Prabhakar | JOHN DEERE 5310 | 2007 |
| 2 | AP22AD 3112 | Koluvula Raj Kumar | JOHN DEERE 5310 HARVESTER | 2010 |
| 3 | TS03UB 7521 | Dainampalli Mahipapl | AL DOST | 2016 |
| 4 | TG26 1072 | Ravi Kodi | KUBOTA MU 4501 | 2023 |
| 5 | TS24T 9010 | Jyothi Jatoth | AL DOST BS6 | 2021 |
| 6 | TS12UA 8875 | Srilatha Illendala | EICHER 11.10 FBT | 2010 |
| 7 | TS05UB 4651 | Nagamani Rayapuram | TATA ACE MEGA | 2015 |
| 8 | TG24T 0283 | Sheelam Chandra Mohan | APE XTRA LDX BS6 DIESEL | 2024 |
| 9 | AP11Y 6170 | Gaddala Shashi Kiran | TATA ACE | 2012 |

AUCTION DATE 08-08-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No :15-1-237, Shop No. 1, 2 & 3, 2nd Floor Warangal City Center, Beside Guarduan Hospital, Opp : L B College, Mulugu Road , Cell : .9000230006 & 8008900443

ప్రజాపక్షం
మంగళవారం, 05 ఆగస్టు

## చరిత్ర జ్ఞానం లేని న్యాయాధికారులు

రాజకీయ ఆందోళనకు సంబంధించిన ఒక పిటిషన్‌ను తిరస్కరిస్తూ బొంబాయి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌లు రవీంద్ర ఘుగే, గౌతం అంకడ్‌లు దేశం విస్తుపోయే వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు ఇంత అజ్ఞానంలో ఉంటారా, అవివేకమైన వ్యాఖ్యలు చేస్తారా అని సామాజిక, రాజకీయ చైతన్యం ఉన్న ఎవరైనా దిగ్భ్రాంతి వ్యక్తం చేయకపోరు. జడ్జీల ముందుకు వచ్చిన పిటిషన్ ఏమిటి? పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో శాంతియుత బహిరంగ సభకు అనుమతి కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ), భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు)–(సిపిఐ(ఎం)) దాఖలు చేసిన సంయుక్త పిటిషన్. బొంబాయి హైకోర్టు ద్విసభ్య ధర్మాసనంలోని న్యాయమూర్తులు దేశభక్తికి కొత్త నిర్వచనం చెబుతున్నట్లు–''ముందుగా మీ సొంత దేశంలోని పౌరుల పట్ల దేశభక్తి చూపండి'' అన్నారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టిందీ, గత వందేళ్లుగా పోరాడుతున్నది ఈ దేశంలో భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీకి గురవుతున్న అణగారిన ప్రజల హక్కుల కోసం, వారి జీవితాల మెరుగు కోసం అని న్యాయమూర్తులకు తెలియదా? ప్రజా ఉద్యమాల్లో ఎందరు అమరులైనారో కనీసం ఊహించలేరా? దేశభక్తి గూర్చి హైకోర్టు జడ్జీల నుంచి చెప్పించుకోవలసిన దుస్థితిలో కమ్యూనిస్టులు ఉండరు. జడ్జిలు ఏమన్నారో వినడానికే వింతగా ఉంది : ''మన దేశంలో పరిష్కరించాల్సిన సమస్యలెన్నో ఉన్నాయి. ఇలాంటిదేదీ (పిటిషన్‌లో విజ్ఞప్తి) మేము కోరుకోవటం లేదు. మీది సంకుచిత దృష్టి అని చెప్పటానికి విచారిస్తున్నాం. మీరు ఇక్కడేమి జరుగుతున్నదో అలక్ష్యం చేస్తూ గాజా, పాలస్తీనా వైపు చూస్తున్నారు. మీరు మీ దేశానికి ఏదైనా ఎందుకు చేయరు? మీ సొంత దేశం గూర్చి ఆలోచించండి. దేశభక్తులుగా ఉండండి, ఇది (పాలస్తీనా పట్ల సంఘీభావం) దేశభక్తి కాదు''.

న్యాయమూర్తులు ఇంకా ఇలా అన్నారు: ''అది–పాలస్తీనా వైపో లేక ఇజ్రాయెల్ వైపో అనుకూలత–రేపబోయే దుమ్ము గూర్చి మీకు తెలియదు. ఈ పని ఎందుకు చేయాలనుకుంటున్నారు. మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీని బట్టి దీనివల్ల దేశ విదేశీ వ్యవహారాలకు ఏమి జరుగుతుందో మీకు అవగతం కాదన్నది స్పష్టం... మీది భారతదేశంలో రిజిస్టర్ అయిన సంస్థ. చెత్తాచెదారం డంపింగ్, కాలుష్యం, మురికినీటి పారుదల, వరదల వల్ల ఇబ్బందులు వంటి సమస్యలను మీరు చేపట్టవచ్చు. మేము ఉదాహరణలు మాత్రమే ఇస్తున్నాం. మీరు వాటిపై నిరసన తెలియజేయడం లేదు... ఈ దేశానికి వేల మైళ్ల దూరంలో జరుగుతున్న దేన్నో గూర్చి నిరసన తెలియజేస్తున్నారు''.

మన స్వాతంత్య్ర పోరాట చరిత్ర, పాలస్తీనా లక్ష్యానికి మద్దతు వ్యక్తం చేస్తూ వరుస ప్రభుత్వాలు నిలకడగా తీసుకున్న విదేశాంగ విధాన వైఖరులు బహుశా జడ్జీలకు తెలిసి ఉండకపోవచ్చు. తమ మాతృభూమి నుంచి ఇజ్రాయెల్ తరిమివేసిన పాలస్తీనియన్‌లు స్వాతంత్రం కొరకు, స్వదేశం కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం, దానికి అంతర్జాతీయ సమాజం, ఐక్యరాజ్యసమితి ప్రకటిస్తున్న సంఘీభావం, గాజాలో ఇజ్రాయెల్ కొంతకాలంగా సాగిస్తున్న మారణహోమానికి ప్రపంచ దేశాల ఖండన, అంతర్జాతీయ కోర్టు ఆఫ్ జస్టిస్, ఐరాస సంస్థల అభిశంసన న్యాయమూర్తులు గమనించినట్లు లేదు. వలస పాలన నుంచి కొత్తగా విముక్తి పొందిన దేశాలను స్వతంత్ర అభివృద్ధి కోసం, నయా వలసవాద దోపిడీకి వ్యతిరేకంగా అలీనోద్యమంలోకి సమీకరించిన దేశాల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. ఎన్నో విముక్తి పోరాటాలకు ఆ ఉద్యమం అంతర్జాతీయంగా బాసటగా నిలిచింది. వేల మైళ్ల దూరంలోని దేశాల ప్రజలతో మనకేమీ పని, కూపస్థమండూకాలుగా బతుకుదామని భారత్ ఆనాటి నాయకులు ఉంటే అలీనోద్యమమే ఉండకపోను!

మోదీ ప్రభుత్వం సైతం అమెరికాతో, ఇజ్రాయెల్‌తో స్నేహంతో పాలస్తీనా సమస్యపై ఎన్ని ఊగిసలాడినా, గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని గుర్తిస్తున్నది. చర్చల ద్వారా పాలస్తీనా, ఇజ్రాయెల్ స్వతంత్ర్య రాజ్యాల స్థాపనే సమస్యకు పరిష్కారంగా చెబుతున్నది. బాధితుల పట్ల సంఘీభావం భారతీయుల నరనరాన ఉంది. దీన్ని ప్రోత్సహించవలసిన న్యాయమూర్తులు సంకుచిత భావజాలంతో వ్యాఖ్యానించటం వారి 'కమ్యూనిస్టు వ్యతిరేక మనోస్థితికి దర్పణం'. న్యాయవ్యవస్థ ప్రజల ప్రాథమిక హక్కులకు అండగా ఉన్నప్పుడే సమాజ పురోగమనానికి తోడ్పడిన వారవుతారు.

# కార్మిక కోడ్‌ల అమలుకు ఢిల్లీ ఉబలాటం

## సామాజిక భద్రత నియమాలు – 2025 ముసాయిదా ప్రచురించిన తొలి రాష్ట్రం

డాక్టర్ జ్ఞాన్ పాథక్

వివాదాస్పదమైన కొత్త కార్మిక కోడ్‌ల అమలు దిశగా ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఒక అడుగు వేసింది. సామాజిక భద్రత నియమాలు – 2025 ముసాయిదా కోడ్‌ను 2025 జులై 28వ తేదీన ప్రచురించింది. భారత పార్లమెంటు ఆమోదించిన సామాజిక భద్రత కోడ్ (సోషల్ సెక్యూరిటీ కోడ్)–2020 కింద ఈ నిబంధనావళిని మొట్టమొదట ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది. ఇతర మూడు కోడ్‌లైన వేతన కోడ్ (కోడ్ ఆన్ వేజెస్) – 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ (కోడ్ ఆన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్)–2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (కోడ్ ఆన్ ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషన్స్) – 2020లకు సంబంధించి నియమాల రూపకల్పన తుది దశలో ఉన్నాయి. వీటిని సమీప భవిష్యత్తులోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆమోదించిన కొత్త కార్మిక కోడ్‌లను గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం వ్యతిరేకించడటం గమనార్హం. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత దేశంలో అతిపెద్ద కార్మిక సంస్కరణలలో భాగంగా వీటిని కేంద్రం ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదింపజేసింది. ఈ కోడ్‌ల ప్రధాన లక్ష్యం సుళభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్). ఇవి దేశంలోని కార్మికులకు ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని మోదీ చెప్పగా, వీటిని కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమైనవని కేంద్ర కార్మిక సంఘాల (సిటియు) ఉమ్మడి వేదిక వ్యతిరేకిస్తోంది. వీటికి వ్యతిరేకంగా అనేక నిరసన ప్రదర్శనలు, అఖిల భారత సమ్మెలు చేశారు. చివరిసారిగా 2025 జులై 9న అఖిల భారత సమ్మె కూడా నిర్వహించారు. అయినప్పటికీ, అటు కేంద్రంలో, ఇటు ఢిల్లీలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాలు జులై 9 సమ్మెకు ప్రభావితమైనట్లు కనిపించడం లేదు. వివాదాస్పద కార్మిక కోడ్‌లను అమలు చేయడానికే ముందుకు వెళ్తున్నాయి. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయమంత్రి శోభా కరంద్లాజే జులై 24న రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ నాలుగు కార్మిక కోడ్‌ల అమలు దిశగా కేంద్ర ప్రభుత్వం ముసాయిదా నియమాలను ముందస్తుగా ప్రచురించినట్లు వెల్లడించారు. కార్మికుల అంశం అనేది భారత రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా కార్మిక నియమాలను రూపొందించే అధికారం ఉంది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 32 నాలుగు కార్మిక కోడ్‌ల కింద తమ ముసాయిదా నియమాలను ముందస్తుగా ప్రచురించాయని ఆమె పార్లమెంటుకు తెలియజేశారు. ఏ ఒక్క కార్మిక కోడ్ ముసాయిదా నియమాలను ముందస్తుగా ప్రచురించని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో పశ్చిమబెంగాల్, లక్షద్వీప్‌లు ఉన్నాయి. లక్షద్వీప్ కేంద్రపాలిత ప్రాంతం కాగా, పశ్చిమ బెంగాల్ మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పాలనలో ఉంది. ఆమె కొత్త కార్మిక కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీకి సంబంధించి 2021 నవంబర్‌లో వేతనాల కోడ్–2019 కింద ముసాయిదా నియమాలను ముందస్తుగా ప్రచురించింది. అప్పట్లో ఢిల్లీని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా పరిపాలించారు. నియమాలను ముందస్తుగా ప్రచురించడం ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయ అభిప్రాయ సేకరణకు అనుమతిస్తుందని గమనించాలి. ఆ తర్వాత నియమాలను రూపొందించడాన్ని, వాటిని ముందస్తుగా ప్రచురించడాన్ని ఢిల్లీ నిలిపివేసింది. 2025 ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి గెలుపొంది అధికారంలోకి వచ్చిన తర్వాతే కార్మిక కోడ్‌ల పని ముందుకుపడింది. ఢిల్లీలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌ల కింద నియమాలను రూపొందించడం ప్రారంభించింది. తమిళనాడు కేవలం ఒక్క కోడ్ కింద, అంటే సామాజిక భద్రత కోడ్–2020 కింద మాత్రమే ముసాయిదా నియమాలను ముందస్తుగా ప్రచురించలేదని రాజ్యసభకు కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. కొత్త కార్మిక కోడ్‌లను సవరించడానికి ఎలాంటి ప్రతిపాదన లేదని కూడా ఆమె పేర్కొన్నారు. సామాజిక భద్రత నియమాలు–2025పై ఢిల్లీ కోడ్ ముసాయిదా వ్యాపారవేత్తలు, ఉద్యోగాన్వేషకులకు ఇద్దరికీ సహాయం చేయడానికి కెరీర్ సెంటర్ల స్థాపనను, అసంఘటిత కార్మికుల కోసం సామాజిక భద్రతా బోర్డు ఏర్పాటును ప్రతిపాదించింది. ఇది సామాజిక భద్రతా నిధిని, ప్రమాదం, ప్రసూతి ప్రయోజనాల సందర్భాలలో కార్మికులకు నష్టపరిహారాన్ని క్రమబద్ధీకరించాలని కూడా ప్రతిపాదించింది. నాలుగు కార్మిక కోడ్‌లను మొత్తంగా రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక డిమాండ్ చేస్తోంది.

> *అనేక బిజెపి పాలిత రాష్ట్రాలు ఇప్పటికే నాలుగు కార్మిక కోడ్‌ల నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న అనేక కార్మిక చట్టాలను సవరించాయి. తద్వారా దొడ్డి దారిని ముందే కొత్త కార్మిక కోడ్‌లను అమలు చేయవచ్చు. అస్సోం, గుజరాత్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు ఇప్పటికే పారిశ్రామిక వివాదాల చట్టం–1947ను సవరించి, దాని వర్తించేందుకు ఉద్యోగుల సంఖ్యను 100 నుండి 300కు పెంచాయి.*



అయితే, ఢిల్లీ సామాజిక భద్రత నియమాలు– 2025 ముసాయిదా ప్రచురించబడిన తర్వాత, కార్మిక సంఘాలు దీనిని ప్రత్యేకించి విమర్శించాయి. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఒ), ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ), భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు కింద ప్రస్తుతం ఉన్న సామాజిక భద్రతా యంత్రాంగాలను ఈ నియమాలు నీరుగారుస్తాయని సిఐటియు పేర్కొంది. 'అసంఘటిత కార్మికుడు' నిర్వచనం మార్పుపై సిఐటియు ప్రధా న కార్యదర్శి అనియన్ వర్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎందుకంటే అందులో పారిశ్రామిక వివాదాల చట్టం– 1947 పరిధిలో లేని సంఘటిత రంగంలో పని చేసే ఒక వర్గం కార్మికులను కూడా కలిపారు. ఢిల్లీ ప్రభుత్వం మిగతా మూడు కోడ్‌ల ముసాయి దా నియమాలను సమీప భవిష్యత్తులోనే ఖరారు చేసి ప్రచురించాలని భావిస్తుండడమే కాకుండా, పారిశ్రామిక వివాదాల చట్టం–1947, ఢిల్లీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్–1954 ను సవరించేందుకు కూడా కూడా ప్రణాళిక వేసుకుంది. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ (సులభతర వ్యాపారం)' విధానంలో భాగంగా ప్రస్తుతం అమలులో ఉన్న ఈ రెండు కార్మిక చట్టాలను సవరించేందుకు ప్రభుత్వం ముందుకే వెళితే, అది ఢిల్లీలోని లక్షలాది కార్మికులపై తీవ్రమైన ప్రభావం ఉండడమే కాకుండా, వారి కార్మిక హక్కులను లాగేసుకుంటాయని కేంద్ర కార్మిక సంఘాలు, నిపుణులు హెచ్చరించారు. ఢిల్లీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం – 1954కు ప్రతిపాదిత సవరణ ప్రకారం 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను నియమించుకునే సంస్థలకు మాత్రమే ఆ చట్టం వర్తింపజేస్తారు. ప్రస్తుతం కనీసం ఒక ఉద్యోగి ఉన్న సంస్థలతో సహా అన్ని సంస్థలకు ఈ చట్టం వర్తిస్తుంది. చట్ట సవరణ ద్వారా వేతనంతో కూడిన సెలవులు, వారాంతపు సెలవులు, తొలగింపు కోసం ఒక నెల ముందస్తు నోటీసు వంటి కార్మికులకు కల్పించి రక్షణలపై ప్రభావం చూపుతుంది.

పారిశ్రామిక వివాదాల చట్టం–1947ను ప్రస్తుతం 100 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులను నియమించుకునే సంస్థలకు వర్తింపజేస్తుండగా, దానిని 300 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులు ఉండే సంస్థలకే అమలు చేసే విధంగా సవరించాలని ఢిల్లీ ప్రభుత్వం యోచిస్తోంది. ఇది లే–ఆఫ్‌లు, యూనిట్ల మూసివేత నుండి కార్మికులకు కల్పించే రక్షణను హరిస్తుంది. ఈ విషయంలో ఇప్పటికే జూన్ 30న ఒక సమావేశం జరిగింది. దీనికి లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా అధ్యక్షత వహించగా, ముఖ్యమంత్రి రేఖా గుప్తా హాజరయ్యారు. అనేక బిజెపి పాలిత రాష్ట్రాలు ఇప్పటికే నాలుగు కార్మిక కోడ్‌ల నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న అనేక కార్మిక చట్టాలను సవరించాయి. తద్వారా దొడ్డి దారిని ముందే కొత్త కార్మిక కోడ్‌లను అమలు చేయవచ్చు. అస్సోం, గుజరాత్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు ఇప్పటికే పారిశ్రామిక వివాదాల చట్టం–1947 ను సవరించి, దాని వర్తించేందుకు ఉద్యోగుల సంఖ్యను 100 నుండి 300లకు పెంచాయి. గుజరాత్ కూడా షాప్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ఉద్యోగ,సేవా స్థితిగతుల నియంత్రణ) చట్టం– 2019ను ఆరు సంవత్సరాల క్రితమే సవరించి, ఉద్యోగ పరిమితిని 10కి పెంచింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం ఢిల్లీలో షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరించినట్లయితే, అది సుమారు 15 లక్షల మంది ఉద్యోగులపై ప్రభావితం చూపిస్తుందని, ఆ సంఖ్య 20 లక్షలకు లేదా అంతకంటే ఎక్కువ కూడా పెరగవచ్చని అంచనా.

(ఐపిఎ సర్వీసెస్)

# కేంద్రం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఆమోదించాలి!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో అన్నిపార్టీల ఆమోదంతో రెండు కీలక బిల్లులను స్థానిక సంస్థల రాజకీయ పదవుల్లో, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లులు తీసుకొచ్చింది. ఇది రాష్ట్ర రాజకీయ చరిత్రలో మైలురాయి. ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల హామీ అయిన కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్నట్టుగానే.. కాంగ్రెస్ పార్టీకి బీసీలపట్ల ఉన్న నిబద్ధతకు కట్టుబడి ఉన్నామని, ఎన్నికలలో ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన వెంటనే శాసనరూపంలోకి తీసుకువచ్చి తన నిబద్ధతను చాటుకుంటున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీనిని బీసీ సంఘాలు హర్షిస్తు స్వాగతిస్తున్నాయి. బిసిల జనాభాకు తగిన ప్రాధాన్యత కల్పించాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం సీట్లు కేటాయించాలని బీసీ సంఘాలతో పాటు రాజకీయపార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని గవర్నర్ ఆమోదంతో రాష్ట్రపతికి రెండు మాసాల క్రితమే పంపించింది. దీనిని రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంది.

### బిఆర్ఎస్, బిజెపి తలోదారి!

బిసి బిల్లును అసెంబ్లీలో బలపర్చిన టిఆర్ఎస్, బిజెపిలు వారి రాజకీయ స్వార్థం కోసం.. విచిత్రమైన వాదనలు చేస్తున్నారు. బీసీ బిల్లులను తొమ్మిదో షెడ్యూల్లో చేర్పించాల్సిందే అంటున్న బిఆర్ఎస్ నేతలు, అది కుదిరేది కాదని చెప్తున్న బిజెపి లీడర్లు. ఒకవేళ చేర్చిన సుప్రీంకోర్టులో నిలవదు అంటూ కామెంట్లు. ముస్లింలను బిసిల్లో చేర్చడం తమకు ఆమోదం కాదని, దీన్ని వ్యతిరేకిస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇప్పటికే ఓపెన్‌గా ప్రకటించారు.

### పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్

రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు జరిపించాలని హైకోర్టు డైరెక్షన్స్ ఇవ్వడంతో.. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించటానికి కట్టుబడి ప్రస్తుతమున్న పంచాయితీరాజ్ చట్టం లోని సెక్షన్ '285 ఎ'ను సవరించి, స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకురావడం జరిగింది. ఈ ఆర్డినెన్సును గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతికి పంపించడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ ఆర్డినెన్స్‌పై బిఆర్ఎస్ పార్టీ వ్యతిరేకతతోనే ఉన్నది. బహూశా ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285 ఎకు చేసిన సవరణలను తిరిగి సవరించటంతో రాజకీయంగా వ్యతిరేకిస్తున్నట్లుగా ఉన్నది. కేంద్ర ప్రభుత్వం 42 శాతం బిసిలకు రిజర్వేషన్ అనుకూలంగానే ఉన్నామని ప్రకటిస్తున్నదే తప్ప పార్లమెంట్లో బిల్లు ఆమోదం చేసే పరిస్థితిలో లేదు. తెలంగాణ నుంచి ఎన్నికైన బిజెపి ఎంపిలు మంత్రులు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసే పరిస్థితిలో లేరు.

### ఢిల్లీలో 5–7 తేదీలలో ధర్నా!

రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తు అసెంబ్లీలో చేసిన చట్టాన్ని వెంటనే ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆగస్టు 5–7 తేదిలలో భారీ ధర్నాను తలపెట్టింది. దీనికి కౌంటర్‌గా బిజెపి వారు ఆగస్టు 3న ఇందిరా పార్క్ వద్ద 42 శాతం కల్పించాల్సిందే అంటూ ధర్నా చేపట్టారు. అయితే ముస్లింలోని పేదలను రిజర్వేషన్‌ల కిందకు తేవటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. జాగృతి పేరుతో ఎమ్మెల్సీ కవిత నాయకత్వాన ఆగస్టు 4న 72 గంటల పాటు ధర్నా చేపట్టారు.

### కులగణన

గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం బిసి కులగణాంకాలు రాజకీయ, ఆర్థిక, సామాజిక,విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించిన 75 అంశాలతో సమాచారాన్ని కులాలవారీగా శాస్త్రీయంగా ప్రతి ఇంటి నుండి సేకరించిన తర్వాత డేడికేటెడ్ కమీషన్ వేసింది, 'కులగణన చేశాం, బిసిల రాజకీయ వెనుకబాటుతనంపై ఎంపిరికల్ డేటా సేకరించాం కాబట్టి రిజర్వేషన్ పెంచితే న్యాయస్థానాలు తప్పు పట్టవని.. విస్తృతంగా అధ్యయనం చేసిన తర్వాత అసెంబ్లీలో రాష్ట్రంలో బిసిల జనాభా 56 శాతంగా ఉన్నదని .. దానికి తగినట్లుగా విద్యా, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని' ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లులు తెచ్చింది.

### బిసి రిజర్వేషన్ల నేపథ్యం

1920లో నిజాం ప్రభుత్వం ఆదేశాలతో సయ్యద్ సిరాజుల్ హసన్ నేతృత్వంలో ఆనాడు గుర్తింపు పొందిన 98 కులాల వారి జనాభా లెక్కింపును వారి గోత్రాలను, రాజకీయ ఆర్థిక సామాజిక కట్టుబాట్లతో సహా సవివరమైన నివేదికలు హైదరాబాద్ రాష్ట్రంలో తయారు చేసింది. 1931లో జరిగిన జనగణనలలో బిసి కులగణనను చేర్చటం జరిగింది. తిరిగి 59 సంవత్సరాల తర్వాత మండల కమిషన్ పుణ్యమా అని కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలలో ఉద్యోగాల్లో కేవలం 27శాతం రిజర్వేషన్ ఇచ్చింది. 1992 సంవత్సరంలో పివి నరసింహారావు కాంగ్రెస్ ప్రభుత్వం 73,74 రాజ్యాంగ సవరణ ద్వారా 243 అధికరణం ప్రవేశపెట్టడం ద్వారా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను మొట్టమొదటిసారిగా ప్రోత్సహించింది. తదుపరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌టి రామారావు ప్రభుత్వం 1994లో 34 శాతం బిసి రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో అమలుపరిచింది. ఆ తరువాత అనేకసార్లు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదే రీతిన పంచాయతీ ఎన్నికలు జరగడానికి దోహదపడింది.

2018లో కెసిఆర్ ప్రభుత్వం చేసిన తప్పుడు నిర్ణయాలతో, న్యాయస్థానాల్లో సరైన వాదనలు సమర్పించకపోవడంతో తెలంగాణ స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు 18 శాతం 23 శాతం మధ్య తగ్గించబడ్డాయి. దాంతో వెనుకబడిన వర్గాలు స్థానిక సంస్థలలో వేలాది స్థానాలు కోల్పోయారు. ఇక స్థానిక సంస్థల రిజర్వేషన్ విధానాల్లో 1994లో ఆర్టికల్ 243 పై సవాల్ చేసిన, 'కృష్ణమూర్తి వర్సెస్ కేంద్ర ప్రభుత్వం' కేసులో 16 సంవత్సరాల తర్వాత 2010లో తీర్పు వచ్చింది. ఆ తీర్పులో బిసి సామాజిక వర్గానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ ఇవ్వాలంటే ఖచ్చితంగా వారి సామాజిక ఆర్థిక గణాంకాలు స్పష్టంగా ఉండాలని చెప్పడం జరిగింది.

### తెలంగాణ సర్వే చట్టబద్ధమే:

1994లో తమిళనాడు ప్రభుత్వం, బిసి వర్గాల ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని రాజ్యాంగం 9వ షెడ్యూల్లో పెట్టడం ద్వారా రిజర్వేషన్లు రాజ్యాంగ సమీక్షకు అవకాశం లేకుండా చేసుకుంది. ఆ విధంగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చే విషయంలో తన ఆందోళనలకు ప్రజాస్వామ్యవాదులు వెనుకబడిన వర్గాల మద్దతు కూడగట్టి పార్లమెంటులో తమ పార్టీ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. ఒకవేళ అలా జరగకపోతే 1992లో 'ఇందిరా సహాని వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ అనివార్య పరిస్థితుల్లో రిజర్వేషన్లు 50 శాతానికి పైబడి పెంచుకోవచ్చని.. కానీ గణాంకాలు కచ్చితంగా ఉండాలని చెప్పడం జరిగింది. ఆ కేసు తీర్పును అనుసరించే ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లను 78 శాతానికి పెంచిన విషయం అందరికీ తెలిసిందే. అక్కడిలాగే తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వే శాస్త్రీయం, సమగ్ర గణాంకాలతో రూపొందించింది కాబట్టి బిసి రిజర్వేషన్‌లు 42 శాతానికి పెంపుపై న్యాయస్థానాల్లో ఎటువంటి ఆటంకం ఉండదని న్యాయనిపుణులు చెబుతున్నారు.

కేంద్రం 2026లో చేపట్టే జనగణనలో ప్రతిపక్షాల ఒత్తిడితో కులగణనను చేపట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణాలో శాస్త్రీయంగా చేపట్టిన బిసి కులగణనను ఆమోదించాలని రాజ్యాంగం 9వ షెడ్యూల్‌లో చేర్చి బిసిలకు రక్షణలు కల్పించాలని రాష్ట్రప్రభుత్వం డిమాండు చేస్తుంది. బిసిల న్యాయమైన ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలి. దీన్ని పార్టీ అంశంగా చూడరాదు.

– ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

# సాంస్కృతిక పునరుజ్జీవనానికి, ఆధ్యాత్మిక పర్యాటక వ్యాప్తికి కృషి



డా.జి.వెన్నెల గద్దర్
(తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్)

కళ, వారసత్వం ఆధ్యాత్మిక వ్యాప్తి ప్రత్యేకమైన సంగమంలో, తెలంగాణ సాంస్కృతిక సారథి తెలంగాణ అంతటా ఆలయ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర గొప్ప సాంస్కృతిక సంప్రదాయాలను పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తోంది. 550 మందికి పైగా కళాకారులను ఒకచోట చేర్చింది, తెలంగాణ ఉద్యమానికి వారి సహకారాన్ని గుర్తించడం అర్థవంతమైన సాంస్కృతిక వారసత్వం ద్వారా వారి నిరంతర జీవనోపాధిని నిర్ధారించడం అనే ద్వంద్వ లక్ష్యంతో యువజన సేవలు, పర్యాటక సాంస్కృతిక శాఖ కింద పనిచేస్తున్న సంస్కృత సారథి, ప్రభుత్వ కార్యక్రమాలు, సామాజిక అవగాహన ప్రచారాలను గ్రామం వారీగా అట్టడుగు స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించింది. కళ ద్వారా సంప్రదాయాన్ని పెంపొందించడం ఉద్దేశంతో సాంస్కృతిక సారథి పనిచేస్తుంది. సాంస్కృతిక సారథితో సంబంధం ఉన్న కళాకారులను డప్పు, డోలక్, ఒగ్గు కథలు, మహిళలకు కర్రసాము, కోలాటం, వీధి నాటకాలు వంటి సాంప్రదాయ రూపాల్లో శిక్షణ పొందిన వివిధ ప్రదర్శన బృందాలుగా విభజించారు. ఈ బృందాలు తెలంగాణ జానపద వారసత్వంపై గర్వాన్ని పెంపొందించుకుంటూ సామాజిక దురాచారాలు, మూఢనమ్మకాలను ఎదుర్కోవడానికి ప్రచారాలను చురుకుగా నిర్వహిస్తాయి. ఈ కళారూపాలను సంరక్షించడం, ఆచరించడం, యువతరాలకు అందించడం కోసం శిక్షణా శిబిరాలు, వర్క్‌షాప్‌లు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. 2014 లో ఏర్పడిన భారతదేశంలో అతి చిన్న రాష్ట్రమైన తెలంగాణ, శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్ షాహీలు అసఫ్ జాహి నిజాంలు వంటి ప్రముఖ రాజవంశాలచే రూపొందిన చారిత్రక వైభవంతో నిండి ఉంది. ప్రపంచ ప్రఖ్యాత రామప్ప ఆలయం నుండి హైదరాబాద్‌లోని ఐకానిక్ చార్మినార్ వరకు ఈ ప్రాంతంలో నిర్మాణ అద్భుతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలలో వారి వారసత్వం స్పష్టంగా కనిపిస్తుంది. బతుకమ్మ బోనాలు వంటి జరుపుకునే పండుగలు ఈ ప్రాంతం యొక్క సాంస్కృతిక గొప్పతనాన్ని మరింతగా వివరిస్తాయి, పేరిణి శివతాండవం, ఒగ్గు కథ వంటి కళారూపాలు శౌర్యం, భక్తి కథలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూనే ఉన్నాయి. ఆలయ పర్యాటకం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక తీర్థయాత్రలు పెంపొందించి ప్రజలకు సంస్కృతి వారసత్వంపై అవగాహన కల్పిస్తుంది. యాదాద్రి లక్ష్మి నరసింహా స్వామి ఆలయం గోపు రం, శిల్పాలకు ప్రసిద్ధి చెందిన కొండపై ఉన్న పుణ్యక్షేత్రం. తేలియాడే ఇటుకలు, కాకతీయుల కాలం నాటి సంక్లిష్టతకు ప్రసిద్ధి చెందిన యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం రామప్ప ఆలయం. గోదావరి ఒడ్డున ఉన్న భద్రాచలం ఆలయం. త్రిమూర్తుల భక్తిని ప్రదర్శించే వరంగల్‌లోని 12వ శతాబ్దపు అద్భుతం వెయ్యి స్తంభాల ఆలయం. బాసర సరస్వతి ఆలయం, పిల్లలను నేర్చుకోవడానికి ప్రేరేపించే అక్షరాభ్యాస ఆచారానికి ప్రసిద్ధి చెందింది. నేలకొండపల్లి, ధూళికట్ట, ఫణిగిరి వంటి బౌద్ధ ప్రదేశాలు స్థూపాలు, శాసనాలు, సన్యాసుల శిథిలాలతో సమృద్ధిగా ఉన్న పురాతన తెలంగాణలోని అంతగా తెలియని అధ్యాయాన్ని వెల్లడిస్తాయి. క్రైస్తవ వారసత్వంలో దక్షిణ భారతదేశంలో అతిపెద్ద చర్చిలలో ఒకటైన మెదక్ కేథడ్రల్, సికింద్రాబాద్‌లోని ఆల్ సెయింట్స్ చర్చి, హైదరాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ కేథడ్రల్ ఉన్నా యి. వలసరాజ్యాల యుగం గోతిక్ వాస్తుశిల్పం, ఆధ్యాత్మిక దయకు చిహ్నాలు. సికింద్రాబాద్‌లోని కుల్‌పాక్జీ ఆలయం, గురుద్వారా సాహిబ్ వంటి జైన సిక్కు ప్రదేశాలు తెలంగాణ లోతైన మతపరమైన బహుళత్వాన్ని సూచిస్తాయి. ఇస్లామిక్ ఆధ్యాత్మిక ప్రదేశాలు, ముఖ్యంగా మక్కా మసీదు, బాద్షాహి అషుర్ఖానా, భక్తులు పర్యాటకులు తరచుగా సందర్శించే కుతుబ్ షాహి, మొఘల్ ప్రభావాలకు నిదర్శనంగా నిలుస్తాయి. రామకృష్ణ మఠం, శాంతి వనం ఆశ్రమం, కాళేశ్వరం సంగమం వంటి ఆశ్రమాలు పవిత్ర నదులు ధ్యానం, అభ్యాసం, స్వీయప్రతిబింబం కోసం స్థలాలను అందిస్తాయి. తెలంగాణ సాంస్కృతిక సారథి సాంస్కృతిక మార్గదర్శిగా మాత్రమే కాకుండా రాష్ట్ర పర్యాటక దృక్పథంలో కీలక భాగస్వామిగా కూడా పనిచేస్తుంది.

# చంద్రుడిపై తొలి అడుగుకు 95 ఏళ్లు

వ్యోమగామి(ఆస్ట్రనాట్)గా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అంతరిక్ష చరిత్రలో చెరగని అరుదైన రికార్డును నెలకొల్పాడు. 1930 ఆగస్టు 5న ఓహియా నగరంలో జన్మించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్డ్యూ యూనివర్సిటీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ డిగ్రీని పూర్తి చేసి, సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఇంజనీకరింగ్ విభాగంలో పిజీ కూడా పూర్తి చేసాడు. 1949–50 మధ్య కాలంలో నావల్ ఏవియేటర్‌గా, నేషనల్ అడ్వైజరీ కమిటీ ఫర్ ఏరోనాటిక్స్, నాసా(నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ ఆర్గనైజేషన్)లలో చేరిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్17 ఏండ్ల పాటు ఇంజనీర్‌గా సేవలు అందించాడు. నాసాలో ప్రాజెక్ట్ పైలెట్‌గా దాదాపు 200 రకాల ఏయిర్‌క్రాఫ్ట్‌లు, జెట్స్, రాకెట్లు, హెలీకాప్టర్లు, గ్లైడర్స్‌ల్లో వైమానికుడిగా బహుముఖ ప్రతిభను ప్రదర్శించాడు. 1962లో ఆస్ట్రోనాట్‌గా జెమిని8 మిషన్‌లో భాగంగా 1966లో అంతరిక్షయానం విజయవంతంగా పూర్తి చేశాడు. అంతరిక్షంలో నెలకొన్న తీవ్ర వాతారణాన్ని తట్టుకుంటూ మానసికంగా దృఢ విశ్వాసంతో చంద్రమండల ప్రయాణం పూర్తి చేసిన ఆర్మ్‌స్ట్రాంగ్ చూపిన సాహస స్ఫూర్తి నేటి తరానికి ప్రేరణగా నిలుస్తున్నది. నావల్ ఏవియేటర్, టెస్ట్ పైలెట్, యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏరోనాటికల్ ఇంజనీర్ లాంటి పలు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అపోలో 11 ల్యూనార్ మాడ్యూల్ ప్రాజెక్ట్‌లో స్పేస్‌క్రాఫ్ట్ కమాండర్‌గా తొలి మానవసహిత చంద్రమండల ప్రయాణానికి నాయకుడిగా సిద్ధం అయ్యాడు. 16 జూలై 1969 రోజున నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌తో పాటు పైలెట్ బజ్ ఆల్డ్రిన్, మైఖేల్ కోలిన్స్‌లతో కలిసి చంద్రమండల ప్రయాణానికి ప్రారంభం అయ్యారు. 2.4 లక్షల మైళ్లు ప్రయాణించి 1969 జులై 20న చంద్రమండలానికి చేరుకున్నాడు. అదే రోజు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వ్యోమనౌక లోంచా బయటకు వచ్చి చందమామ ఉపరితలంపై తొలిసారి కాలుమోపి, రెండున్నర గంటల పాటు చంద్రుడిపై బజ్ ఆల్డ్రిన్‌తో కలిసి సంచరించాడు. వ్యోమనౌకలో ఉన్న మైఖేల్ కాలిన్స్ కక్ష్యలో మాత్రమే పరిభ్రమించాడు. అంతరిక్ష చరిత్రలో మొదటి మానవుడిగా రికార్డును నెలకొల్పారు. ఈ అంతరిక్ష మిషన్‌లో మొత్తంగా 8 రోజులు, 14 గంటలు, 12 నిమిషాలు అంతరిక్షంలో గడిపాడు. చందమామ ఉపరితలంపై కాలుమోపిన మరు క్షణమే భావోద్వేగాలకు గురి అయిన ఆర్మ్‌స్ట్రాంగ్ మాట్లాడుతూ 'చందమామపై వేసిన ఓ చిన్న తొలి అడుగు, రేపటి మానవాళి అంతరిక్ష చరిత్రలో ఓ భారీ ముందడుగు' అంటూ పేర్కొన్నాడు. 16వ ఏట 1947లో నావల్ ఏయిర్ కెడెట్‌గా, 1971–79 మధ్య కాలంలో సిన్సినాటీ యూనివర్సిటీలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, 1982–92 మధ్య కంప్యూటింగ్ టెక్నాలజీ ఫర్ ఏవియోషన్ విభాగానికి చైర్మన్‌గా ఆర్మ్‌స్ట్రాంగ్ సేవలు అందించాడు. 2012 ఆగస్టు 25న తన 82వ ఏట అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఆదర్శమయ జీవితం ఏరోనాటికల్ ఇంజనీర్స్, వ్యోమగాములకు దారి దీపంగా వెలుగులు చిమ్ముతూనే ఉన్నాడు.



– బిఎంఆర్
9949700037

## సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

ఎస్‌పి మహేష్ బి.గితే

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. సోమవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుండి 28 ఫిర్యాదులు స్వీకరించామని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకుహ న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించిన సిపి గౌష్ ఆలం

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని కేశవపట్నం పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈ సంధర్బంగా కేశవపట్నం పోలీస్ స్టేషన శిధిలావస్థకు చేరుకోవడంతో పాత పోలీస్ స్టేషన్‌కు సమీపంలో మొలంగూర్ శివారులోని అద్దె భవనంలోకి మార్చారు. నూతన పోలీస్ స్టేషన్ భవన ఆవరణలో సిపి గౌష్ ఆలం మొక్కలు నాటారు. నూతన భవనంలో ఏర్పాటు చేసిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ రూమ్, రైటర్ రూం, రికార్డు గది, రిసెప్షన్ కౌంటర్, వెయిటింగ్ హాల్‌లను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేశవపట్నం పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. ఇంతకుముందే పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు. త్వరలో పోలీస్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసిపి మాధవి, రూరల్ సిఐ వెంకటే, జమ్మికుంట టౌన్ సిఐ రామకృష్ణ గౌడ్, హుజురాబాద్ టౌన్ సిఐ కరుణాకర్, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియం లో ప్రజల నుంచి కలెక్టర్ సోమవారం అర్జీలు స్వీకరించారు. మొత్తం 189 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులు పెండింగ్ లో పెట్టవద్దని కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తుల వివరాలు. రెవెన్యూ శాఖకు 69, హౌసింగ్ శాఖకు 50, డీఆర్డీఓ 17, ఉపాధి కల్పన శాఖ, ఎస్డీసీకి ఎనిమిది చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా విద్యాధికారికి ఆరు చొప్పున, సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయానికి ఐదు చొప్పున, సెస్, జిల్లా వ్యవసాయ అధికారి, ఎస్పీ ఆఫీస్ కు మూడు చొప్పున, జీజీహెచ్, ఈఓ వేములవాడ రాజరాజేశ్వర ఆలయానికి రెండు చొప్పున, జిల్లా వైద్యాధికారి, ఎల్ డీ ఎం కు ఒకటి చొప్పున వచ్చాయి.

## గ్రీవెన్స్-డే బాధితుల సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/జగిత్యాల:** బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లాలో ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగాసోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 19 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యల పూర్తి వివరాలను సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసు శాఖను చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందపరుస్తు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## సత్వరమే అర్జీల పరిష్కారం



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:**అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా *అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన పర్వీన్ తన భర్త కుద్భోద్దీన్ కు ఇటీవలే ప్రమాదం జరిగి కాలు తీసివేయడం జరిగిందని, తమకు కుటుంబ పోషణ కష్టంగా ఉందని , సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల (మహిళలు) లో వాచ్మెన్ ఖాళీగా ఉందని అట్టే అవుట్సోర్సింగ్ నౌకరి తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా వారధి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కాల్వ శ్రీరాంపూర్ మండలం పోచమ్మ కాలనీ కు చెందిన జి.రమేష్ తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలను కోరుతూ దరఖాస్తు చేసుకోగా పి.డి. డి.ఆర్.డి.ఏ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. నంది మేడారం గోపాల్ రావు పేట గ్రామాలకు చెందిన రైతులు గోలివాడ నుండి గోపాలరావు పేట వరకు ఉన్న రోడ్డు పనులు మధ్యలోనే ఆగిపోయాయని, వాటిని పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ధర్మారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మద్దతుతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ప్రజల మద్దతుతోనే పట్టణం అభివృద్ధి సాధ్యమవుతుందని జగిత్యాల ఎంఎల్‌ఏ డా.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణ 47,48, 1, 2, 5, 7 వార్డులలో 1 కోటి 36 లక్షల నిధులతో అభివృద్ధి పనులకు సోమవారం జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ పట్టణ అబివృద్ధికి ముఖ్యమంత్రి 50 కోట్ల నిధులు మంజూర్ చేయగా అభివృద్ధికి అంచనాలు రూపొందిస్తున్నామన్నారు. టిఆర్‌నగర్‌లో 116 మందికి జీవో 58లో భాగంగా గతంలో ఇండ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, అర్హులు అందరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూర్ చేస్తామని తెలిపారు. పట్టణ పచ్చదనం, పారిశుద్ధ్య అభివృద్ధి ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, ఏవో శ్రీనివాస్, డీఈ వరుణ్, ఏఈ శరన్, అనిల్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌లు, చాంద్‌పాషా, దేవేందర్‌నాయక్, కుసరి అనిల్, బద్ధం లతజగన్, గుగ్గిళ్ల హరీష్, రేణుక మొగిలి, మాజీ కో అప్షన్ సభ్యులు శ్రీనివాస్, వార్డు నాయకులు, మున్సిపల్ సిబ్బంది, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి నూతన క్యాంపు కార్యాలయం ప్రారంభం

కుటుంబ సభ్యులతో ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని మంకమ్మతోటలో మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన మినిస్టర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. సోమవారం రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రారంబించిన కార్యాలయాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, కరీంనగర్ మాజీ ఎంపిగా, మంత్రిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నూతన కార్యాలయాన్ని నిర్మించి ప్రారంబించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజల సేవల కోసం పరిష్కార వేదికగా ప్రారంభించిన ఈ కార్యాలయం నుంచి లోక్‌సభ నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటుగా అభివృద్ధికి సంబంధించి కార్యాలయంలో సిబ్బందితో సహా అర్జీలు, విజ్ఞాపన పత్రాలు, సీఎం సహాయనిధి, ఇతర ధరఖాస్తుల స్వీకరణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారం అందుబాటులో ఉంటుందనన్నాఉ. ముఖ్యమంత్రి నాయకత్వంలో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో ఈ కార్యాలయం అన్ని రకాలుగా ఈ కార్యాలయం వేదికగా ఉంటుందని, ప్రజలందరూ ఈ కార్యాలయాన్ని వినియోగించుకోవాలని కోరారు. కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, పడాల రాహుల్, గడ్డం విలాస్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మడుపు మోహన్, మల్యాల సుజిత్, యండి తాజ్, శ్రావణ్ నాయక్, బోనాల శ్రీనివాస్, కంకణాల అనిల్ కుమార్, ఎస్‌ఏ మోసీన్, ముద్దం తిరుపతి, ఎస్‌ఎల్ గౌడ్, తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, ఆకుల ప్రకాష్, పడిశెట్టి భూమయ్య, కట్ల సతీష్ తదితరులున్నారు.

**శ్రీ సీతారామ కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం**

కరీంనగర్‌లోని భగత్‌నగర్ శ్రీహరిహర క్షేత్రం అయ్యప్ప స్వామి ఆలయంలో దాతల సహకారంతో రూ.19 లక్షలతో నిర్మించిన శ్రీ సీతారామ కళ్యాణ మండపాన్ని సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రారంబించారు. పేదలకు అనుకూలంగా ఉండే విధంగా స్వల్ప నామమాత్రపు రుసుం చెల్లించి వేడుకలు నిర్వహించుకునే విధంగా ఆలోచన చేయడం, అయ్యప్ప స్వామి దీక్షా కాలంలో స్వాములు బిక్ష చేయడానికి గతంలో ఉన్న ఇబ్బందులను తొలగించి అన్ని సౌకర్యాలతో కళ్యాణ మండపాన్ని నిర్మించడం పట్ల ఆలయ చైర్మన్ యాగండ్ల అనిల్ కుమార్, ఆలయ ఇవో కాంతారెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. భక్తులకు, దాతలకు అయ్యప్ప స్వామి దీవెనలు ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. కాంగ్రెస్ నేత, కోహెడ్ మండల మాజీ ఎంపిపి రాచకొండ చక్రధర్ ఆద్వర్యంలో రూ.35 లక్షలతో అయ్యప్ప స్వామి ఆలయ మండపం పునర్మిర్మాణం చేపడుతున్నామని, ఇందులో బాగంగా ఇప్పటికే రెండు ఉప ఆలయాలు నిర్మించడం జరిగిందని, ఈ నెల 14న ఆంజనేయ స్వామి, శ్రీకృష్ణ భగవానుని విగ్ర ప్రతిష్టాపన చేయడం జరుగుతుందని చైర్మన్ యాగండ్ల అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రితో పాటు గద్దర్ అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్ర, కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్‌రావు, పాలకవర్గ సభ్యులు సత్యనారాయణ, కృష్ణ, ఆనందరెడ్డి, కవిత శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్ కుమార్, పడాల రాహుల్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు, ఆకారపు భాస్కర్ రెడ్డి, ముద్దం తిరుపతి, కంకణాల అనిల్ కుమార్, బోనాల శ్రీనివాస్, మల్యాల సుజిత్ కుమార్, కర్ర సత్యప్రసన్నారెడ్డి, రజితరెడ్డి, ఆకుల ప్రకాష్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ఎల్లవేళలా పాటుపడుతుందని వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్పు ఆది శ్రీనివాస్ అన్నారు .సోమవారం పట్టణంలోని భగవంతరావు నగర్ లో నూతనంగా ఏర్పాటుచేసిన రాజరాజేశ్వరి బోటిక్ అండ్ బ్యూటీ పార్లర్ లతోపాటు మ్యాచింగ్ సెంటర్ ను సోమవారం ఆయన ప్రారంభించారు. మహిళా సంఘాల కోసం, మహిళల అభివృద్ధి కోసం, మహిళా మణులను లక్షాధికారులు చేయడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్ అండగా నిలుస్తుంది అన్నారు. తమ స్వయంకృషితో రాజరాజేశ్వరి సెంటర్ ను ప్రారంభించుకున్న మారేపు హేమలత, శీలం స్వప్న, చందనగిరి తేజస్వి లను ఆది శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాజరాజేశ్వరి సెంటర్ నిర్వాహకులు, వారి బంధువులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఆర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ బి.సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజావాణిలో వచ్చే ఆర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ బిఎస్ లత, ఆర్డీవోలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంలో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 43 ఫిర్యాధులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూధన్, జివాకర్‌రెడ్డి, శ్రీనివాస్, డిపిఆర్‌వో రఘువరన్, డీపివో మదన్ మోహన్, వివిధ జిల్లా అధికారులు తహసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 19 నుండి 22 వరకు సిపిఐ నాల్గవ మహాసభలు

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిపిఐ తెలంగాణ నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభలకు సంబంధించి గోడపత్రికలను సిపిఐ జిల్లా నాయకులతో కలసి మందపవన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల ప్రస్తానంలో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలకు మరింత మమేకం చేయటమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయన్నారు. గడిచిన మూడేళ్లలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకరావటంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. తద్వార గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 240 సీట్లకే కట్టడి చేయటంలో విజయం సాధించినట్లు తెలిపారు. ఆసంఘటిత కార్మికుల వేతనాల పెంపుకోసం సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అధికార పార్టీతో స్నేహబంధాన్ని పాటిస్తూనే ప్రజాసమస్సలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నట్లు తెలిపారు.ఇక ముందు మరింత పెద్దఎత్తున ప్రజాపోరాటాలకు సన్నద్ధం కావాలని, ఇందుకు మహాసభల వేదికగా కార్యచరణను రూపొందించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బట్టుదయానందరెడ్డి, జాగిరి సత్యనారాయణ, వనేశ్, కిష్టపురం లక్ష్మణ్, అందే అశోక్, కనుకుంట్ల శంకర్, కొమ్ముల భాస్కర్, జెర్రిపోతుల జనార్ధన్, పిల్లి రజని, జిల్లా కౌన్సిల్ సభ్యులు భోనగిరి రూపేశ్, వేల్పుల శ్రీనివాస్, గజబింకార్ బన్సిలాల్, మిట్టపల్లి సుధాకర్, కర్నాల చంద్రం, స్వర్గం రాజేశం, పిట్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణకు 'అల్బెండజోల్' మాత్రలు వేయించాలి

జిల్లాలో 2.29361 విద్యార్థులు, 2461కేంద్రాలతో పంపిణీ

కలెక్టర్ హైమావతి




**ప్రజాపక్షం/సిద్దిపేట:** నులిపురుగుల నివారణకు 1 నుండి 19 ఏండ్ల పిల్లలందరికి తప్పకుండ అల్బెండజోల్ మాత్రలు వేయించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. ఈదెల 11న జాతీయ నులుపురుగుల నిర్మూలన కార్యక్రమం పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్. అబ్దుల్ హమీద్‌లతో కలసి జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 ఏండ్ల వయస్సు కలిగిన పిల్లలు 2.29.361 మంది ఉన్నారని వారికి జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవం జిల్లాలో ఏర్పాటు చేసిన 2461 కేంద్రాల ద్వారా ఈనెల 11న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడి కేంద్రాల్లో అల్బాండేజోల్ మాత్రలు పిల్లలకు స్వయంగా వైద్య ఆరోగ్య సిబ్బందిచే వేయటం జరుగుతుందన్నారు. నులిపురుగులో ఏలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు పుంటయని, ఇవి పిల్లలకు ఆరుబయట మట్టితో ఆడుకున్నప్పుడు చేతులు కడుక్కోకుండ ఆరోగ్యం భుజించినప్పుడు, బహిరంగ ప్రదేశాలో మలవిసర్జన చేసినప్పుడు ఆపరిశుభ్ర పరిసరాల వల్ల ఇవి సంక్రమిస్తాయన్నారు. పిల్లలు మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఈ మాత్రలు వేయాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజల్ మాత్రలు వేసేలా పర్యావేక్షించాలని డిఈఓ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి అన్ని రకాల వైద్య, ఆరోగ్యశాఖ సిద్దంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ఆనంద్, డిడబ్లుఓ లక్ష్మి కాంత్ రెడ్డి, రంగనాథ్‌స్వామి, చందర్, శేబా, రమాదేవి, శ్రావణి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. జిల్లా విద్యాధికారి, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా వైద్యాధికారి, ఇంటర్మీడియట్ అధికారి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు.

**ప్రజావాణికి 290 ధరఖాస్తులు**

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణికి 290 ధరఖాస్తులు వచ్చాయి. అర్జీదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వాటి పరిష్కారం కోసం జిల్లా అధికారులకు బదిలీ చేశారు. వివిధ విభాగాల వారీగా పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులపై సమీక్షించారు. పెండింగ్ ధరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

**విద్యార్థుల ఆర్ట్ క్రాఫ్ట్ మేళా సందర్శన**

జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లోని విధ్యార్థులు తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళాను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తయారుచేసిన క్రాఫ్ట్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు,ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకుడు డా.రవీందర్ నాయక్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలో రూపొందించిన వివిధ ఆరోగ్య కార్యక్రమాలు వాటి అమలు తీరుతెన్నులు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ధ్యేయంగా జిల్లాల పర్యటన చేపట్టినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్ నాయక్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని సందర్శించిన వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ వీరారెడ్డిలు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ప్రధాన ఆసుపత్రిలో వసతులు, మందుల లభ్యత రోగులు పొందుతున్న సేవలను పరిశీలిస్తూ అవుట్ పేషెంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల సంసిద్ధత , ఆసుపత్రిలో అందుతున్న ల్యాబ్ సేవలు పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రిల్లో సిజేరియన్ ప్రసవాలు తగ్గించి సాధారణ ప్రసవాలు పెంచాలన్నారు. అందుకు గర్భవతులకు వారి కుటుంబ సభ్యులకు సాధారణ ప్రసవాల వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా అవసరాలకు తగిన విధంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌వో డా.వెంకటరమణ, జిజిహెచ మెడికల్ సూపరిండెంట్ వీరారెడ్డి, ఆర్‌ఎంఓ డా.నవీన, జిల్లా మలేరియా అధికారి డా.రాజగోపాల్‌రావు, పిఓ ఎంసిహెచ్ డా. సనజవేరియా, డిపివోఎన్‌ఎహెచ్‌ఎం స్వామ,ఇ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

**మానకొండూర్ పిహెచ్‌సి సందర్శన**

మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డా.రవీందర్‌నాయక్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటరమణతో కలిసి తనిఖీ చేశారు. హాజరు పట్టికను, అవుట్ పేషెంట్ రిజిస్టర్లను, ఇతర రికార్డులను వెరిఫై చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిశుభ్రతను పరిశీలించి అన్ని వేళలా క్లీన్‌గా ఉంచుకోవాలన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అ ధికారి డాక్టర్ సుధ, డిటిసిఓ డా.రవీందర్‌రెడ్డి, డిఐవో డా.సాజిద తదితరులున్నారు.

## యువత స్వయం ఉపాధి వైపు ప్రయాణించడం అభినందనీయం

ఎఎస్‌పి శేషాద్రిని రెడ్డి



**ప్రజాపక్షం / వేములవాడ టౌన్:** ఒకటవ తరగతి నుండి బీటెక్ వరకు కలిసి చదువుకున్న నలుగురు యువకులు స్వయం ఉపాధి వెతుక్కుంటూ తమ భవిష్యత్తు కోసం సోమవారం అడుగులు వేశారు. బీటెక్ పూర్తి చేసుకొని ఉద్యోగ అవకాశాల కోసం కొంతకాలం ఎదురు చూశారు. ఉద్యోగాలు అందక పోవదంతో స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్ లో మ్యాడ్ ఫోటోగ్రఫీ ''ఇట్స్ ఎ న్యూ బిగినింగ్ స్టూడియో'' ను ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి శేషాద్రిని రెడ్డి స్టూడియోను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపడం అభినందనీయం అన్నారు. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో ఉండే అడ్వాన్స్ ఫోటోగ్రఫీ పరికరాలతో వేములవాడలో ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. అలాగే ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉన్న పాడ్కాస్ట్, ఇంటర్వ్యూస్, కూడా ఈ స్టూడియో లో నిర్వహించేందుకు వీలు కల్పించడం వల్ల సృజనాత్మకత ఉన్న యువతకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, క్లాస్ మేట్స్ అయిన ఇఖ్బార్ పాషా, అరవింద్, నితిన్, సునీల్ తోపాటు తాహెర్ పాషా, నగుబోతు రవి, కుమ్మరి శంకర్, నారాయణ రెడ్డి, ఆనంద రెడ్డి, జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఒపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం ఎంఈవోపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి అంగిడి కుమార్ ఫిర్యాదు చేశారు. శంకరపట్నం మండలంలో ఇష్టారీతిలో వ్యవహరిస్తున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై ఎంఈవో చర్యలు తీసుకోకుండా వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సదరు ప్రైవేట్ పాఠశాలపై ఎన్నో మార్లు ఎంఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఎంఈవో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రజావాణిలో 111 దరఖాస్తుల స్వీకరణ



ప్రజాపక్షం/మెదక్ :ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమ స్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెంది న 111 మంది తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. భూ సమస్యలు 32, పింఛన్లు 10, ఇందిరమ్మ ఇండ్లు 12, ఇత ర సమస్యలు 57గా ఉన్నాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధి కా రులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజా వాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సిఇఒఎల్లయ్య, డిఆర్‌డిఒ ,సంబ ంధితఇతరశాఖలజిల్లాఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 143 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నిజామాబాద్:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 143 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రేనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డిఆర్‌డిఒ సాయగౌడ్,డిపిఒ శ్రీనివాస్‌రావు, నిజామాబాద్ ఎసిపి రాజా వెంకట్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాసాయిపేట మండలంలో కలెక్టర్ పర్యటన



ప్రజాపక్షం/వెల్దుర్తి:పరిసరాల పరిశుభ్రతనే వ్యాధులు సమూలంగా నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం మాసాయిపేట మండలంలో పర్యటించిన కలెక్టర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సంబంధిత ఆశ, పంచాయతి సెక్రటరీ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి ప్రజారోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచన చేశారు. ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. నీటిని నిలువ ఉండ కుండా చూడాలని డ్రైనేజీ క్లీనింగ్, దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ తడి చెత్త పొడి చెత్త సేకరణ ఈ కార్యక్రమాలన్నిటిని సమర్థవంతంగా నిర్వహించడం తో పాటు ప్రజలు రోగాల బారిన పడకుండా. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవడంతో పాటు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని, ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచన చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్మాయిల్ బీడీ కంపెనీపై ఎఐటియుసి ఆధ్వర్యంలోఎసిఎల్‌కు ఫిర్యాదు




ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :ఇస్మాయిల్ బీడీ కంపనీ యాజమాన్యం ఎడపల్లి బ్రాంచ్‌లో కార్మికుల పట్ల ఉదాసీనత ప్రవర్తిస్తున్నారని, కార్మికులకు సరైన ఆకు తంబాకు వేయకపోవడంతో పాటు కార్మికులు చేసిన బీడీలు సరిగ్గా లేవని వాటిని పక్కన పెడుతు కార్మికుల శ్రమదోపిడికి గురిచేస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోనిపూలాంగ్‌లో గల ఇస్మాయిల్ బీడీ కంపెనీ యాజమాన్యంపై అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రావణి కుమారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు యాజమాన్యపు తప్పుడు విధానాలను ప్రశ్నించగా బీడీ కంపెనీ నాయకుల పిఎఫ్ కార్డులను లాక్కొని వారికి కంపెనీలోకి రానీయకుండా పని ఇవ్వకుండా చేయడంతోపాటు వారిని తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడడం అనేది కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడమే అన్నారు. ఇస్మాయిల్ బీడీ యాజమాన్యం చర్యలను నిరసిస్తు లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎసియల్‌కి వినతి సమర్పించారు. ప్రభుత్వం యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొని కార్మికులకు రక్షణ కల్పించాలని ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, బీడీ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి భానుచందర్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వైద్య సిబ్బంది సందర్శనలు:కలెక్టర్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆశ్రమ పాఠశాలలు, గ్రామాల్లో వైద్య సిబ్బంది సందర్శనలు నిర్వహించి ప్రజలు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పేర్కొన్నారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, అక్కడి వార్డులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య ఉప కేంద్ర పరిధిలోని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలలు, గ్రామాల్లో జ్వర లక్షణాలు ఉన్నవారిని గుర్తించి తగిన వైద్యసేవలు అందించాలి అని తెలిపారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని, రహదారులు, మురుగు కాలువలను శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మండలంలోని బూర్గుడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ, తరగతి గదులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బతికి ఉన్న వృద్ధురాలిని మృతురాలిగా చూపి భూమి కబ్జా



ప్రజాపక్షం/కాగజ్ నగర్:బతికి ఉన్న వృద్ధురాలిని మృతురాలిగా చూపించి ఆమె భూమిని అక్రమంగా కబ్జా చేసిన ఘటన చింతల మానపల్లి మండలం లోని డబ్బా గ్రామంలో చోటు చేసుకుంది. ఈ క్రమంలో బాధిత వృద్ధురాలు తనకు న్యాయం కల్పించాలని కోరుతూ సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగింది. డబ్బా గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలి పేరు మీద ఉన్న భూమిని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ఆమె మరణించినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. దానిపై ఆధారపడి మృతురాలిగా చూపిస్తూ ఇతరుల పేర్లపై భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో బాధితురాలు తన కుటుంబ సభ్యులతో కలిసి న్యాయ కోసం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు ఆనంద్ కుమార్ బాధిత కుటుంబానికి మద్దతుగా వచ్చారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కార్యాలయం బయట ధర్నా చేస్తున్న వృద్ధురాలిని కలుసుకుని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హామీతో బాధితురాలు తన నిరసనను విరమించింది.

# ఐక్యతకు చిహ్నం 'భారత్'

### గీతం జాతీయ చర్చాగోష్టి ప్రారంభోత్సవం

### తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




ప్రజాపక్షం/సంగారెడ్డి : భిన్నత్వంలో ఏకత్వంతో పాటు ఐక్యతకు చిహ్నం భారత్ అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని రాజకీయ శాస్త్ర (పొలిటికల్ సైన్స్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజులు సర్దార్ వల్లభాయి పటేల్ రైతులు చంపారన్ నుంచి చిత్రకూట్ వరకు జాతీయ చర్చాగోష్టిని సోమవారం ఆయన జ్యోతి ప్రజ్వలనలతో లాంఛనంగా ప్రారంభించారు. భారతీయ సామాజిక శాస్త్ర పరిశోదనా మండలి ( ఐసిఎస్ఎస్ ఆర్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం తరువాత 567 సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయడంలో సర్దార్ పటేల్ అద్భుతమైన పాత్రను వివరించారు. రైతు ఉద్యమాలకు పటేల్ చేసిన సేవలు అంతగా వెలుగులోకి రాలేద న్నారు. చారిత్రాత్మకగా వార్‌్రొల్లి సత్యాగ్రహం (1928) లో పటేల్ నాయకత్వాన్ని రైతులు భూమిలేని కార్మికుల సాధికారత కోసం సర్దార్ పటేల్ చేసిన కృషిని గవర్నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గ్రామీణ భారత దేశం ఆత్మగా మిగిలిపోతుందని చెప్పారు. రైతులు ,జాతీయ ఐక్యత పట్ల పటేల్ దృక్పథంపై ఈ చర్చాగోష్టిలో విలువైన చర్చలకు దారితీస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. మన జీవితాలనుపేదలు ,అణగారిన వర్గాలతో పెంచుకోవడంలో ఆనందం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వాఖ్యానించారు. అంతకు ముందు జష్ణుదేవ్ వర్మ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలు చల్లి నివాళులు అర్పించి ఆ తరువాత పోలీసుల నుంచి గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ హానర్) స్వీకరించారు. స్టాట్యూ ఆఫ్‌యూనిటీ యూనిటీ యొక్క విశిష్టతను గౌరవ అతిథి గుజరాత్ ప్రభుత్వఐఎన్‌సిఇఎక్స్‌టిసిఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అధికారి సంజయ్ జోషి వివరించారు. ఐక్యత స్ఫూర్తిని పొందడం కోసం గుజరాత్‌లో నెలకొల్పిన సర్దార్ పటేల్ స్మారక నివాళిని సందర్శించామని విద్యార్థులను జోషి ప్రోత్సహించారు . సామాజిక సమరస్థ మంచ్ జాతీయ కన్వీనర్ కె. శ్యామ్‌ప్రసాద్ పటేల్ నాయకత్వం గురించి ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు ఆయనపై రాజ్ మోహన్ గాంధీ రచించిన పుస్తక ప్రతులను వేదికపై నున్న ప్రముఖులకు బహూకరించారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్‌రావు స్వాగతోపన్యాసంలో అతిథులను సభకు పరిచయం చేయడంతో గీతం పురోగతిని సోదాహరణంగా వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అనేక మంది ప్రముఖ పండితులు ,ఆలోచనాపరులు ఈ రెండు రోజుల జాతీయ చర్చాగోష్టిలో పాల్గొంటున్నారు. వీరిలో గుజరాత్ లోని సర్దార్ పటేల్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వసంత్ కుమార్, ఆర్ పటేల్ తెలంగాణలోని ములుగులోని సమ్మక్క,సారక్క గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ,ప్రొఫెసర్ వై.ఎల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం ఇన్ గ్రార్డ్ రిజిస్ట్రార్ అండ్ డీన్ ప్రొఫెసర్ పీలారెడ్డి హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, ఐసిఎస్ఎస్ ఆర్ దక్షిణ ప్రాంత డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి, యూజిసి మాజీ సభ్యుడు ప్రొఫెసర్, జి.గోపాల్ రెడ్డి, తదితరులున్నారు. సర్దార్ పటేల్‌రైతుల పట్ల చూపిన దార్శనికత భారత దేశ గ్రామీణ వ్యవసాయ పరివర్తనకు దాని భవితవ్యంతో పాటు జాతీయ ఐక్యతను పెంపొందించడంలో దాని సహకారంపై చర్చించడానికి విద్యావేత్తలు సామాజికవేత్తలు పరిశోధకులకు ఈ సెమినార్ ఒక వేదికను అందిస్తోంది.

## వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో మహిళ మృతి?

### బెల్లంపల్లి ఆసుపత్రిలో ఘటన, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



ప్రజాపక్షం /బెల్లంపల్లి:బెల్లంపల్లి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తన తల్లి మృతి చెందినట్లు గోల్బంగ్ల బస్తీకి చెందిన షేక్ ముక్తార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 28న రాత్రి తన తల్లి అలిమ్ బేగమ్ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినట్టు చెప్పారు. అక్కడ మానిటర్‌తో బిపి పరీక్షించగా 90/60గా తక్కువగా వచ్చిందని, దీనిపై నర్సు ద్వారా సమాచారాన్ని డ్యూటీ వైద్యుడికి చేరవేశారన్నారు. వెంటనే రెండు ఇంజెక్షన్లు వేయించగా, వాటిలో ఒకదాన్ని సెక్యూరిటీ గార్డ్, మరొకదాన్ని నర్సు వేసినట్టు తెలిపారు. అయితే కొద్ది సేపటికి మానిటర్ పాడైపోయిందన్న అనుమానంతో డాక్టర్ మాన్యువల్‌గా బిపి చెక్ చేయగా, అది 2 20/160గా నమోదై తల్లి కోమాలోకి వెళ్లిందని వివరించా రు. వెంటనే నాలుగు ఇంజెక్షన్లు ఇచ్చినప్పటికీ ఇసిజి కూడా తీయకుండా మంచిర్యాలకి రిఫర్ చేశారన్నారు. ఆ సమయంలో అంబులెన్స్ డ్రైవర్ డీజిల్ కోసం బయటకు వెళ్లినట్టు పేర్కొన్నా రు. దీంతో తామే స్వయంగా తల్లిని మంచిర్యాల ఆసుపత్రికి త రలించాల్సి వచ్చిందని, అక్కడి సిబ్బంది ఇసిజి చేసి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యు డు, సెక్యూరిటీ గార్డు, డ్రైవర్, అలాగే చెడిపోయిన పరికరాల ను పట్టించుకోని ఆసుపత్రి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముక్తార్ కలెక్టర్‌ను కోరారు.

## యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది మోదీయే

### బైంసా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్




ప్రజాపక్షం/బైంసా:యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది ప్రధాని నరేంద్ర మోదీ అని ఎమ్మె ల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు సోమవారం పట్టణంలోని గౌతమి హైస్కూల్‌లో నిర్మల్ జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగ పోటీలను ప్రారంభించిన సం దర్భంగా ఆయన మాట్లాడారు.యోగా డే రోజున విశాఖపట్నంలో ఒకేచోట 6 లక్షల మంది యోగా చేయడం,అందులో ప్రధాని పాల్గొనడం గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విసయం గుర్తు చేశారు. యోగాను స్పోర్ట్స్‌గా గుర్తించి,ఒలంపిక్‌లో పాల్గొనేలా చేయడం జరిగిందన్నారు.ప్రతి ఒక్కరు యో గా చేసి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.పాఠశాలలో చిన్నారులకు యోగ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు.బైంసాలో జిల్లా స్థా యి పోటీ నిర్వహించడం శుభ పరిణామం అ ని,యోగ పోటీల నిర్వహణకు ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అన్నపూర్ణ,ప్రధాన కార్యదర్శి మల్లేష్ లను సన్మానించిన అభినందించారు.కార్యక్రమంలో నిజామాబాదు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్,జాయింట్ సెక్రటరీ ప్రదీప్,డాక్టర్ రామకృష్ణ గౌడ్,నాయకులు తుమొల్ల దత్తాత్రి,వెంగల్ రావ్, సిరం సుష్మ రెడ్డి,దత్తురామ్ పటేల్, యోగే ష్,పాఠశాల కరస్పాండెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టడమే లక్ష్యం



### గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి

ప్రజాపక్షం/గజ్వేల్: సిఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను రచ్చ చేసేందుకు బిఆర్‌ఎస్ నేత ప్రతాప్ రెడ్డి కుట్ర పన్నగా, అందులో నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి పావులుగా మారినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ నేత సమీర్, మాజీ కౌన్సిలర్ నక్క రేగొండ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్ మాజీ ఎంపీటీసీ అంజి యాదవ్ విమర్శించారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో తమకు ఎలాగూ స్థానం లేదని గ్రహించిన వారు ప్రభుత్వానికి మంచి పేరు రాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి సభను రచ్చ చేసేందుకు కుట్ర చేసినట్లు చెప్పారు. డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో రేషన్ కార్డుల పంపిణీ పండగ వాతావరణంలో జరపాలని భావించి ఆయన నేతృత్వంలో మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చినట్లు స్పష్టం చేశారు. మొదటి నుండి అన్నం పెట్టిన వారికి సున్నం పెట్టడం నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి నైజం కాగా, పిల్లికి బిచ్చం పెట్టని వారు పార్టీ కోసం లక్షలు ఖర్చు చేశాననడం సిగ్గుచేటని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యం కాగా, గతంలో పదవులు కట్టబెట్టిన ప్రతాప్ రెడ్డి రుణాన్ని ఈ విధంగా నాయిని యాదగిరి తీర్చుకుంటున్నట్లు తెలిపారు. తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం వారికి వెన్నతో పెట్టిన విద్య కాగా, రాజకీయాల్లో ఆర్థికంగా నష్టపోయిన నర్సారెడ్డిని విమర్శిస్తే సహించమని హెచ్చరిస్తూ వారిపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు , తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం: కలెక్టర్



ప్రజాపక్షం/నిర్మల్:ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నా రు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పని చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ,వనమహోత్సవంలో భాగంగా మొక్క లు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.కాలానుగుణ వ్యాధులు ని యంత్రించేందుకు పకడ్బందీ ప్రణాళికలను అమలు చేయాలని అన్నారు.జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు జ్వ ర సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు.పెంబి మండలానికి జాతీయ స్థాయిలో కాంస్య పతకం రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు.అధికారుల సమి ష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందని అన్నారు.పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ జాతీయస్థాయిలో మంచి స్థానంలో నిలవడంలో ఫ్రంట్ లైన్ వర్కర్స్ కృషి గర్వించదగ్గదని అన్నారు.గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని స్వీకరించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ లను జి ల్లా అధికారుల సంఘం తరుపున సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలు పెద్ద ఎత్తున అవయవదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వైద్య,ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు మరణానంతరం వారి దేహాలను నిర్మల్ వైద్య కళాశాలకు విద్యార్థుల శిక్షణ కొరకు దానం చేయనున్నట్లు తెలిపారు.తన దేహాన్ని మరణానంతరం దానం చేయడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు.దీని ద్వారా వైద్య కళాశాల విద్యార్థులకు శిక్షణ, శాస్త్రీయ పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆయనను అదనపు కలెక్టర్ల తో కలిసి పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ సన్మానించారు.ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్,ఆర్‌డిఒ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నా రు.

## ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిశోధించి చర్యలు తీసుకోవాలి: కలెక్టర్



ప్రజాపక్షం / ఆసిఫాబాద్:ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు.సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా బడికే సదాశివ్ (గుడ్ల బోరి గ్రామం, కౌటాల మండలం) వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, నంది రజిత (తక్కల్లపల్లి గ్రామం, రెబ్బెన మండలం) తమ భూమిలో పత్తి పంటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, పోరండ్ల రాజేశ్వర్ (జనకాపూర్, ఆసిఫాబాద్ మండలం) తన భూమి అడ ప్రాజెక్టులో కలిసిపోయిందని నష్టపరిహారం ఇవ్వాలని, తిందాం భాగ్యలక్ష్మి (బజార్ వాడ, ఆసిఫాబాద్ పట్టణం) ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, వసాకే రాధాబాయి (కమాన గ్రామం, వాంకిడి మండలం) తమ గ్రామానికి వెళ్లే దారి ఆక్రమణకు గురైందని చెబుతూ పలువురు వినతులు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పరిశోధించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి అని అధికారులకు సూచించారు. అలాగే వనమహోత్సవం సందర్భంగా శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిచేయాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల అదనపు గదులు, అంగన్వాడి కేంద్రాలకు మౌలిక వసతుల కల్పనకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి టైగర్ జోన్ అడ్డుకట్ట కావొద్దు: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ జన్నారం:కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ ఏర్పాటు పేరుతో నియోజకవర్గ అభివృద్ధికి ఆటంకం కలిగించకూడదని ఖానాపూర్ ఎమ్మెల్యేవెడ్మ బొజ్జు పటేల్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్ లైఫ్ బోర్డ్ సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వంపై పలు అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. జిఒ 49ని నిలిపివేయడాన్ని స్వాగతించిన ఎమ్మెల్యే, ఆదివాసుల పక్షాన ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం మంచిదన్నారు. అడవిలో నివసించే ఆదివాసులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అటవీ హక్కు చట్టం అందించేదే అని గుర్తు చేశారు. తనకు తెలియకుండానే అలీనగర్ ఆదివాసులను పునరావాసానికి తరలించడాన్ని తప్పుపట్టారు. మైసంపేట వాసులను తరలించినా భూసమస్యలు పరిష్కరించలేదని, పేతర్పు గ్రామస్తులతో గొడవలు జరిగాయని తెలిపారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న ఆదివాసులను అసౌకర్యానికి గురిచేయొద్దని, సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలో పాఠశాలలు, ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, త్రాగు నీటి పథకాల వంటి అభివృద్ధి పనులకు అడ్డు చెప్పకూడదని హెచ్చరించారు. అల్లంపల్లి, వైపేట్, అంకెన రోడ్లకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. అటవీ శాఖ, రెవిన్యూ శాఖలు ఉమ్మడిగా భూ సర్వే చేసి సమస్యలు పరిష్కరించాలని, ఆదివాసులు, యాదవులు, మేదరులకు సామూహిక హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. తన నియోజకవర్గంలో ఎకో టూరిజం అభివృద్ధికి సహకరించాలని, తాత్కాలిక రహదారులు, వంతెనల పనులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తే, ఒంటెత్తు పోకడలకు ప్రజల ఓపిక చచ్చిపోతుందని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హెచ్చరించారు.

## నిబంధనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి: ఎస్ఐ



ప్రజాపక్షం/మాక్లూర్ :మండలంలో గణేష్ నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ వినాయక మండప నిర్వాహకులకు సూచించారు. ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా డిజె సౌండ్ సిస్టం ఉపయోగించినా చట్టప్రకారం చర్యలు తీసుకోబడుతాయని హెచ్చరించారు.

# క్రీడ



ఇంగ్లాండ్‌తో ఐదో టెస్టు..

## ఉత్కంఠ పోరులో భారత్ విజయం



**స్కోరు బోర్డు**
ఇండియా 224 & 396
ఇంగ్లాండ్ 247 & 367

ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా సంచలన విజయం సాధించింది. 374 పరుగుల లక్ష్యఛేదనలో హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) శతకాలు బాదడంతో ఇంగ్లాండ్ ఒకదశలో 301/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. అయినా, భారత బౌలర్లు వెరవలేదు. ఏ మాత్రం అధైర్యపడకుండా అద్భుతంగా పోరాడారు. ఒక్కో వికెట్టూ పడగొడుతూ ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టారు. ఆఖరి రోజూ మరింత విజృంభించి ఇంగ్లాండ్ చేతిలోంచి మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఫలితంగా ఇంగ్లాండ్ గడ్డపై భారత జట్టు మరుపురాని విజయం అందుకుని అండర్సన్‌తెందూల్కర్ ట్రోఫీని 22తో ముగించింది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్ల పోరాటం టెస్టు క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

ఓవర్‌నైట్ స్కోరు 339/6తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ 367 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా.. ఆట ప్రారంభమయ్యాక తొలి ఓవర్‌లోనే జేమీ ఒవర్టన్ (9) రెండు ఫోర్లు బాదాడు. అయితే, సిరాజ్ వరుస ఓవర్లలో జేమీ స్మిత్ (2), ఒవర్టన్‌ను పెవిలియన్‌కు పంపి ఇంగ్లాండ్‌ను దెబ్బతీశాడు. కాసేపటికే జోష్ టంగ్ (0)ని ప్రసిద్ధ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. అప్పటికి ఇంగ్లాండ స్కోరు 357/9. ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన క్రిస్ వోక్స్ భుజానికి పట్టీతోనే బ్యాటింగ్ చేయడానికి మైదానంలోకి వచ్చాడు. అయితే, వోక్స్ ఒక్క బంతిని కూడా ఎదుర్కొలేదు. సిరాజ్ బౌలింగ్‌లో అట్కిన్సన్ సిక్స్ కొట్టడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. మళ్లీ బంతి అందుకున్న సిరాజ్.. అట్కిన్సన్ క్లీన్‌బౌల్డ్ చేసి ఐదు వికెట్లు పూర్తి చేసుకోవడంతోపాటు ఇంగ్లాండ ఇన్నింగ్స్‌ను ముగించాడు. ప్రసిద్ధ్ కృష్ణ 4, ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 224, ఇంగ్లాండ 247 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 396 పరుగులు చేసింది.

**మళ్లీ హీరో అయ్యాడు...**

నాలుగో రోజు ఆట సందర్భంగా సిరాజ్ ఓ పొరపాటు చేశాడు. 19 పరుగుల వద్ద బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ చేజార్చాడు. మ్యాచ్‌లో ఇదే కీలక మలుపు. తర్వాత బ్రూక్ చెలరేగి పోయి శతకం చేశాడు. అయితే, చివరి రోజు సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మళ్లీ భారత జట్టు విజయానికి బాటలుపరిచి హీరో అయ్యాడు. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఆఖరి రోజు 4.1 ఓవర్లు బౌలింగ్ చేసిన సిరాజ్ తొమ్మిదే పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు పడగొట్టిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. శుభ్‌మన్ గిల్, హ్యారీ బ్రూక్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో భారత్ 6 పరుగుల తేడాతో గెలిచింది. 2004లో ఆస్ట్రేలియాపై 13 రన్స్ తేడాతో విజయం సాధించింది.

**ఇంత మజా ఏదీ ఇవ్వలేదు: రాహుల్**

'నేను చాలా ఏళ్లుగా క్రికెట్ ఆడుతున్నా. ఛాంపియన్స్ ట్రోఫీ సొంతం చేసుకున్నాం. ప్రపంచకప్‌ను కూడా గెలిచాం. కానీ, ఈ మ్యాచ్ అంత మజా ఏదీ ఇవ్వలేదు. టెస్టు క్రికెట్ మనుగడ సాగిస్తుందా? లేదా? అని చాలా మంది సందేహపడుతుంటారు. టీమ్ ఇండియా ఆట తీరుతో అది పటాపంచలైంది. ప్రతి మ్యాచ్‌లోనూ పోరాడాం. సిరీస్‌ను 2 2తో సమం చేశాం. సిరీస్ డ్రా అవ్వొచ్చు గానీ.. భారత టెస్టుకు క్రికెట్‌ను అగ్రస్థానంలో నిలిపింది. మార్పు ఇక్కడి నుంచే మొదలవుతుంది. భారత టెస్టు జట్టు ఎన్నో విజయాలు సాధిస్తుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, అశ్విన్ లాంటి ఆటగాళ్లు లేకుండా సిరీస్‌లో అడుగుపెట్టాం. చాలా మంది వచ్చి ఇంగ్లీష్ జట్టు పరిస్థితులను గురించి అడిగేవాళ్లు. దీంతో నా అనుభవాలను పంచుకుంటూ వైవిధ్యమైన పాత్ర పోషించాల్సి వచ్చింది. జట్టును శుభ్‌మన్ గిల్ ముందుండి అద్భుతంగా నడిపించాడు. భవిష్యత్‌లో మంచి టెస్టు కెప్టెన్ అవుతాడన్న నమ్మకం ఉంది' అని కేఎల్ రాహుల్ అన్నాడు.

**అదే వ్యూహంతో ముందుకెళ్లాం.. సిరీస్ సమం చేశాం : శుభ్‌మన్ గిల్**

సిరీస్ చివరి టెస్టులో రెండు జట్లూ అద్భుతంగా ఆడాయని టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. చివరి రోజుకు వచ్చినంత వరకు ఫలితం తేలకపోవడమే ఇందుకు నిదర్శనమన్నాడు. రెండు జట్లూ 'ఏ' గ్రేడ్ ఆట ఆడాయన్నాడు. 'మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ లాంటి బౌలర్లుంటే కెప్టెన్ పని సులభమవుతుంది. ఇవాళ మా ప్రదర్శన అత్యద్భుతం. కచ్చితంగా గెలుస్తామన్న నమ్మకం నిన్న కూడా ఉండేది. ఆ జట్టుపై తీవ్ర ఒత్తిడి ఉందన్న సంగతి మాకు తెలుసు. అది చివరి వరకు కొనసాగేలా చూసుకోవాలనుకున్నాం. అదే వ్యూహంతో ముందుకెళ్లాం. సిరాజ్ అద్భుత ప్రదర్శన చేశాడు. 22తో సిరీస్ సమమైందంటేనే ఇరు జట్లూ ఎంతలా ఆడాయో అర్థం చేసుకోవచ్చు. ఈ సిరీస్‌లో అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా నిలవాలన్న లక్ష్యంతోనే సిరీస్ ఆడా.. ఆ స్థితికి చేరుకోవడం చాలా సంతృప్తిగా ఉంది. మానసికంగా కొన్ని విషయాలను సమతుల్యం చేసుకోవడం అవసరం. గత ఆరు వారాల్లో నేర్చుకున్నది ఎప్పటికీ గుర్తుంచుకుంటాం' అని గిల్ అన్నాడు.

**అదే లక్ష్యంతో బౌలింగ్ చేశా: సిరాజ్**

మ్యాచ్ అనంతరం మహ్మద్ సిరాజ్ మాట్లాడుతూ.. కీలక ప్రదేశాల్లో బంతులు వేసి బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా చేసుకున్నట్లు చెప్పాడు. వికెట్లు పడతాయా? లేదా? పరుగులు కొడతారా? కొట్టరా? లాంటి విషయాలు అస్సలు పట్టించుకోలేదన్నాడు. బౌండరీ వద్ద హ్యారీ బ్రూక్ క్యాచ్‌ను అందుకున్న తర్వాత లైన్‌ను తాకుతాననుకోలేదన్నాడు. ''మ్యాచ్ పరిస్థితులను మార్చేసిన క్షణమది. ఆ తర్వాత బ్రూక్ అమాంతం జోరు పెంచేశాడు. టీ20లు ఆడినట్లు ఆడేశాడు. దీంతో మేం కాస్తా వెనకబడ్డాం. కానీ, ఏ దశలోనైనా గెలుస్తామన్న నమ్మకం నాకుండేది. అదే జరిగింది. ఆ భగవంతుడికి కృతజ్ఞతలు' అని సిరాజ్ తెలిపాడు.

# షోకేస్ యువతరంగం


## ఎఐని నిర్లక్ష్యం చేస్తే ఉద్యోగాలకు ఎసరు!



వ్యవసాయం నుంచి అంతరిక్షం వరకు... వ్యాపారం నుంచి వైద్యం వరకు... దాదాపుగా అన్ని రంగాల్లోనూ దూసుకెళుతున్న కృత్రిమ మేధస్సు (ఎఐ)ను నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని తాజా పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. భారతదేశంలోని అతి పెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) తీసుకున్న నిర్ణయమే ఇందుకు ఒక ఉదాహరణ. ఆ సంస్థ తన ఉద్యోగుల సంఖ్యలో సుమారు 2 శాతం తగ్గింపు చేయబోతుంది. అంటే, వచ్చే ఆర్థిక సంవత్సరం 2026 (ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026) మధ్యలో ప్రపంచవ్యాప్తంగా సుమారు 12,000 మంది ఉద్యోగులపై వేటు పడుతుంది. టిసిఎస్ సిఇఒ కె. కృథివాసన్‌ను అనుసరించి, ఈ నిర్ణయం అత్యవసరమైనదేగాక, సంస్థను భవిష్యత్తుకు మరింత సన్నద్ధం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతుంది. 'టెక్నాలజీ రంగం చాలా వేగంగా మారుతోంది. ముఖ్యంగాకృత్రిమ మేధస్సు (ఎఐ)తో పని విధానాలు మారిపోతున్నాయి. అందువల్ల సంస్థను సహజంగానే భవిష్యత్తుకి అనుగుణంగా తయారు చేసుకోవాలి. అందుకే మేము ఉద్యోగుల మెరుగైన నైపుణ్యాలను చూసి, మళ్లీ అవకాశం ఇచ్చాం. కానీ కొంతమందికి మాత్రం తిరిగి ఉద్యోగంలో కొనసాగడం సాధ్యపడలేదు. అందువలన కోత విధించక తప్పడంలేదు. ప్రధానంగా మధ్యస్థాయి, సీనియర్ ఉద్యోగులు ఈ చర్య వల్ల ప్రభావితమవుతారు' అన్నది ఒక సోషల్ మీడియా మాధ్యమానికి ఆయన ఇచ్చిన సందేశ సారాంశం. టెక్నాలజీ మార్పులు, ముఖ్యంగా ఎఐ వృద్ధితో, పాత నైపుణ్యాలకు ప్రాధాన్యం తగ్గింది. ఉద్యోగులను కొత్త నైపుణ్యాలకు తట్టుకొనేలా తయారుచేయడం సంస్థకి కష్టంగా మారింది. కంపెనీ లక్ష్యం మాత్రం సిబ్బందిని సమర్థంగా ఉపయోగించి, వారి పనితీరును మెరుగుపరచడం. కానీ, కృత్రిమ మేధస్సే నేరుగా ఉద్యోగాల కోతకు ప్రత్యక్షంగా కారణం కాకపోయినా, ఈ నిర్ణయం భవిష్యత్తు నైపుణ్యాల అవసరాన్ని స్పష్టం చేస్తున్నది. టిసిఎస్‌లో బెంచ్ పాలసీ మార్పులు ఈ ఏడాది జూన్ 12 నుంచి ప్రారంభమయ్యాయి. కొత్త నియమాల ప్రకారం ఉద్యోగులు సంవత్సరానికి కనీసం 225 రోజులు ఏదో ఒక ప్రాజెక్టుల్లో ఉండాలి. ఉద్యోగి ఏడాదిలో బెంచ్ (ప్రాజెక్టు లేకుండానే ఉండే కాలం) 35 రోజులు మించి ఉండకూడదు. ఈ నియమాలు పాటించని ఉద్యోగులకు తొలగింపులు జరుగుతాయి. లేదా ఉద్యోగి తక్షణ రాజీనామా చేసి సీవరెన్స్ ప్యాకేజ్‌లు పొందుతారు. ఉద్యోగుల పరిస్థితి ఒకరు 4 సంవత్సరాల అనుభవం ఉన్న ఉద్యోగి, '35 రోజులు మించి బెంచ్‌లో ఉంటే హెచ్‌ఆర్‌తో సమావేశం ఏర్పాటు చేసి, తక్షణమే రాజీనామాను కోరుతారు. ఒప్పుకోకపోతే కంపెనీ నేరుగా తొలగిస్తుంది. అదే జరిగితే, సదరు ఉద్యోగికి సీవరెన్స్ ప్యాకేజీలు అందవు. టిసిఎస్ నిర్ణయం ప్రారంభం మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా వేలాది కంపెనీలు, సమీప భవిష్యత్తులో చేయబోయే పని ఇదే. టిసిఎస్ ముందుగానే స్పందించింది. తొలి అడుగు వేసింది. టిసిఎస్ చర్య ప్రస్తుత, భవిష్యత్ దృశ్యాన్ని కళ్ల ముందు ఉంచుతున్నది. క్రమంగా, ఎఐ ప్రభావంతో టెస్టింగ్ వంటి పాత నైపుణ్యాలతో పని చేసే ఉద్యోగాల అవసరం తగ్గుతోంది. క్లయింట్లు చిన్న ప్రాజెక్టులు, తక్కువ సిబ్బందితో పనులను పూర్తి చేయాలని చూస్తున్నాయి. ఇది సంస్థల సామర్థ్యాన్ని పెంచడానికి దారితీస్తోంది. కాబట్టి, మార్పులకు తగినట్టు నైపుణ్యాలను మెరుచుపరచుకోవడం అత్యవసరం.

## జాగ్రత్తలు తీసుకుంటే స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు

స్టాక్ మార్కెట్‌పై అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకుంటే, ఈక్విటీ మ్యూచుల్ ఫండ్స్‌లో పెట్టుబడి లాభదాయకం. వివిధ రకాల పెట్టుబడి నిధుల్లో ఇది ఒకటి. స్టాక్ పోర్టుఫోలియో వ్యాపార లావాదేవీలను నిర్వహించడానికి, వ్యాపారం చేయడానికి పెట్టుబడిదారుల నుంచి డబ్బును ఈక్విటీల రూపంలో సేకరిస్తుంది. అందుకే దీనిని 'ఈక్విటీ సెక్యూరిటీలు', గ్రోడ్ ఫండ్స్'గా కూడా పిలుస్తారు. ఈక్విటీ ఫండ్లు వివిధ అంశాలపై ఆధారడి, ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. వీటిని యాక్టివ్, పాసివ్ ఈక్విటీలుగా పేర్కోవచ్చు. యాక్టివ్ ఫండ్‌లో ఫండ్ మేనేజర్ ఎప్పటికప్పుడు మార్కెట్‌ను సునిశితంగా పరిశీలిస్తూ ఉంటాడు. కంపెనీలపై పరిశోధనలు చేస్తాడు. పనితీరును గమనిస్తుంటాడు. పెట్టుబడి పెట్టడానికి ఉత్తమమైన స్టాక్‌ల కోసం అన్వేషిస్తాడు. అలాంటి స్టాక్స్ అందుబాటులోకి వచ్చిన వెంటనే వాటిపై పెట్టుబడి పెడతాడు. ఇక పాసివ్ లేదా నిష్క్రియ ఫండ్‌లో ఫండ్ మేనేజర్ ప్రముఖ మార్కెట్ ఇంటెక్స్‌ను ప్రతిబింబించే పోర్టుఫోలియోను నిర్మిస్తాడు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీలకు సంబంధించిన పోర్టుఫోలియోల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాడు. అయితే, స్టాక్ ఎంపికలో ఫండ్ మేనేజర్‌కు ఎలాంటి పాత్ర ఉండదు. అందుకే, దీనిని నిష్క్రయ లేదా పాసివ్ ఈక్విటీలుగా పిలుస్తారు. సాధారణంగా మదుపరులు బెంచ్‌మార్క్ సూచీల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిణామాలను గమనిస్తూ, షేర్లను కొనుగోళ్లు లేదా అమ్మకాలను కొనసాగించాలి. ఈక్విటీ పండ్స్‌ను మార్కెట్ పెట్టుబడి తీరులను అనుసరించి కూడా విభజించవచ్చు. క్యాపిటల్ మార్కెట్‌లో కంపెనీ ఈక్విటీ వాటాలకు ఎంత విలువ ఉందనే అంశం ఆధారంగా ఈ విభజన ఉంటుంది. లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ లేదా మైక్రో క్యాప్ ఫండ్స్‌గా వర్గీకరించవచ్చు. మరింత లోతుగా విశ్లేషిస్తే, డైవర్సిఫైడ్ లేదా సెక్టోరల్, థీమాటిక్ ఈక్విటీలుగానూ చెప్పవచ్చు. గతంలో మొత్తం మార్కెట్ స్టాక్స్‌లో ఈ విధానం ద్వారా పెట్టుబడులు పెట్టేవారు. అయితే, ఇప్పుడు విధానాన్ని మార్చుకుంది. ఒక రంగం లేదా ఒక విభాగానికి పరిమితమై, పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. మొత్తం మీద ఈక్విటీ మ్యూచువల్స్ వల్ల మదుపరులకు గతంలో కంటే ఇప్పుడు లాభాల శాతం పెరిగింది.



## ప్రజా సమస్యల పరిష్కారంలో 'ప్రజాపక్షం' పాత్ర కీలకం

సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజా సమస్యలు పరిష్కారంలో ప్రజాపక్షం దినపత్రిక కీలకపాత్ర పోషిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో ప్రజాపక్షం దినపత్రిక నూతన కార్యాలయాన్ని సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు ప్రజలకు వారధిగా ఉండి ప్రజా సమస్యలు వెలికితీయడంలో పత్రికలది కీలకపాత్ర అని, ప్రజాపక్షం దినపత్రిక జిల్లా కార్యాలయం జిల్లా కేంద్రంలో ప్రారంభించడం సంతోషదాయకమని, జిల్లా కార్యాలయం ప్రారంభించిన స్టాఫ్ రిపోర్టర్ ఎండి గౌస్‌పాషాకు శుభాకాంక్షలు తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హై జావేద్ మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడమే కాకుండా వాటి సమస్యల పరిష్కారానికి ప్రజాపక్షం దినపత్రిక ముందు వరుసలో ఉంటుందని పత్రిక యాజమాన్యానికి, జిల్లా కార్యదర్శి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు బొంకురి శంకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చింతకింది చంద్రమౌళి, నారాయణదాసు అశోక్, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు ఆరేల్లి మల్లేష్, కోశాధికారి బెజ్జంకి నరేష్, చిరంజీవి, శ్రీనివాస్, వినోద్, మాజీద్, జంగ సంపత్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐని బలమైన శక్తిగా నిలబెడదాం

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జిల్లాలో సిపిఐని బలమైన శక్తిగా నిలబెట్టేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా అన్నారు. సోమవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురంలో సిపిఐ నేత చిదుముల బాబురెడ్డి నివాసంలో మండల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు..రాబోవు స్థానిక ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశ నిర్దేశం చేశారు. ప్రజా సమస్యలపై సంస్థాగత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారం అయ్యేలా బాధ్యత తీసుకొని ప్రజల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, సిద్ధినేని కర్ణకుమార్, ఎడ్లపల్లి శంకరయ్య, ఉన్నం రంగారావు, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సహాయకార్యదర్శులు కలింగి మోహన్ రావు, బానోత్ రామ్మూర్తి పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లకు బిజెపినే అడ్డంకి

బిజెపిని అడ్డుకునేందుకు వామపక్షాలను బలోపేతం చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసి రిజర్వేషన్లకు బిజెపినే ప్రధాన అడ్డంకి అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సిపిఐ హనుమకొండ జిల్లా సమితి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లపై బిజెపి ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదన్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బిసి రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిసిల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న బిజెపికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు గుణపాఠం చెప్పాలన్నారు. బిసి రిజర్వేషన్లకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపిని నిలువరించే వామపక్షాలను బలోపేతం చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఆదరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో బిసిల రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19 నుంచి నాలుగు రోజుల పాటు మేడ్చల్ జిల్లాలో జరుగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, అశోక్ స్టాలిన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, నకీర్త ఓదేలు, భాషబోయిన సంతోష్, ఏదునూరి వెంకట్రాజం, మంచాల రమాదేవి, కొట్టెపాక రవి, ఏశబోయిన శ్రీనివాస్, జక్కు రాజు గౌడ్, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం తదితరులు పాల్గొన్నారు

## పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలి

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్

**ప్రజాపక్షం/ వరంగల్ :** పేద ప్రజలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ మండలం గుండా మల్లేష్ నగర్‌లో వలబోజు వెంకన్న అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశానికి షేక్ బాష్ మియా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేద ప్రజలు వేసుకున్నా గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు కట్టించాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రజలకు మౌలిక సదుపాయం కల్పించాలని, లేని యెడల భవిష్యత్తులో ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బుస్స రవీందర్, వరంగల్ మండల కార్యదర్శి గుండె భద్రి, మండల సహాయ కార్యదర్శి జన్ను రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, కండె నర్సయ్య, స్థానిక నాయకులు మనోహర్, ఐలయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



## సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం

స్ట్రక్చర్ మీటింగ్ ఒప్పందాలకు సర్క్యులర్ జారీ చేయాలి

కొరిమి రాజ్‌కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సింగరేణి యాజమాన్యం స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పందాలపై సర్కులర్ జారీ చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి లోని కొమరయ్య భవన్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ మాతంగి రామచందర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సంక్షేమం కోసం, వారి ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ నిరంతరం పాటుపడుతుందన్నారు. గతం కంటే కాంగ్రెస్ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందన్నారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పందాలను సర్కులర్ రూపంలో జారీ చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. దీంతో కొంతమంది కార్మికులు ఇబ్బంది పడవలసి వస్తుందన్నారు. స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పందాలను సర్కులర్ రూపంలో యాజమాన్యంతో చర్చించడం జరిగిందన్నారు. సొంత ఇంటి పథకం అమలు చేయిస్తామని, మెడికల్ బోర్డులో అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్‌కు లైఫ్ టైం సూటబుల్ జాబ్ ఇప్పిస్తామని, డిప్లమా నాన్ డిప్లమా క్యాడర్ స్కీమ్ లో ఉన్న తేడాను సవరించి మైనింగ్ స్టాఫ్‌కి న్యాయంచేయాలని కోరడం జరిగిందని వివరించారు. సమావేశంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు, కార్మిక నాయకులు జి.శ్రీనివాస్, ఎం.విజేందర్, ఎండి.ఆసిఫ్ పాషా, జి.సుధాకర్ రెడ్డి, తోట రామచందర్, రవి నారాయణ, పోశం, మల్లికార్జున్, అన్ని గనుల పిట్ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి 13న రైతు పోరాటయాత్ర

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరి రావు



**ప్రజాపక్షం/నల్లగొండ :** దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయాన్ని తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా దానిని వ్యతిరేకిస్తూ భారత కిసాన్ సభ జాతీయ పిలుపుమేరకు ఆగస్టు 13న రాష్ట్రవ్యాప్తంగా రైతు సమస్యల పరిష్కారం కొరకు రైతులను చైతన్య పరిచేందుకు రైతు పోరాట యాత్ర చేపడుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరి రావు తెలిపారు. రైతు సంఘం నల్లగొండ జిల్లా కౌన్సిల్ సమావేశం ఎండి మొహినుద్దీన్ అధ్యక్షతన సోమవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యాదగిరిరావు హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం అనేక సవాలను ఎదుర్కోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. బిజెపి ప్రభుత్వం మార్కెట్ ప్రైవేటు చేయడాన్ని నియంత్రించడానికి రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు సూచించారు. బిజెపి పదేళ్ల పాలనలో గతం కంటే రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కౌలు రైతులను గుర్తించి రైతులతో పాటు వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను నివారించడానికి ప్రభుత్వం కృషి చేయాలని, రుణమాఫీ కానీ రైతులను గుర్తించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో యూరియా కొరత డిఏపి కొరత నివారించాలని రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉండేలా అధికారులు చూడాలన్నారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా దేశంలో రాష్ట్రంలో పాడి రైతులు పరిస్థితి అస్తవ్యస్తమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. నూతన వ్యవసాయ ప్రవేట్ మార్కెటును రద్దు చేయాలని, రైతు పోరాట యాత్ర లో మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం యాదగిరిరావు పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజా రామచంద్రం, జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా కనకయ్య, పల్ల రంగారెడ్డి,బండమీ వెంకన్న, బుర్ర శేఖర్, ధోటి పండరి, మద్దిరాల వెంకట్ రెడ్డి, శాంతా బండమీది యాదయ్య, పాండు రంగారెడ్డి, వి అంజల్ రావు, బొడ్డు వెంకటేశ్వర్లు, ఎం పాండు, కే దేవేందర్, ఎన్ కాంతారావు, వై.శ్రీశైలం పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## సమస్యల పరిష్కారానికి నిరహార దీక్షలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**మధ్యాహ్న భోజన వర్కర్స్ పెండింగ్ బిల్లులతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 6, 7 న జిల్లా లో నిరాహార దీక్షలు చేస్తున్నట్లు మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఎఐటి యుసి అనుబంధం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ తెలిపారు. సోమవారం ఈ విషయంపై భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరాహార దీక్షలకు సంబంధించిన వినతి పత్రాన్ని జెసి అశోక్ కుమార్‌కు అందజేశారు. సుగుణ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం 10,000 ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం కూడా కనీస వేతనం అమలు చేయాలని సుగుణ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెండు రోజుల నిరాహార దీక్షలను జిల్లావ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలత, సంపూర్ణ, లావణ్య లక్ష్మి సుగుణ, పద్మ, మణెమ్మ, కమల, భారతి పాల్గొన్నారు.

## సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను కలిసిన కలెక్టర్



**ప్రజాపక్షం/కాజీపేట :** రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి, సీనియర్ ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్ ను వరంగల్ ఎన్ఐటి వద్ద హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ కు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మొక్కను అందించి స్వాగతం పలికారు.

## హాస్పటల్ తనిఖీ.. విద్యార్థులతో భోజనం

జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్



**ప్రజాపక్షం/ జనగామ :** రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌తో కలిసి జనగామ పట్టణంలోని హన్మకొండ రోడ్డులో గల రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఆహార పదార్థాలును స్వయంగా పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం భోజం పెట్టాలన్నారు. నాణ్యమైన కూరగాయాలు వండాలని ఆదేశించారు. సాంఘీక సంక్షేమ పాఠశాలకు మంచి పేరుందని, ఇక్కడ చదవే విద్యార్థులు రాణిస్తున్నందున శ్రద్ధతో చదవాలని జీవితంలో రాణించాలని సూచించారు. బోజనం బాగుంటుందా.. మెనూ ప్రకారం వంట చేస్తున్నారా అని పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదవాలని, ప్రభుత్వం అవసరమైన మేరకు చేయూత అందిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, చదువుల్లో రాణించి ఉన్నంతులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వేల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు జిల్లా బాలికల పర్యవేక్షణ అధికారి గౌసియాబేగం, సివిల్ సప్లై డిటిలు శ్రీనివాస్, లచ్చునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మడత కాళీదాస్ 5వ వర్ధంతి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** సిపిఐ, కాళీదాస్ పోరాటల వల్లే ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరి వచ్చిందని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మేర భవన్‌లో అమరజీవి మడత కాళిదాస్ 5వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా షేక్ బాష్ మియా మాట్లాడుతూ కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం, చెల్పూర్‌లో కెటిపిపి స్థాపన కోసం, శ్రీరాంసాగర్ జలాల కోసం, వరంగల్ జిల్లాలోనే మొదటి భూపోరాటం ప్రారభించి సమరశీల పోరాటాలు చేయడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా పాల్గొని అనేక పోరాటాలు నిర్వహించి ప్రజా ఉద్యమాల్లో పాల్గొని అనేక అక్రమ కేసులను ఎదుర్కొని జైలుకు కూడా అనేక సార్లు వెళ్లిన త్యాగధనుడు మహామనిషి మడత కాళిదాస్ అని కొనియాడారు. ఆయన ఆశయాలైన వరంగల్ టు ఇండస్ట్రీయల్ కారిడార్ కోసం, వరంగల్‌లో భారీ పరిశ్రమల స్థాపన కోసం, గు డిసె వాసుల పట్టాలు పక్కా ఇండ్ల సాధన కోసం రానున్న రోజుల్లో పోరాటలను ఉధృతం చేస్తామని అన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు పనాస ప్రసాద్ మాట్లాడుతూ, వరంగల్ ప్రజలు మంచి నీరు తాగడానికి మడత కాళిదాస్ ఒకేసారి కెనాల్ ఫిల్టర్ బెడ్‌లు ఏక కాలంలో నిర్మించాలని కుండల ప్రదర్శనలు, ధర్నా, ప్రదర్శనలు అనేక సమరశీల పోరాటాలు నిర్వహించిన ఘనత కాళిదాస్ సొంతమని, సిపిఐ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన పోరాడిన గొప్ప వ్యక్తి మడత కాళిదాస్ అని నివాళులుర్పించారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు మునిగాల వేణు, ల్యాధల్ల శరత్, ఓర్సు రాజు, ఆరెల్లి రవి, గుడిశాల భిక్షపతి, కర్ర రవీందర్ రెడ్డి, అక్క పెల్లి సోమయ్య, కందిక పుష్ప, భూక్య లక్ష్మీ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో నెరవేరిన పేదవారి సొంతింటి కల

వర్ధన్నపేట వర్ధన్నపేట కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ఇందిరమ్మ రాజ్యంలోనే పేదవారి సొంతింటి కల అయిన ఇందిరమ్మ ఇళ్లు నెరవేరుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం హసన్‌పర్తి మండలంం గంటూరుపల్లె గ్రామంలో అర్హులైన 11 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మంజూరు పత్రాలు అందచేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు లోకబోయిన జ్యోతి రాజ్‌కుమార్ ఇంటికి ముగ్గుపోసే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులను ఆశీర్వదించి నిర్ణీత కాల వ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పరిశీలించి నూతన భవనాన్ని మంజూరు చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ. 175 కోట్లతో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్ ఛైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, హసన్‌పర్తి మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, అనంతసాగర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ బండ చంటిరెడ్డి, గ్రామాధ్యక్షుడు చాణక్యరెడ్డి, మండల యూత్ నాయకుడు చరణ్ మాధవిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వ అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ఎయిడ్స్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రత్యేక కృషి చేస్తుందని అంటు వ్యాధులు నియంత్రణలో రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి వాసం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో సీజనల్ వ్యాధులు నియంత్రణపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్త నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వ్యాధిసోకిన వ్యక్తులకు వెంటనే వైద్య సేవలు అందించడమే కాక, ఫాలోఅప్ చేయడం కూడా అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 200 మెడికల్ క్యాంపులు నిర్వహించామని, జ్వరం ప్రబలిన ప్రాంతాల్లో ఇంటింటి జ్వర సర్వేలు నిర్వహించి పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ నమోదైన కేసుల వివరాలను మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. 2023 వరదల సమయంలో ప్రజలు, పశువులు ప్రాణాలు కోల్పోయారని, ఇండ్లు కూడా దెబ్బ తిన్నాయని ఈ జిల్లాలో కలెక్టర్ గా విధులు నిర్వహించానని గుర్తు చేసుకున్నారు. విపత్తులు సమయంలో యంత్రాంగం సమర్ధతతో విధులు నిర్వహించిందని, కష్ట కాలంలో ఉన్న ప్రజలకు విశేషమైన సేవలు అందించారని గుర్తుచేస్తూ, అంటువ్యాధులు ప్రబల కుండా వైద్య సిబ్బంది చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముండటంతో పారిశుధ్యంపై అధిక దృష్టి పెట్టాలని, మురుగు నీరు నిలిచే ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి జరగకుండా బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వంటి చర్యలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ప్రాణాంతక వ్యాధుల నుండి ప్రజలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వైద్య సేవలకు జిల్లాలో ఎలాంటి మందుల కొరత లేదని స్పష్టంచేశారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో తనిఖీ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ల పనితీరు, టి హబ్ పరిశీలించామని తెలిపారు. ప్రజలు వైద్య సేవలకు క్యూ లైన్‌లో ఉన్నారని, రద్దీ లేకుండా ఓపి సేవలు సత్వరమే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహదేవపూర్, కాటారం ఆసుపత్రులను పరిశీలించానని, పారిశుధ్యం మెరుగ్గా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండి వైద్య సేవల్లో జిల్లాను నిలపాలని స్పష్టం చేశారు.బొప్పారం గ్రామంలో బాలిక డెంగీ వ్యాధికి గురైన కోలుకున్న సమాచారం తెలుసుకున్న ప్రాజెక్టు డైరెక్టర్ గ్రామంలో పర్యటించి అందించిన వైద్య సేవలను బాలికను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది సేవలు బాగా అందించారని, తనను ప్రాణాంతక వ్యాధి నుండి రక్షించారని బాలిక తెలుపగా వైద్య సిబ్బందిని అభినందించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అంటు వ్యాధులు నియంత్రణకు తీసుకున్న ముందస్తు చర్యలు వివరించారు. వైద్య సేవలకు వచ్చే ప్రజలకు సమయానికి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యాధి నియంత్రణ చర్యలు చేపట్టామని తెలిపారు. గత సంవత్సరం అంటు వ్యాధులు ప్రబలిన ప్రాంతాల్లో ఈ సంవత్సరం ముందస్తుగా వైద్య క్యాంపులు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని వివరించారు.ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ఉప సంచాలకులు నాగరాజు, ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ప్రజావాణి వినతుల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) సందర్భంగా బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అట్టి సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరిస్తూ వినతులు పెండింగ్ లో ఉండకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్ 22 హెల్త్ సానిటేషన్ 09 ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 12టౌన్ ప్లానింగ్ 52మంచినీటి సరఫరా 07హార్టికల్చర్ 01 ఎలక్ట్రికల్ 06 మొత్తం 109 ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సిఎంహెచ్ఓ డా॥ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఇ, సిటీ ప్లానర్‌లు మహీందర్, రవీందర్, రాడేకర్ వెటర్నరీ వైద్యులు డా॥ గోపాల్ రావు, హెచ్ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో భారీ వర్షం

**ప్రజాపక్షం / జనగామ:** జనగామలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. చిరు జల్లుతో ప్రారంభమైన వర్షం ఒక్కసారిగా కుమ్మరించింది. చుట్టు పక్కల మండలాల్లో మాత్రం ఎక్కడా అంత పెద్దగా వర్షం కురవలేదు. ఇజిల్లా వ్యాప్తంగా 15.4 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదు కాగా రఘునాథపల్లిలో 33.6, తరిగొప్పులలో 1, చిల్పూర్‌లో 7.8, జఫర్‌గడ్‌లో 8.4, స్టేషన్‌ఘనపూర్‌లో 25.6, నర్మెటలో 2.2, బచ్చన్నపేటలో 2.8, జనగామలో 58.4, లింగాలఘనపురంలో 18.6, దేవరుప్పులలలో 6.3, పాలకుర్తిలో 5.2, కొడకొండ్లలో 14.8 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 184.7 మిల్లీ మీటర్లు నమోదు కాగా ఆవరేజ్‌గా 15.4 మిల్లీ మీటర్లు నమోదైంది.

## శ్రీశైలం విహారయాత్రలో మానుకోట వాహనానికి ప్రమాదం

ఒకరు మృతి-ఇద్దరి పరిస్థితి విషమం

మిని వాహనంలో సుమారు 15మంది మేస్త్రీలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** ఈనెల 1న శ్రీశైలం విహరయాత్రకు వెళ్ళి తిరిగి వస్తున్న మానుకోట బాబునాయక్ తండాకు చెందిన సుతారి మేస్త్రిల వాహనం నల్గొండ జిల్లా నకిరేకల్ సమీపంలో ప్రమాదానికి గురైంది. సమీప మేస్త్రిల కథనం ప్రకారం ఈనెల ఒకటిన సుతారి మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం విహరయాత్రకని సుమారు 15 మంది మానుకోటకు చెందిన మేస్త్రీలు బయలుదేరి వెళ్ళారు. శ్రీశైలంలో దర్శనం చేసుకుని తిరిగి వస్తున్ననేపథ్యంలో నల్గొండ జిల్లా నకిరేకల్ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న ఆటోను తప్పించబోయి వారు వస్తున్న వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టడంతో అందులో బాబునాయక్ తండాకు చెందిన మంగీలాల్ మేస్త్రి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. అలాగే లాలు, రాము మేస్త్రీల పరిస్తితి విషమంగా ఉంది. క్షతగాత్రులను సమీప నల్గొండ ఆసుపత్రికి తరలించారు. వాస్తవానికి మరో 20మంది మేస్త్రీలు ఈ విహారయాత్రకు రావడానికి నిరాకరించారు. లేకుండా వారు కూడా ఈ యాత్రకు వెళ్ళేవాళ్లమని, ప్రమాదం తప్పిందని వారు ఊపిరి పీల్చుకున్నారు. మేస్త్రులకు ప్రతి నెల సంఘం ఆధ్వర్యంలో 1వ తారీకు సెలవు ఉంటుంది. దీంతో వారు ఈ విహరయాత్ర ప్రయాణం పెట్టుకున్నారు. 1వ తారీకు బయలుదేరి 2,3 తేదీలల్లో దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి మానుకోటకు తిరుగు ప్రయాణం పట్టారు. దీంతో తెల్లవారు జామున నల్గొండ సమీపంలో వారు వస్తున్న మిని వాహనం అదుపుతప్పి పల్టీ కొట్టింది. తెల్లవారు జామున కావడంతో వారిని ఆసుపత్రికి తరలించడంలో కొంచెం ఆలస్యం అయినట్లు తెలిసింది. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## సిపిఐ కలెక్టరేట్ ముట్టడి.. అడ్డుకున్న పోలీసులు

జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు సిపిఐ బృందం వినతిపత్రం



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం ప్రైవేట్ వ్యక్తుల చెర నుండి మానుకోట ఓసి క్లబ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఒసి క్లబ్ నుండి భారీ ర్యాలీ ప్రదర్శనగా తరలి చలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు అడ్డుకొని స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు సమస్య తీవ్రతను వివరించి అనంతరం మాట్లాడుతూ ఓసి క్లబ్‌ను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఓసి క్లబ్‌ను స్వాధీనం చేసుకొని ప్రజా బహుళ ప్రయోజనాల నిర్మాణ భవనాల సముదాయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తుల చెర నుండి ప్రభుత్వం, అధికారులు చొరవచూపి ఓసి క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 2014 నుండి దశలవారీగా క్లబ్ స్వాధీనం చేసుకోవాలని సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందని మున్సిపాలిటీలో ప్రజాక్షేత్రంలో క్లబ్ స్వాధీన కోసం ఆందోళన చేశామన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ ఎంపి బలరాం నాయక్ ప్రత్యేకంగా చొరవ చూపి స్వాధీనం చేసుకొని కళాక్షేత్రం ఎడ్యుకేషనల్ హబ్, స్కిన్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇండోర్ స్టేడియం, మున్సిపాలిటీ కాంప్లెక్స్ లాంటి ప్రజా బహుళ ప్రయోజన నిర్మాణ భవనాలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోకుంటే దశలవారీగా ఆందోళనలు చేస్తామని తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ గారికి సమస్య తీవ్రతను వివరించారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండ సందీప్, వెలుగు శ్రావణ్, నర్ర శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, తోట రాజకుమారి, నాగేల్లి యాకమ్మ, మంద శంకర్, ఆలేటి మహేష్, చిలువేరు వికాస్, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, ఎర్రోజు పద్మ, నాంచారి దాసు, దిద్ది నరసయ్య, బొమ్మలాలు, అల్లివేణుగోపాల్ రెడ్డి, మేక వెంకటేష్, కూరాకుల పాల్, తోట రమేష్, మెతుకు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాదుల కాల్వను పూర్తి చేయాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలం మీదుగా చేర్యాల మండలంలోని నాగపురి గ్రామ శివారు గండికుంట వరకు దేవాదులను పోతిరెడ్డిపల్లి బయ్యన చెరువు వరకు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం (ఎఐకెఎస్) ఆధ్వర్యంలో సోమవారం జనగామ కలెక్టరేట్ ముందు రైతులు ధర్నా నిర్వయించారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు ఆదిసాయన్న, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ బచ్చన్నపేట మండల శివారు నుండి ప్రారంభమైన దేవాదుల కాలువ చేర్యాల మండలం నాగపురి గ్రామ శివారు గండికుంట వరకు 2006తో తవ్వి పనులు నిలిపివేశారన్నారు. పోతిరెడ్డిపల్లి గ్రామ శివారు బయ్యన్న చెరువు వరకు భూములు సర్వే చేసి రైతులకు డబ్బులు కూడా చెల్లించారని, ఇరవై సంవత్సరాలు అవుతున్నా కాలువ పనులు పూర్తి చేయడం లేదన్నారు. ఈ కాల్వను పోతిరెడ్డిపల్లి వరకు పూర్తి చేస్తే సుమారు 700 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని, భూగర్భ జలాలు పెరిగి మరికొన్ని ఎకరాలకు నీరందడంతో పాటు బావులు, బోర్లలో నేటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే ఈ కాల్వ పనులు చేసి రైతులు ఆందుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ కాలువపై స్పందించకుంటే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు అందె అశోక్, వలబోజు నరసింహాచారి, రైతులు గూడూరి బాలరాజు, జింకల హరికృష్ణ, బట్టు భాస్కర్, కొక్కొండ రవీందర్, మాదబోయిన నరేష్, జోగు పరశురాములు, అప్పల బాలయ్య, కొక్కొండ పోషయ్య, పోరెడ్డి సత్యనారాయణ, పోరెడ్డి భాస్కర్, పోరెడ్డి అశోక్, అప్పల బాబు, కొక్కొండ మల్లేశం, కొక్కొండ పరమేష్, పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జితో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని తాగేడు మైదానంలో స్వాతంత్ర్యం దినోత్సవ వేడుకలకు స్టేజి ఏర్పాట్లు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జాతీయ పతాకావిష్కరణ సమయంలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టం పనితీరును ముందస్తుగా పరిశీలించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు స్టాల్‌లు ఏర్పాటు చేయాలని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేసే ప్రజలకు, అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి అసవరమైన త్రాగునీటి సౌకర్యం, ఇతర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్య వేడుకలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అలాగే ప్రభుత్వ శాఖల అధికారులు తమ కార్యాలయ సిబ్బంది అందరితో కలిసి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపెల్లి పంప్ హౌస్ ముట్టడి

భారీ ఎత్తున తరలివచ్చిన బిఆర్ఎస్ శ్రేణులు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**సాగునీటి సమస్యలతో సతమతవుతున్న రైతాంగానికి తెలంగాణ సర్కారు బిఆర్ఎస్ పార్టీపై కుట్రలు, కుతంత్రాలతో కాలయాపన చేయకుండా కన్నెపెల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపెల్లి పంప్ హౌస్‌ను సోమవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ పార్టీ నేతల బృందం కన్నెపెల్లి పంప్ హౌస్ ను ముట్టడించారు.దీంతో కన్నెపెల్లి పంప్ హౌస్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కన్నెపెల్లి పంప్ హౌస్ లోకి బిఆర్ఎస్ శ్రేణులు చొచ్చుకు వెళ్ళేందుకు ప్రయత్నించగా పంప్ హౌస్ గేటు వద్ద భారీ ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీనితో పంప్ హౌస్ గేటు వద్ద పోలీసులకు,బిఆర్ఎస్ శ్రేణులకు తోపులాట జరగగా పార్టీ నేతలు పోలీసులతో కొంత సేపు వాగ్వివాదం జరిగింది.పార్టీ శ్రేణులతో కలిసి బిఆర్ఎస్ నేతల బృందం పంప్ హౌస్ గేటు వద్ద బైఠాయించి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు కన్నెపెల్లి పంప్ హౌస్ మోటార్లను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేస్తూ రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వారం రోజుల్లోగా రేవంత్ సర్కార్ కన్నెపెల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేయకపోతే లక్ష మందితో ముట్టడించి పంప్ హౌస్ మోటార్లను మా సమక్షంలో ఆన్ చేస్తామని ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నేతలు రేవంత్ సర్కార్ ను హెచ్చరించారు. పలు జిల్లాల బిఆర్ఎస్ నేతలు, భారీగా పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కాళేశ్వరం ఆలయాన్ని దర్శించుకున్న బిఆర్ఎస్ నేతల బృందం కన్నెపెల్లి పంప్ హౌస్ ముట్టడించే కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నేతలు బృందం కాళేశ్వరం ఆలయాన్ని సందర్శించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత పరిరక్షణకు ప్రతినబూనాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత పరిశ్రమ పాలకుల దుష్టవిధానాలతో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో చేనేత పరిరక్షణకు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడేందుకు ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలు ప్రతినబూనాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చేనేత రంగ అభివృద్ధికి కార్మికుల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్లో తగిన నిధులు కేటాయించకుండా, ఉన్న సంక్షేమ పథకాలను రద్దుచేసి, చేనేతపై జిఎస్టి విధించి నేతన్నలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. చేనేత అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న పెద్ద మొత్తంలో నిధులుకేటాయించాలని, జిఎస్టి రద్దు చేయాలని, చేనేతకు కేటాయించిన రిజర్వేషన్లను అమలు జరుపకుండా మిల్లు యజమానులకు ఊడిగం చేస్తున్న పాలకులు తమ విధానాలను మార్చుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల అన్ని రకాల రుణాలను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా మాఫీచేయాలి.



# స్థానికం REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## కమిషనర్ పారిశుధ్యపనుల పరిశీలన



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని 1,2,22వ వార్డులలో సోమవారం నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి వేకువజామునే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాలలోని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పెద్దతండాలోని కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే పారిశుధ్య కార్మికులకు చేపట్టిన పనులలో పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రఘు, జవాన్ షేక్ జమాలుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.



## బాధితుల ఇండ్లకు వెళ్లి డబ్బును చెల్లిస్తున్న విద్యుత్ అధికారులు

విద్యుత్ కార్యాలయానికి వరుస కడుతున్న బాధితులు

**'అధికారి కాని సర్వాధికారి' కథనానికి స్పందన**

**ప్రజాపక్షం/అశ్వాపురం :** గత నెలలో అధికారి కాని సర్వాధికారి కథనానికి స్పందనతో బాధితులకు న్యాయం జరుగుతోంది. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వాపురం మండలంలో ప్రైవేట్ వ్యక్తి చేతిలో మోసపోయిన బాధితులకు ఆ శాఖ అధికారులు వారిపై అధికారులు ప్రెస్‌మీట్ పెట్టి చెప్పిన విధంగా ఖచ్చితంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన మాట ప్రకారం గత నెల నుండి ఎవరెవరైతే బాధితులు మోసపోయారో వారి సమాచారాన్ని సేకరించి బాధితులకు అధికారులు ఆ డబ్బులు చెల్లిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మా శాఖ తరపున ఎటువంటి తప్పులు జరిగినా వాటిని సరిచేసి బాధితులకు న్యాయం చేయడం మాత్రమే మాపని, ఆ విధంగానే ఆ ప్రైవేటు వ్యక్తి ఎవరెవరి దగ్గర ఎంత వసూలు చేశాడో ఆ సమాచారాన్ని అంతా సేకరించి, తద్వారా వచ్చిన డబ్బులు తిరిగి చెల్లిస్తున్నామని బాధితుల వైపునే విద్యుత్ శాఖ ఉంటుందని, ఎవరెవరైతే వినియోగదారుడు ఇంకా డబ్బులు రాని వాళ్ళు ఉన్నారో వారికి కూడా ఖచ్చితంగా న్యాయం చేస్తామన్నారు.

**ప్రజాపక్షానికి అభినందన :** నష్టపోయిన బాధితులు ఇన్ని సంవత్సరాలకు తిరిగి డబ్బులు తీసుకుంటున్నామంటే కేవలం ప్రజాపక్షంలో వచ్చిన కథనం ద్వారానే మాకు న్యాయం జరిగిందని సంతోషంగా కృతజ్ఞతలు తెలిపారు.



## ఇందిరమ్మ ఇంటి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మండల పరిధిలోని సిద్ధినేనిగూడెం గ్రామంలో లబ్ధిదారిణి వేల్పుల జ్యోతికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగా సోమవారం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ జెడ్పిటిసి సూరంశెట్టి నాగభూషణం ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలనలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వడమే కాకుండా అనేక సంక్షేమ పథకాలు అందించటం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీదేవి కుటుంబానికి ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/తల్లాడ :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన యోగా బోధకులు కందుల శ్రీదేవి ఇటీవల జ్వరంతో అకాల మృతి చెందగా యోగా టీచర్స్ కోఆర్డినేషన్ కమిటీ వారి సహకారంతో ఆర్థిక సహాయాన్ని అందించారు. శ్రీదేవి పాప చదువు కోసం తెలంగాణ యోగా టీచర్స్ కోఆర్డినేటర్ కమిటీ మహిళా సభ్యులు, యోగా ఆర్గనైజేషన్ సంస్థల సహకారంతో యోగా మాస్టర్ చింతకింద రామకృష్ణ సేకరించిన రూ.1,88,000 చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శ్రీదేవి కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందించిన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ సత్యరెడ్డి, రవికుమార్, వినోద్, బాహర్ అలీ, తల్లాడ యోగా గురువు వెంకటేశ్వర్లు, యోగా బోధకులు పద్మావతి, ఝాన్సీలక్ష్మి, సత్యనారాయణ, శ్రీకాంత్ కొండలరావు, అజ్మీరా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




## వైద్య విధాన పరిషత్ ఏరియా హాస్పిటల్ బోర్డ్ ఎక్కడ?

మారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేరు

**ప్రజాపక్షం/వైరా :** వైరాలో వైద్య విధానపరిషత్ ఏరియా హాస్పిటల్ కేటాయించారు. అప్పటి నుంచి వైరాలో వైద్యులు వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. కాని నేటికి వైద్య విధానపరిషత్ ఏరియా హాస్పిటల్ అని బోర్డ్ కూడా ఇక్కడ ఏర్పాటు చేయలేదు. ఇప్పటివరకు ఇక్కడ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైరా మండలం గొల్లపూడి కేటాయించారు. అయితే ప్రస్తుతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవరం గ్రామంలో ఏర్పాటు చేసి సేవలు కొనసాగిస్తున్నారు. కాని వైద్య విధానపరిషత్ ఏరియా హాస్పిటల్ అని వచ్చిన ప్రజలకు తెలియడానికి ఇక్కడ బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల పట్ల అధికారులు ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు జోక్యం చేసుకొని వైరాలో నడుస్తున్న వైద్య విధానపరిషత్ ఏరియా హాస్పిటల్‌కు బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నులి పురుగుల నివారణకు చర్యలు

19 ఏళ్ల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నులిపురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నులిపురుగుల నివారణకు చేపట్టే అల్బెండజోల్ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ దినోత్సవం ప్రతి ఏడాది నిర్వహిస్తామని, ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా అందించాలన్నారు. లేనిపక్షంలో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. నులిపురుగులు చాలా ప్రమాదకరమని, వీటి వల్ల రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌వో ఎ.పద్మశ్రీ, జెడ్పిసిఇఒ దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పదవీ విరమణ ఉద్యోగులను సన్మానించిన కలెక్టర్**

ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జులై నెలలో పదవీ విరమణ పొందిన 13 మంది అధికారులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వివిధ శాఖలకు సంబంధించిన ప్రిన్సిపాల్స్ డా.కె.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్లు, డ్రైవర్ డి.నర్సయ్య, లైబ్రేరియన్ సత్యనారాయణ, జూనియర్ లెక్చరర్ పివి.నాగేంద్రరావు, సూపరింటెండెంట్ ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్‌వో డా.కె.సుధారాణి, ఎంపిహెచ్‌ఎస్ విజయ్, హెల్త్ అసిస్టెంట్ ఎన్.ఎల్లస్వామి, సహాయ గిరిజనాభివృద్ధి అధికారి జహీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సబార్డినేట్ రాంచందర్, ఎపివో పద్మ తదితరులు పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో అభివృద్ధి పనుల జాతర

ఒక్కరోజే రూ. 665.81 కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

కొత్తగూడెంను ఆదర్శ నియోజక వర్గంగా నిలపడమే లక్ష్యం : కూనంనేని





**ప్రజాపక్షం/ఖమ్మం :** కొత్తగూడెం నియోజక వర్గాన్ని రాష్ట్రంలో అభివృద్ధిలో ఆదర్శ నియోజక వర్గంగా నిలపడమే లక్ష్యమని కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం విశేష కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. సోమవారం కొత్తగూడెం నియోజక వర్గంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి కొత్తగూడెం పట్టణంలో జెన్‌కో సిఆర్ఆర్ నిధుల నుంచి నిర్మించనున్న బిసి బాలికల భవన సముదాయాలకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలోని సాటివారిగూడెం, చేతకొండ, హమాలీకాలనీ, సంజయ్ నగర్, అశోక్‌నగర్ పంచాయతీల్లో రూ. 414.5 కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. చుంచుపల్లి మండలంలో రూ.64లక్షలు, సుజాతనగర్ మండలంలో రూ.87.3లక్షలతో నిర్మించే రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ భవనాలు, వాటర్ ట్యాంకులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలలో కూనంనేని మాట్లాడుతూ నిధుల కేటాయింపులో ఎటువంటి వ్యత్యాసం లేదని ఆయన తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాన్ని, జాప్యాన్ని సహించబోమని నాణ్యత లేకుండా, జాప్యం జరిగినా అధికారులే బాధ్యత వహించాలని కూనంనేని స్పష్టం చేశారు. ప్రజలకు అభివృద్ధి పనులు వీలైనంత తొందరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నియోజక వర్గంలోని ప్రతి పల్లెకు, ప్రతి బస్తీకి అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వీరబాబు, సొసైటీ అధ్యక్షులు వీర హన్మంతరావు, కార్పొరేషన్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు, సిపిఐ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, జమలయ్య, సత్యనారాయణ, చారి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల సదుపాయాలపై దృష్టి సారించాలి

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్




**ప్రజాపక్షం/కరకగూడెం :** కరకగూడెం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులతో సంభాషించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. బోధన విధానం, విద్యార్థుల ప్రతిభ, ఉపాధ్యాయుల పాఠన శైలి తదితర అంశాలపై ఆయన వివరంగా తెలుసుకున్నారు. కలెక్టర్ పాఠశాలలోని భోజనాల గది, వసతి గదులు, ఫర్నిచర్, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ డి.శ్రీదేవిని పిలిపించి వసతి, ఆరోగ్య పరిరక్షణ, టాయిలెట్లు, నీటి వసతి, కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులు వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేగాక కరకగూడెం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న తాత్కాలిక నవోదయ పాఠశాలను కూడా కలెక్టర్ సందర్శించారు. అక్కడి వసతి, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లను పరిశీలించి త్వరలోనే పాఠశాల ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి. మంజుల, తహశీల్దార్ గంట ప్రతాప్, డిప్యూటీ తహశీల్దార్ వట్టం కాంతారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. కృష్ణ ప్రసాద్, ఎఇ శ్రీనివాస్, ఎంపిడిఒ మారుతి యాదవ్, గ్రామ సెక్రటరీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలకు వీధిలైట్లు తక్షణమే ఏర్పాటు చేయాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి పాఠశాలకు వెళ్లే దారిలో తక్షణమే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. సోమవారం మండల కేంద్రం నుండి దాదాపు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న కెజిబివి పాఠశాలకు వెళ్లే మార్గంలో వీధి లైట్లు లేకపోవడం వల్ల రాత్రి అయితే చాలు అటు వెళ్లాలంటే సిబ్బంది, ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలంటే భయం భయంగా వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే మార్గంలో మొత్తం చెట్లతో కమ్మేస్తుందని, వీధిలైట్ లేకపోవడం వల్ల విషజీవులు తిరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే దారిలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



## ప్రజల విశ్వాసం పొందే విధంగా పనిచేయాలి : ఎస్పీ కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విధి నిర్వహణలో ప్రజల విశ్వాసం పొందేవిధంగా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించగా, జిల్లా నలుమూలల నుండి 21 మంది ప్రజలు, ఎస్పీకి నేరుగా తమ సమస్యలను తెలిపారు. సమస్యలను విన్న వెంటనే ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాల ఇచ్చి, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడు, పోలీసుల పట్ల గౌరవం, నమ్మకం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బాధితుల సమస్యలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులను ఆదేశించారు.



## టిడిపిపై బిఆర్ఎస్ నాయకుల విమర్శలు సిగ్గుచేటు

**ప్రజాపక్షం/మధిర :** బనకచర్ల ప్రాజెక్టు పేరుతో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత మంత్రి నారా లోకేష్‌పై బిఆర్ఎస్ నాయకుల అవాకులు, చవాకులు మానుకోవాలని టిడిపి రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు మల్లాది హన్మంతరావు, ఐటిడిపి నాయకుడు వేమూరి సునీల్ హితవుపలికారు. సోమవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు టిడిపిపై విషం చిమ్ముతున్నారని, సెంటిమెంట్ రాజకీయాలు చేసినా తెలంగాణ ప్రజలు పట్టించుకోరని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వంగాల రామకోటి, మండల అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, యలమంచిలి శివ, అనుమోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారమే లక్ష్యం

కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పౌరుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే స్పందించి వాటి పరిష్కారమే తమ లక్ష్యమని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ప్రజల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్త్‌జోన్, సౌత్‌జోన్, కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అభిషేక్ అగస్త్య పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి సత్వరమే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మూడు కార్యాలయాల నుండి 40 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు , ఇంజనీరింగ్ విభాగ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





## మణుగూరులో బ్లడ్ బ్యాంక్ ప్రారంభం

రక్తదానం చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరులోని వంద పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటుచేసిన రక్త నిల్వ కేంద్రం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, రిబ్బన్ కటింగ్ చేసి, బ్లడ్ బ్యాంక్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. రక్త నిల్వ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ స్వయంగా రక్తదానం చేసి ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలిచారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.."రక్తదానం అంటే ప్రాణదానం, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఇతరలకి జీవం పోసే వరంగా మారుతుందన్నారు. గర్భిణీలు, తలసీమియా, సికిల్ సెల్, అనీమియా వంటి వ్యాధులతో బాధపడేవారు, ప్రమాదాల వల్ల గాయపడిన వారు రక్తానికి ముఖ్యంగా ఆధారపడుతారన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండుసార్లు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా రక్తహీనతతో బాధపడే గర్భిణీలు, తల సేమియా, సికిల్ సెల్, అనీమియా, వంటి రోగులకు మరియు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ రక్తం ప్రాణ రక్షణగా మారుతుందన్నారు. మణుగూరులో ఈ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా, అత్యవసర పరిస్థితులలో పేషెంట్లకు రక్తాన్ని సమీపంలోనే అందుబాటులోకి తేవచ్చు అన్నారు. ఇప్పటి వరకు రక్త అవసరాల కోసం ఖమ్మం, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇకపై అది అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన స్ఫూర్తితో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. సందర్భంగా 20 మంది రక్తదానం చేశారు. నూతనంగా ప్రారంభించిన రక్త నిల్వ కేంద్రానికి సరిపడా రక్త నిల్వల కోసం ఈ రక్తాన్ని ఉపయోగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్వాతంత్ర్య దినోత్స వేడుకలు ఘనంగా జరిగేలా ప్రతి విభాగం తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. ప్రతి శాఖ నుంచి ప్రశంసా పత్రాల పంపిణీ కోసం నిర్దిష్టమైన సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు రావాలని కలెక్టర్ సూచించారు. ప్రశంసా పత్రాలు నిజంగా పనిచేసే సిబ్బందికి దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అన్ని శాఖల నుంచి బ్రీఫ్ నోట్స్ తెప్పించుకుని ముఖ్యఅతిథి సందేశం తయారు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం, పరేడ్ వంటి కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను పోలీస్ అధికారులు చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాల పంపిణీ కోసం ఆగస్టు 12 నాటికి ప్రతిపాదనలు అందించాలన్నారు. డిఆర్‌డిఒ ఆధ్వర్యంలో స్టాల్స్ వినూత్నంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు చేపట్టాలన్నారు. 30 నిమిషాల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేలా ప్రణాళికలు చేయాలన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికలు తయారు చేసి పంపాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులకు, వారి కుటుంబాలకు ఆహ్వాన పత్రాలు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ ఎ.పద్మశ్రీ, జెడ్పిసిఇఓ దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఎఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

# భావోద్వేగాలే విజయానికి కారణం

## 'చిట్‌చాట్'లో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం ప్రేక్షకులను మెప్పు పొందుతూ భారీ వసూళ్లను రాబడుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోంది 'కింగ్డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో తాజాగా దర్శకుడు గౌతమ్ తిన్ననూరి సోమవారం మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** కింగ్డమ్ విడుదలకు ముందు, విడుదల తరువాత ఎలా ఉన్నారు?**

విడుదలకు ముందు చివరి నిమిషం వరకు కూడా తుది మెరుగులు దిద్దడానికి ప్రయత్నిస్తుంటాం. దాని వల్ల నిద్ర కూడా సరిగా ఉండదు. విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక ప్రశాంతంగా నిద్రపోయాను.

*** 'కింగ్డమ్' అనే టైటిల్ పెట్టడానికి కారణం?**

ఏ సినిమాకైనా కథ రాసేటప్పుడు మొదట ఒక టైటిల్ అనుకుంటాం. జెర్సీ సినిమాకి కూడా మొదట అనుకున్న టైటిల్ 36. ఆ తర్వాత జెర్సీ టైటిల్ పెట్టాం. అలాగే, కింగ్‌డమ్ కథ రాసే సమయంలో కూడా కొన్ని టైటిల్స్ అనుకున్నాం. ఇందులో తెగ నాయకుడి పేరు 'దేవర నాయక'. దాంతో అదే టైటిల్ పెట్టాలనుకున్నాం. కానీ, ఎన్టీఆర్ గారి దేవర రావడంతో.. మరో కొత్త టైటిల్ చూశాం. 'యుద్ధకాండ' అనే టైటిల్ ను పరిశీలించాం కానీ, చివరికి 'కింగ్‌డమ్'ని ఖరారు చేశాం. కింగ్‌డమ్ అయితే అన్ని భాషల ప్రేక్షకులకు చేరువవుతుందనే ఉద్దేశంతో ఇది పెట్టడం జరిగింది. నా దృష్టిలో కింగ్‌డమ్ అంటే మనకి కావల్సిన వాళ్ళందరూ ఉండే ప్రాంతం లేదా మనం సురక్షితంగా ఉండే ప్రాంతం. ఒక్క మాటలో చెప్పాలంటే మన ఇల్లు లాంటిది.

*** హృదయం లోపల పాటను తొలగించడానికి కారణం?**

సినిమా విడుదలైన తరువాత.. అది చాలా పాపులర్ సాంగ్ కదా, దానిని ఎందుకు తొలగించారని అందరూ అడుగుతున్నారు. ఓటీటీ వెర్షన్ లోనైనా జోడించమని అడుగుతున్నారు. కథ రాస్తున్నప్పుడు ఆ సాంగ్ అవసరం అనిపించింది. కానీ, ఎడిటింగ్ సమయంలో కథ గమనానికి అడ్డంకిగా సాంగ్ మారింది అనిపించింది. అందుకే నేను, ఎడిటర్ నవీన్ నూలి గారు, నాగవంశీ గారు, విజయ్ గారు అందరం చర్చించుకొని.. హృదయం లోపల పాటను తొలగించాలని నిర్ణయించడం జరిగింది. ఓటీటీ వెర్షన్ లో ఆ సాంగ్ తో పాటు కొన్ని సీన్స్ కూడా జోడించే ఆలోచన ఉంది. నాగవంశీ గారితో చర్చించి దానిపై నిర్ణయం తీసుకుంటాం.

*** ఈ కథ రాసుకున్నప్పుడే విజయ్‌తో చేయాలి అనుకున్నారా?**

ఈ కథ ఆలోచన ఎప్పటి నుంచో ఉంది. ఈ కథకు తగ్గ నటుడు దొరికినప్పుడు చేయాలనే ఉద్దేశంతో.. పూర్తిస్థాయిలో డెవలప్ చేయనప్పటికీ, కథను రాసి పెట్టుకున్నాను. మొదట విజయ్‌తో చేద్దామనుకున్న కథ వేరు. కానీ, మా ప్రయాణం మొదలైన తరువాత.. విజయ్‌కి ఈ కథ సరిగ్గా సరిపోతుంది అని భావించి, ఆయనకు చెప్పడం జరిగింది. విజయ్‌కి కూడా ఈ కథ చాలా నచ్చింది.

*** 'మ్యాజిక్' అనే సినిమా కూడా చేశారు కదా?**

నాకు, వంశీకి సంగీతం నేపథ్యంలో ఒక సినిమా చేయాలనే ఆలోచన ఎప్పటినుంచో ఉంది. 'కింగ్డమ్' షూటింగ్‌కి సమయం పడుతుండటంతో.. ఆ గ్యాప్‌లో మ్యాజిక్ సినిమాని చేయడం జరిగింది. ఆ సినిమాకి ప్రధాన బలం సంగీత దర్శకుడు అనిరుధ్, సినిమాటోగ్రాఫర్ గిరీష్ గంగాధరన్.

*** 'కింగ్డమ్' రెండో భాగం ఎప్పుడు మొదలవుతుంది?**

రెండో భాగానికి సంబంధించిన మూల కథ ఉంది. స్క్రిప్ట్ వర్క్ కూడా త్వరలో ప్రారంభిస్తాం. అయితే పార్ట్ 2 కంటే ముందుగా.. మురుగన్, సేతు పాత్రల నేపథ్యంలో ఓటీటీ కోసం ఓ వెబ్ ఫిల్మ్ చేయాలని భావిస్తున్నాము.

*** దర్శకుడిగా ఈ ఎనిమిదేళ్ల ప్రయాణం ఎలా ఉంది?**

ఇంకొన్ని ఎక్కువ సినిమాలు చేసి ఉండాల్సింది అనిపించింది. అయితే కొన్ని కొన్ని మన చేతుల్లో ఉండవు. కోవిడ్ కారణంగా రెండేళ్లు పోయాయి. అలాగే ఒక్కోసారి స్క్రిప్ట్ కోసం ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తుంది. నా తదుపరి సినిమాలను వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తాను.

# 'రాజా సాబ్' హీరోయిన్ బర్త్‌డే పోస్టర్ రిలీజ్




బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ మాళవిక మోహనన్ రెబల్ స్టార్ ప్రభాస్ 'రాజా సాబ్'తో టాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇస్తోంది. సోమవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా మూవీ టీమ్ బర్త్ డే విశెస్‌తో స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో చీరకట్టులో ట్రెడిషనల్‌గా కనిపించి ఆకట్టుకుంటోంది మాళవిక. కొద్ది రోజుల క్రితం రిలీజ్ చేసిన 'రాజా సాబ్' టీజర్‌లో మాళవిక స్టన్నింగ్ లుక్స్, బ్యూటిఫుల్ అప్పీయరెన్స్‌తో సినీ ప్రియులను మెస్మరైజ్ చేసింది. ఈ మూవీలో మాళవిక నటన, అందం ప్రత్యేక ఆకర్షణ కానుంది.

# 'శ్రీ చిదంబరం' టైటిల్ గ్లింప్స్ విడుదల



కిరణ్ అబ్బవరం హీరోగా రూపొందిన 'క' చిత్రం ఎంతటి సన్సేషనల్ బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రంగా నిలిచిందో అందరికి తెలిసిందే. ఇప్పుడు 'క' చిత్రాన్ని నిర్మించిన మేకర్స్ మరో డిఫరెంట్ అండ్ న్యూ ఏజ్ కాన్సెప్ట్ ఫిల్మ్‌తో రాబోతున్నారు. శ్రీ చక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి వినయ్ రత్నం దర్శకుడు. వంశి తుమ్మల, సంధ్య వశిష్ట హీరో, హీరోయిన్ లుగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను సోమవారం కథానాయకుడు కార్తీకేయ (ఆర్ ఎక్స్ 100 ఫేం) విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# కిరణ్ అబ్బవరం కొడుకు పేరు 'హను'



కిరణ్ అబ్బవరం దంపతులు సోమవారం శ్రీవారిని దర్శించుకున్నారు. హీరోయిన్ రహస్య గోరఖ్‌ను పెళ్లి చేసుకున్న కిరణ్ అబ్బవరం దంపతులకు అబ్బాయి పుట్టాడు. కుమారుడికి నామకరణం చేసేందుకు కిరణ్ దంపతులుతిరుమలలో దర్శనం చేసుకున్నారు. శ్రీవారి ముందే 'హను' అనే నామకరణం చేసినట్లు కిరణ్ అబ్బవరం చెప్పారు.

# 8న 'సు ఫ్రమ్ సో' విడుదల



కన్నడలో ఇటీవల హిట్ అయినా 'సు ఫ్రమ్ సో' ఇప్పుడు తెలుగులో విడుదలకు సిద్ధమవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను ఆగస్ట్ 8న విడుదల చేయనుంది. వినోదాత్మకంగా సాగే ఈ సినిమాకు జేపీ తుమినాడ్ దర్శకత్వం వహించారు. ప్రధాన పాత్రల్లో షనీల్ గౌతమ్, జెపి తుమినాడ్ సంధ్య అరకెరె, ప్రకాష్ కె తుమినాడు, దీపక్ రాయ్ పనాజే, మైమ్ రాందాస్ నటించారు. శశిధర్ శెట్టి బరోడా, రవి రాయ్ కలసా, రాజ్ బి శెట్టి నిర్మించిన ఈ చిత్రం కన్నడలో బాక్సాఫీస్ వద్ద మంచి ఘన విజయం సాధించింది.ఎస్. చంద్రశేఖరన్ సినిమాటోగ్రఫీ, సుమేధ్ కె సాంగ్స్, సందీప్ తులసీదాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలుచాయి.

# విలన్ క్యారెక్టర్ ఫస్ట్‌టైం చేశా

## ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున




సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ నిర్మించిన క్రేజీ పాన్ ఇండియా యాక్షన్ మూవీ 'కూలీ'. కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. అమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతి హాసన్ ముఖ్య పాత్రల్లో కనిపిస్తున్నారు. డి.సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఆసియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆగస్టు 14న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'నిన్నేపెళ్లాడతా' చేసిన తర్వాత 'అన్నమయ్య' చేస్తుంటే.. 'ఇప్పుడెందుకు ఇలాంటి కథ' అని కొందరు నిరుత్సాహ పరిచే ప్రయత్నం చేశారు. అయితే నాకు కొత్తదనం ఇష్టం. సెట్‌కు వెళ్లాక బోర్ కొట్టకూడదంటే డిఫరెంట్ పాత్రలు చేయాలి. ఆ ప్రయత్నంతోనే ఇంతకాలం పని చేశాను. కొన్ని దెబ్బలు తిన్నా. మంచి మంచి విజయాలూ అందుకున్నాను. ఒకరోజు లోకేశ్ నన్ను కలిసి 'మీరు విలన్‌గా చేస్తానంటే మీకో కథ చెబుతా. లేదంటే కాసిన్ని సినిమా కబుర్లు చెప్పి టీ తాగి వెళ్లిపోతా' అన్నారు. లోకేష్ 'ఖైదీ,' విక్రమ్ నా ఫేవరట్ ఫిలిమ్స్. ఆ సినిమాలు చూసిన తర్వాత ఎప్పటికైనా ఈ దర్శకుడితో పనిచేయాలని బలంగా అనుకున్నా. 'కూలీ' కథ చెప్పిన తర్వాత నాకు చాలా నచ్చింది. 'రజనీ సర్ ఈ కథ ఒప్పుకొన్నారా' అని అడిగా. ఎందుకంటే ఈ కథలో 'సైమన్' పాత్ర కథలో ఆల్ మోస్ట్ హీరోలాంటిది. లోకేష్ హీరో విలన్స్‌ని ఈక్వెల్‌గా చూపిస్తాడు. నా కెరీర్‌లో మొదటిసారి లోకేశ్ కథ చెబుతుంటే రికార్డు చేసుకున్నా. ఇంటికి వెళ్లాక మళ్లీ మళ్లీ విన్నా. నాకు అనిపించిన కొన్ని మార్పులు చెప్పా. మరొకరైతే, ఈజీగా తీసుకుంటారు. కానీ, నేను చెప్పిన విషయాలు పరిగణనలోకి తీసుకుని 'సైమన్' పాత్రను లోకేశ్ తీర్చిదిద్దిన విధానం నాకు నచ్చింది. రజనీ సర్ చెప్పినట్లు ఎప్పుడూ మంచి వాళ్లగానే సినిమాలో నటిస్తే బాగుండదు కదా (నవ్వుతూ). వైజాగ్‌లో మా ఫస్ట్ షూట్ జరిగింది. రెండో రోజు షూటింగ్ సందర్భంగా రికార్డు చేసిన వీడియో సోషల్‌మీడియాలో లీకై వైరల్ అయింది. అది సీన్ చూసి 'మనుషులు ఇంత ఈవిల్ గా ఉంటారా?' అని లోకేష్‌ని అడిగాను. ఇంతకంటే ఈవిల్ గా ఉంటారని చెప్పారు. నాకు మూవీలో నెగెటివ్ రోల్ ఇచ్చినా ఈ పాత్ర చేసిన అనుభూతి పాజిటివ్‌గా ఉంది. థాయ్‌లాండ్‌లో 17 రోజుల పాటు రాత్రి పూట యాక్షన్ సీక్వెన్స్ తీశాం. దాదాపు 350మందికి పైగా చాలా కష్టపడ్డాం. చివరి రోజు మొత్తం అందరినీ రజనీ సర్ పిలిచి తలో ఒక ప్యాకెట్ ఇచ్చి ఇంటికి వెళ్లేటప్పుడు పిల్లలకు ఏమైనా తీసుకెళ్లండి అన్నారు. అంత మంచి హృదయం ఉన్న వ్యక్తి ఆయన. ఆయనతో కలిసి పని చేయడం వండర్ ఫుల్ ఎక్స్ పీరియన్స్. ఈ సినిమా చేస్తూ ఒక బెటర్ యాక్టర్ గా ఫీల్ అయ్యాను. ఈ సినిమా చాలా పెద్ద విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

# తెలంగాణ స్పోర్ట్స్ హబ్ కో చైర్మన్‌గా ఉపాసన

తెలంగాణ స్పోర్ట్స్ హబ్ కో చైర్మన్‌గా ఉపాసన కొణిదెలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం క్రీడా రంగానికి అధిక




ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఒక స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటు చేసింది. ఈ హబ్‌కు చైర్మన్, కో చైర్మన్, సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ హబ్‌లో బడా వ్యాపారస్తులు, క్రీడారంగానికి చెందిన ప్రముఖులు ఉన్నారు. ఈ హబ్ లోనే ఉపాసన కొణిదలను కో చైర్మన్‌గా నియమించారు.

# నార్త్ అమెరికాలో వార్-2 రికార్డు



యష్ రాజ్ ఫీలింగ్స్ యూనివర్స్ నుంచి రాబోతోన్న 'వార్-2' చిత్రంపై ప్రపంచ వ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి ఉన్న భారీ హైప్, క్రేజ్‌ని చాటేలా ప్రీ సేల్స్ జరుగుతున్నాయి. 'వార్ 2' సినిమాకు సంబంధించి నార్త్ అమెరికాలో ఇప్పటికే 100కె డాలర్లు క్రాస్ అయింది. ప్రీ సేల్స్‌తోనే 'వార్-2' సరికొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఉత్తర అమెరికా మార్కెట్లో యుఎస్‌డి 100,000 ముందస్తు టిక్కెట్ల అమ్మకాలను దాటిన అత్యంత వేగవంతమైన భారతీయ చిత్రంగా 'వార్ 2' నిలిచింది. కేవలం ఏడు గంటల్లోనే ఈ ఘనతను 'వార్ 2' సాధించింది. ఇక ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో 'వార్ 2' భారీ ఎత్తున విడుదల కాబోతోంది.

# మరో విషాదం

(మొదటి పేజీ తరువాయి)

భరించలేక మెరుగైన జీవితంకోసం సంపద్వంతమైన గల్ఫ్ అరబ్ దేశాలలో ఉపాధి వెతుక్కునేందుకు అక్రమ మార్గాల్లో ప్రయాణం చేసివెళ్ళే ఆఫ్రికా ప్రజల బోట్లు ఇటీవలికాలంలో సముద్ర జలాలలో ధ్వంసమవుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ క్రమంలో భాగంగా మరో విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ బోటులో మొత్తం 157 మంది ఇథియోపియన్లు ప్రయాణం చేస్తున్న సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. దీంతో యెమెన్ తీరం దక్షిణ అబెయాన్ రాష్ట్రం సమీపంలో బోటు బోల్తా పడిందని వలస ప్రజల అంతర్జాతీయ సంస్థ (ఐఓఎం)కు చెందిన యెమెన్ ప్రధానాధిపతి అబ్దుసత్తార్ ఎసోయెవ్ చెప్పారు. సహాయబృందాలు 12 మందిని మాత్రం కాపాడారని చెప్పారు. ఇటీవలి నెలల్లో ఈ విధంగా సముద్రంలో ప్రయాణిస్తున్న వలస ప్రజలు వందలమంది మరణించారని చెప్పారు. వలస ప్రజలు చట్టబద్ధమైన మార్గాలలో ప్రయాణం చేయడానికి అవకాశాలు ఇస్తే ఈ మరణాలు తగ్గుతాయన్నారు. సోమాలియా, జిబౌటీ, ఎరిత్రియా, ఇథియోపియా దేశాల నుండి ప్రధానంగా వలస ప్రజలు దారిద్ర్యాన్ని అధిగమించడంకోసం అక్రమ మార్గాల్లో చిన్న చిన్న బోట్లలో ప్రయాణాలు చేస్తున్నారు. చాలామంది వలస ప్రజలు తమ తుది లక్ష్యాన్ని సౌదీఅరేబియాగా ఎంచుకుంటున్నారు. అక్కడైతే సంపద తులతూగుతున్నదని, మంచి జీవితం, ఉపాధి లభిస్తుందన్న ఆశతో దుస్సాహసాలు చేస్తున్నారు. గడచిన మార్చినెలలో కూడా ఇదేవిధంగా యెమెన్ తీరంలోని ధుబాబ్‌జిల్లా సమీప సముద్రజలాలు కల్లోలంగా మారడంతో రెండు వలసబోట్లు తలక్రిందులై 180 మంది మరణించారు. సముద్ర జలాల్లో తీవ్ర ప్రమాదాలు పొంచిఉన్నప్పటికీ 2024లో ఆఫ్రికా నుండి దాదాపు 60,000 మంది వలస ప్రజలు యెమెన్ తీరానికి చేరుకున్నారు. గడ,చిన పది సంవత్సరాలకాలంలో దాదాపు 3,400 మంది కంటే ఎక్కువమంది వలస ప్రజలు సముద్ర ప్రయాణ సమయాల్లో మరణించారని ఐఓఎం తెలియజేసింది. వీరిలో 1400 మంది బోట్లు మునిగిపోవడంవల్లనే మరణించారు.

# కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కొండబాల



ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు బిఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన కొండబాల, దాదాపు 250 మంది ఇతర నాయకులు, కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కొండబాల కోటేశ్వరరావు తిరిగి సొంత గూటికి చేరడం పట్ల స్వాగతిస్తున్నానని అన్నారు. ఎఐసిసి విధివిధానాలు, సిఎం రేవంత్ రెడ్డి పాలన, డిప్యూటీ సిఎం తీసుకుంటున్న నిర్ణయాలకు ఆకర్షితులై కొండబాల కాంగ్రెస్‌లోకి తిరిగి రావడం స్వాగతించదగిన పరిణామం అని అన్నారు. ఆయన రాకతో ఖమ్మం జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ విశ్వాసం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ కొండబాల చేరికను స్వాగతించారు. సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉన్న కొండబాల, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల గురించి పూర్తి అవగాహన ఉన్న నాయకుడన్నారు. స్థానిక సంస్థలు, చట్ట సభలపై ఆయనకున్న అవగాహన పార్టీకి ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో కొండబాల కీలక పాత్ర పోషించాలని భట్టి విక్రమార్క కోరారు. ఈ చేరికలో మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహేశ్ కుమార్ గౌడ్ వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# పిటిషనర్‌కు ఫోన్ చేసిన కానిస్టేబుల్‌కు సమన్లు

## నేడు విచారణకు హాజరుకావాలని హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూదాన్ భూములను తప్పుడు సర్వే నెంబర్‌తో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొనుగోలు చేసిన వ్యవహారంపై ఎంక్వయిరీ కమిషన్ వేయాలని పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తిని బెదిరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మహేశ్వరం పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు స్వయంగా హైకోర్టు విచారణకు రావాలని జస్టిస్ కె.లక్ష్మ ణ్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం జరిగే విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. సర్వే నంబర్ 194లోని సుమారు 10 ఎకరాల భూమి వ్యవహారంపై వి. రాములు గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి నోటీసు జారీ చేయకుండానే ఆన్‌లైన్ ల్యాండ్ రికార్డుల్లో (భూభారతి) తన భూమి వివరాలను తొలగించారనే పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది విజయలక్ష్మి సోమవారం అత్యవసర లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. మహేశ్వరం పోలీస్ ఇన్‌స్పెక్టర్ తన క్లయింట్ రాములుకు పదిసార్లు ఫోన్ చేశారని, అయితే, రాములు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి నిరాకరించారని చెప్పారు. పోలీస్ స్టేషన్ నుండి వచ్చిన వ్యక్తి అరెస్టు చేస్తామని బెదిరించారని చెప్పారు. ఆ వ్యక్తి కానిస్టేబుల్ అని ప్రభుత్వ న్యాయవాది చెప్పారు. దీనిపై హైకోర్టు, రాములుకు తరచుగా ఫోన్ చేయడానికి కారణం ఏమిటని ప్రశ్నించింది. మంగళవారం జరిగే విచారణకు స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని కానిస్టేబుల్‌కు సమన్లు జారీ చేసింది.



# ద్వంద్వ వైఖరి

(మొదటి పేజీ తరువాయి)

వస్తున్నాయని ప్రశ్నించారు. బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల్లో నుంచి వందల కోట్లు అప్పులు తీసుకొని కట్టకుండా విదేశాల్లో తల దాసుకుంటున్నారని, అటువంటి వారిని ప్రధాని నరేంద్రమోడీ కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని కింగ్స్ పాలెస్ ఫంక్షన్ హాల్లో సోమవారం సిపిఐ జిల్లా 4వ మహాసభలు జరిగాయి. మహాసభలకు ముఖ్యఅతిథిగా కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం పేరుతో బిజెపి రాజకీయాలు చేస్తుందని అంబానీ, ఆదానీ ఆస్తులు పెంచడానికి మతం పేరు వాడుకుంటుందన్నారు. దేశంలో బిజెపి కొంత మంది ఆస్తులు పెంచడానికి పనిచేస్తుందని ఆరోపించారు. దేశంలో కమ్యూనిస్టులు ఉండొద్దు, ముస్లింలు, క్రిస్టయన్లు, ఉండోద్దు అనేది బిజెపి సిద్ధాంతమని, హిందూ మతం పేరు చెప్పి ఓట్లు దండుకునే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బిజెపి మతోన్మోద పార్టీ అని ఆ పార్టీని ఎదుర్కొనేది కమ్యూనిస్టులేనన్నారు. జిల్లా ఇంచార్జీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇటి నర్సింహ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం పోరాడే ఘనత సిపిఐదే అన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల కోసం అసెంబ్లీలో నిరంతరం గొంతెత్తి మాట్లాడిన వ్యక్తి కూనం నేని సాంభశివరావు అన్నారు. పది లక్షలకు పైగా భూములు పంచిన ఘనత సిపిఐ పార్టీదే అన్నారు. కేంద్రంలో బిజెపి పార్టీ వచ్చిన తరువాత డీజిల్, గ్యాస్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచారన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీర్ల ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలో రెండు వర్గాల మధ్య రాజకీయం నడుస్తుండేదన్నారు. గత పది సంవత్సరాలుగా అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు పట్టణాలకు వలస పోతున్నారని పరిశ్రమలు నిర్మించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. నిమ్జ్‌లో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలన్నారు. సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ పేదల కోసం కార్మికులు, బడుగు, బలహీన వర్గాల వారికి అండగా నిలుస్తూ పోరాడే పార్టీ సిపిఐ అన్నారు. ఈ సమావేశంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ తన గానంతో ఆహుతులను ఉత్తేజపరిచారు. అంతకు ముందు నారాయణ్ ఖేడ్ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. మృతి చెందిన సిపిఐ నేతలకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, గత మహా సభల నుండి నేటి వరకు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పిలుపులతో పాటు స్థానికంగా ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు నిరుద్యోగ యువత, విద్యార్థుల సమస్యలపై వివరిస్తు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు, గతంలో జరిగిన చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుంటూ భవిష్యత్తులో జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పార్టీ విస్తరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని జలాలోద్దీన్ పిలుపు నిచ్చారు. సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సిపిఐ నాయకులు తాజుద్దీన్, షపి రెహ్మాన్, ఆనంద్, లక్ష్మి రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హోదా

(మొదటి పేజీ తరువాయి)

తమ నిబద్ధతను చాటారు. అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పాల్గొన్నారు. ఓట్లు వేసి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. అయినా వారికిచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర హోదాను కేంద్రప్రభుత్వం పునరుద్ధరించలేదు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి తమ నీడలో ఉంచుకోవాలని కేంద్రం చూస్తోంది. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. దేశ సమాఖ్య స్ఫూర్తికి విఘాతం' అని డి.రాజా వెల్లడించారు. పార్లమెంటు వర్షకాల సమావేశాల్లో జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరద్ధరణ బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయించాలని, ఇందులో జాప్యం వద్దని సూచించారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడమన్నది కేంద్రం ఇచ్చే రాయితీ కాదని డి.రాజా నొక్కిచెప్పారు. అది న్యాయమైన చర్య... రాజ్యాంగబద్ధ దిద్దుబాటుగా వర్ణించారు. దేశ ఐక్యత, ప్రజాస్వామిక స్వీయ పరిపాలనను బలోపేతం చేసేందుకు అవసరమైన అడుగుగా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు న్యాయం జరిగేలా... వారంతా మరోమారు గౌరవంగా జీవించగలిగేలా, హక్కులు పొందేలా... ప్రజాస్వామిక స్వీయపరిపాలన అనుభవించగలిగే తక్షణమే చర్యలు తీసుకోవాలని, రాజ్యాంగబద్ధ హామీలకు కట్టుబడుతూ జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని డి.రాజా కోరారు. ప్రధాని మోదీ నుంచి సానుకూల స్పందనను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ప్రతిఘటన

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేట్ ప్రయోజనాల కోసం పణంగా పెడుతూ యుకెతో సెటా ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా భారత ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించాయి. అమెరికా బెదిరింపులను ధృడంగా తిరస్కరించకుండా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండిపోయిందని, అమెరికాకు అనుకూలంగా వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని అప్పగించడంలో భారత్ రాజీపడేందుకు సిద్ధపడిందని ఎద్దేవా చేశాయి. సెటా ఒప్పందం ప్రత్యక్షంగా భారత ఆహార భద్రత, ఆరోగ్యరక్షణ, ఆర్థిక స్వయం సమృద్ధిపై దాడి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం ద్వారా భారత మార్కెట్‌లలోకి చౌక పాలు, గోధుమ, మాంసం వంటి బ్రిటీష్ ఆగ్రిబిజినెస్ ఉత్పత్తులు వరదలా వస్తాయని తెలిపింది. గతంలో ఇండియా-ఆసియాన్ ఒప్పందం ద్వారా కేరళలో రబ్బర్ ధరలు 70 శాతం పడిపోయిన విషయాన్ని గుర్తు చేశాయి.

**పార్లమెంటు సమీక్షించాకే ఒప్పందాలు**

ట్రంప్ టారిఫ్ బెదిరింపులను భారతదేశం తిరస్కరించాలని, రష్యా సహా అన్ని దేశాలతో సర్వసత్తాక వాణిజ్య హక్కును సిర్థపరుచుకోవాలని కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం డిమాండ్ చేశాయి. పార్లమెంటు ఆమోదం లేకుండా చేసుకున్న భారత్-యుకె సెటా ఒప్పందాన్ని సమీక్షించి, తక్షణమే సమరించాలని కోరాయి. మరింత కార్పొరేట్ దోపిడిని నివారించేందుకు అమెరికా – భారత్ వాణిజ్య ఒప్పందాల కోసం జరుగుతున్న అన్ని రకాల చర్చలను నిలిపివేయాలని పేర్కొన్నాయి. ఇకపై ఎలాంటి రహస్య ఒప్పందాలు వద్దని, భవిష్యత్తులో అన్ని ఒప్పందాలు పార్లమెంటరీ సమీక్ష, ప్రజలతో సంప్రదింపుల ద్వారానే జరగాలని డిమాండ్ చేశాయి. ఈ నాలుగు డిమాండ్‌లతో ఆగస్టు 13న దేశవ్యాప్తంగా జరిగే ప్రతిఘటన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలకు కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కెఎం విజ్ఞప్తి చేశాయి.

# కాంగ్రెస్ చలో ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణులంతా ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. బిసి రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. బిల్లు ఆమోదించాలనే డిమాండ్‌తో 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ప్రతి జిల్లా నుంచి 25 మంది చొప్పున రైలులో వెళ్లారు. మరోవైపు బిసి రిజర్వేషన్ పెంపుపై చర్చ కోరుతూ మంగళవారం పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపిలు వాయిదా తీర్మానం ఇవ్వనున్నారు. ఈ నెల 7న ఆ పార్టీ నేతలు రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించినా కేంద్రం మోకాలడ్డుతోందని విమర్శించారు. రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తామన్నారు.

**కిషన్‌రెడ్డి, రామచందర్ రావు బిసి బిల్లుపై విషం కక్కుతున్న నోరు మెదపరా? : మహేష్‌కుమార్‌గౌడ్**

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బిసి రిజర్వేషన్ల బిల్లుపై విషం కక్కుతుంటే, ఆ పార్టీకి చెందిన బిసి ప్రజా ప్రతినిధులు ఎందుకు నోరు మెదపడం లేదని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. మైనార్టీల పేరుతో బిసి బిల్లును అడ్డుకునేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బిసి ఉద్యమంలో ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత పాత్ర ఏమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ బిసి బిల్లులకు మద్దతు ఇచ్చిన బిజెపి ప్రజాప్రతినిధులు ఇప్పుడు ఎందుకు తోక ముడిచారని మండిపడ్డారు. బిసిల ఓట్లు లేకుండా కిషన్ రెడ్డి మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయగలరా అని అన్నారు. కెసిఆర్ ఒంటెత్తు పోకడల వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుర్గతి పట్టిందన్నారు. కాళేశ్వరం విషయంలో వాస్తవాలు బయటికి వచ్చిన తర్వాతనే చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. తమ జనహిత పాదయాత్రలో ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో సంతృప్తి కనిపించిందని, పథకాలను ప్రస్తావిస్తూ అనేక చోట్ల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశం సించారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు జనహిత పాదయాత్ర చేపట్టామని, నెలకు నాలుగు, ఐదు రోజుల పాటు జనహిత పాదయాత్రను విడతల వారీగా నిర్వహిస్తామని, దీనికి సంబంధించి పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com